
ఆంధ్ర ప్రదేశ్

జూన్ 1973

50 పైసలు



ఆంధ్రప్రదేశ్ గురించి

- 1971 జనాభా లెక్కల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ జనాభా భారతదేశ జనాభాలో 7.93 శాతానికి, ఆంధ్రప్రదేశ్ విస్తీర్ణం భారతదేశ విస్తీర్ణంలో 9 శాతానికి సమానం.

- ఆంధ్రప్రదేశ్ విస్తీర్ణం 2.75,109 చ. కి. మీటర్లు.

- 1971 లో సేకరించిన లెక్కల ప్రకారం. ఆంధ్రప్రదేశ్ జనాభా 4,33,94,951 మంది. దేశజనాభా 54,69,55,945.

- 1971 లెక్కల ప్రకారం, రాష్ట్ర జనాభాలో అక్షరాస్యులు 24.56 శాతం మంది వున్నారు. 1961 లో 21.19 శాతం. భారతదేశం మొత్తంమీద వున్న అక్షరాస్యుల శాతం 1971 లో 29.35. 1961లో 24.03 శాతం.

- మన రాష్ట్రంలో జనాభా సాంద్రత చ. కి. మీ. 1కి 157 మంది హైదరాబాదు జిల్లాలో సాంద్రత చ. కి. మీ. 1కి, 362. అన్ని జిల్లాల కంటే యిది ఎక్కువ. అదిలాబాద్ జిల్లాలో జనాభా సాంద్రత 79 మంది. అన్నింటి కంటే యిది తక్కువ.

- రాష్ట్రంలో తలసరి సగటు ఆదాయం (1960-61 నాటి ధరలు) మొదటి ప్రణాళిక అంతానికి రూ. 281లు, రెండవ ప్రణాళిక అంతానికి రూ. 306లు, మూడవ ప్రణాళిక అంతానికి రూ. 333 ల చొప్పున ఉంది. నాలుగవ ప్రణాళిక ముగింపు నాటికి తలసరి సగటు ఆదాయం రూ. 430 లకు పెరుగుతుంది.

- రాష్ట్రంలో 1,000 అడుగుల లోతు మేరలో సుమారు 1,000 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలు వున్నాయి. 2,000 అడుగుల లోతు మేరలో 1,320 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలు లభించగలవని అంచనా.

- భారతదేశంలో, బారైట్స్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్‌దే అగ్రస్థానం. దేశంలో ఉత్పత్తి అయ్యే బారైట్స్‌లో 90 శాతం మొదలు 95 శాతం వరకు రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్నది.

- అభ్రకం ఉత్పత్తిలో బీహారు, రాజస్థాన్ రాష్ట్రాల తరువాత స్థానం ఆంధ్రప్రదేశ్‌ది.

ఆంధ్ర ప్రదేశ్

సంపుటి : 17

జూన్, 1973
జ్యేష్ఠం—ఆషాఢం 1894 శా. శ.

సంచిక : 7

ప్రధాన సంపాదకులు :
పెండ్యాల వామనరావు

సంపాదకులు :
ఈరంకి వెంకట సుబ్బారావు

దేశమును ప్రేమించుమన్నా
మంచియన్నది పెంచుమన్నా
వట్టిమాటలు కట్టిపెట్టోయ్
గట్టిమేల్ తలపెట్టవోయ్

ంట

ప ...నకొండ మ్యూజియంలోని బుద్ధుడు

చివరి అట్ట : నా... సౌందర్యం

సాలు చందా : ఆరు రూపాయలు

వెల : 50 పైసలు

రిజిస్టరు నెం : 133

ఈ సంచికలోని రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాలు తప్పనిసరిగా ప్రభుత్వానికి చెందినవిగా భావించ నక్కరలేదు.

సంచికలో

పేజీ

3. రాజా మహేంద్ర ప్రతాప్
7. సంక్షేమరాజ్యంలో అస్పృశ్యతానివారణ
9. వెంకటాయపాలెం గ్రామ పంచాయతీ ప్రగతి
12. ఓరుగల్లు పునరాక్రమణ
14. కొలనుపాక పుణ్యక్షేత్రము
16. తెలుగువారి ముచ్చట్లు
21. తెలంగాణా కవి పండితులు
26. గోబర్ గేస్ ప్లాంట్
29. రాకమ చర్ల క్షేత్రము
32. వందేమాతరం
35. మహా భారతము
40. గ్రంథ సమీక్ష
45. జిల్లా వార్తలు

మళ్లీ ప్రగతి పథంలో.....

రాష్ట్రపతిపాలన క్రింద సాధారణ పరిస్థితులు రాష్ట్రంలో నెలకొని సుస్థిరం కావడంతో, లోగడ కనీవినీ ఎరుగని గడ్డుకాలాన్ని అధిగమించిన ఆంధ్రప్రదేశ్ యిప్పుడు పాలనా నిర్వహణను త్వరితం చేసి అభ్యుదయానికి ఉద్దేశించిన పథకాలను అమలుచేసే నిర్మాణాత్మక కార్యక్రమాలలో క్రమంగా తన దృష్టిని కేంద్రీకరించి పనిచేస్తున్నది.

అంత గడ్డుకాలంలో కూడా రాష్ట్రంలో విద్యుచ్ఛక్తి, మంచినీటి సరఫరా ఆగిపోకుండా కొనసాగించగలగడం చాలా గణనీయమైన విషయం. వర్షాకాలం ఆరంభం కావడంతో ఈ సమస్య యింకా మెరుగుపడింది. లోగడ ఎంతో క్లిష్టమైన రక్షణ సమస్యలను, ఉక్కు ఉత్పత్తి విషయాలను నిర్వహించి అందరిమెప్పు పొందిన రాష్ట్ర గవర్నరు సలహాదారు శ్రీ హెచ్.సి. సరీన్, విస్తృతమైన క్లిష్టమైన యీ సమస్యను పరిష్కరించడంలో విశేషమైన ప్రజ్ఞా ప్రాభవాలను ప్రదర్శించారు. సమర్థులైన పాలనా నిర్వాహకులు శ్రీ వి.కె. రావు, శ్రీ సరీన్‌లు తనకు సలహాదారులుగా వుండగా, పరిణతి చెందిన రాజనీతి వేత్త అయిన గవర్నరు శ్రీ ఖండూభాయ్ దేశాయ్, ఎంతో జటిలమైన సమస్యను పరిష్కరించి అందరి మన్ననలూ అందుకున్నారు.

ఎడతెరిపి లేకుండా శ్రీ సరీన్ జరిపే పర్యటనలలో ఆంధ్ర ప్రాంతంలో వెళ్లిన చోటల్లా, మారుమూల గ్రామాల్లోనూ, పెద్ద పట్టణాలలోనూ ప్రజలు చూపిస్తున్న ఉత్సాహం, యిస్తోన్న ఘన స్వాగతాలకు సరియైన కారణం యిదికాక మరేముంటుంది? పరిపాలనా యంత్రాంగంలో మాటలకంటే చేతలు ప్రధానమనీ, కొత్తగా తలెత్తే సమస్యలన్నింటినీ అది పరిష్కరించడానికి సిద్ధంగా వుందనీ ప్రజలందరికీ సేవచేస్తూ న్యాయాన్ని కల్పిస్తుందనీ ప్రజల్లో విశ్వాసం కల్పించగలిగిన ప్రభుత్వ సామర్థ్యానికి యిదొక దృష్టాంతం. సమస్యలను పరిష్కరించడంలో శ్రీ సరీన్ చూపించే దృఢవైఖరి, అవలభించే మానవతా దృక్పథం ఎన్నో సత్ఫలితాలను యిచ్చాయి. అసంఖ్యాకంగా ఆయన ప్రారంభోత్సవాలు చేసిన హరిజన కాలనీలే, హరిజనుల సంక్షేమానికి ఆయన చేస్తోన్న యితోధిక కృషికి చిహ్నాలు. ఆయన ప్రారంభించిన స్వయం ఉపాధిపథకాలే ఆ విషయం మీద ఆయన చూపిస్తోన్న అత్యధిక శ్రద్ధాసక్తులకు నిదర్శనాలు. హరిజన హాస్టళ్లను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడంవల్ల ప్రభుత్వం విద్యార్థుల కృతజ్ఞతలను అందుకోగలిగింది. మరిన్ని పరిశ్రమలను స్థాపించడానికి ప్రభుత్వం కొత్తగా ప్రారంభించిన ఉద్యమం, అభివృద్ధి త్వరితం కావడానికి మార్గాన్ని సుగమం చేస్తుంది. సమస్యలు తలెత్తిన తర్వాత వాటి చిక్కుల్ని ఎలా విడదీయాలనే ధోరణి కాక, అసలు ఆ సమస్యలు ఉత్పన్నం కాక పూర్వమే వాటిని పరిష్కరించాలనే మనస్తత్వం ఆయనది. ఆంధ్ర ప్రాంతంలో గాని, తెలంగాణా ప్రాంతంలో గాని ఎక్కడ పర్యటించినా ప్రజలు అధిక సంఖ్యలో ఆయన చుట్టూ చేరడం–ఇంతవరకు ప్రభుత్వం ఆయా రంగాలలో తీసుకున్న చర్యలకు ప్రజల హర్షామోదాల్నే సూచిస్తాయి.

కరువు సహాయక కార్యక్రమాల్ని బాగా ఎక్కువ చేశారు. 1973 జనవరి మొదలుకొని కరువు సహాయక పనులకు, మంచినీటి సౌకర్యాన్ని కల్పించడానికి ఆపత్కాల తక్కావీ ఋణాలను మంజూరు చేయడానికి రూ. 23 కోట్లకు పైగా విడుదల చేశారు. రాష్ట్రంలో కరువు పనుల్లో ప్రతిరోజూ అయిదు లక్షలకుపైగా కార్మికులు పనిచేస్తున్నారు. ముఖ్యంగా చెప్పుకోవలసిన విషయమేమిటంటే కరువు సహాయక నిధులలో ప్రత్యేకంగా రూ. 8 కోట్లను అత్యధిక సంఖ్యాకులకు ఉపాధి కల్పించే ఉత్పత్తి వనరులను పెంపొందించే కొన్ని భారీప్రాజెక్టులకు కేటాయించారు.

ప్రత్యేక ఉపాధికల్పనా పథకంక్రింద 1973–74 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం యీ రాష్ట్రానికి రూ. 8 కోట్లు మంజూరు చేసింది. స్వయం ఉపాధికల్పనా పథకాలద్వారా 35 వేలనుంచి 40 వేల వరకు విద్యావంతులైన నిరుద్యోగులకు ఉద్యోగాలను సృష్టించడానికి యీ మొత్తం ఉద్దేశించబడింది. ఇందులో రూ. 3.5 కోట్లు ఖర్చయ్యే కార్యక్రమాలను పరిశ్రమల శాఖ అమలు పరుస్తుంది. 1972 సంవత్సరాంతానికి జిల్లాలలోని ఆయా ఉపాధికల్పనా కేంద్రాలలో నమోదైన విద్యావంతులైన నిరుద్యోగుల సంఖ్యనుబట్టి జిల్లాకు ఎన్నెన్ని ఉద్యోగాలను కల్పించాలో నిర్ణయించారు. యీ కార్యక్రమాన్ని అమలు పరచడానికి జిల్లావారీ ఉద్యమం ఒకటి ప్రారంభించబడింది.

కొన్ని నెలలక్రితం మామూలు జీవితం స్థంభించిపోవడానికి కారణమైన ఒక తీవ్రమైన అలజడిలో చిక్కుకుపోయిన రాష్ట్రం యిప్పుడు మళ్ళీ త్వరత్వరగా పూర్వస్థితికి చేరుకొంటోంది. ప్రగతి పథంలో పురోగమిస్తోంది.

–పి.వి.ఆర్.

భారత విప్లవ సామ్రాట్

రాజా మహేంద్ర ప్రతాప్

— వి. యల్. సుందరరావు

అనేక విప్లవోద్యమాలకు మూలపురుషులై—బ్రిటీషు ప్రభుత్వానికి సింహ స్వప్నంగా ఉండి మాతృదాస్య శృంఖల విచ్ఛేదనలో చావును గూడా పరిహసించి—భారతదేశ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకై ఉద్యమాలలో భాగ స్వామ్యం వహించి, పనిచేసిన మహిమాన్విత నాయకులు—యిప్పటికి కూడా మనమధ్యన ఉండి వారిదర్శన భాగ్యం లభింపజేయుట మన అదృష్టమనే చెప్పాలి.

భారత విప్లవ నాయకులకు అధినేత అయిన రాజామహేంద్ర ప్రతాప్ గారి జీవితంలోని కమనీయ సంఘటనలు. కొన్ని సంభాషణలు పరిచయం చేస్తాను.

స్వాతంత్ర్యం కోసం దేశంలోని ప్రజలు ఎన్ని ఉద్యమాలు నడిపి త్యాగాలు చేసి స్వాతంత్ర్య చరిత్రను సృష్టించారో అంత చరిత్రను దేశ సరిహద్దులకు అవల గూడా అన్ని ఉద్యమాలు నడిపి భారతీయులు అన్ని అనన్యత్యాగాలు చేశారు. సాధారణంగా వీరిలో కొంతమంది మహనీయుల చరిత్ర మాత్రమే ప్రజానీకానికి తెలుసు. వినాయక దామోదర సావర్కారు, సుభాస్ చంద్రబోస్. బాబా సోహన్ సింగు భాక్నాలాంటి వారిని కొన్ని పేర్లుమాత్రమే చెప్ప గలుగుతారు. మరింకెందరో మహానుభావులు గలరు చరిత్రలో.

ఒకనాడు తన అనుభవాలను ముచ్చటించుతూ 1915 లో తాను ఏర్పాటుచేసిన, 'స్వతంత్ర ప్రభుత్వ' విశేషాన్ని వివరిస్తూ "నలుబది సంవత్సరముల కదనంతరం నేతాజీ సుభాస్ చంద్రబోసు నా అడుగు జాడల్లో ప్రయాణం చేసి, మాతృదేశ విముక్తిని సాధించగలిగాడు" అని అన్నారు మహేంద్రప్రతాప్. అటువంటి విప్లవసామ్రాట్ జీవితానికి సరితూగ గలిగినది ప్రపంచ చరిత్రలోనే మరొకటి కానరాదంటే ఆశ్చర్యం అతిశయోక్తి కానేరదు.

జాతీయతకు వారి వంశం మారుపేరు

రాజా మహేంద్రప్రతాప్ మురసాన్‌లో జన్మించారు. మధుర బృందావన్‌కు ఉత్తరమున కాస్‌గంజికి పోవు రైల్వేలైను మీద హాధరస్ మొదటి స్టేషను. వీరు హాధరస్ రాజాగారికి పెంపు వెళ్ళారు. స్వతంత్ర భావాలకు, పౌరుషమునకు ఉత్తరదేశములో హాధరస్ రాజాలు మచ్చుతునకలు. వీరి పెంపుడు తండ్రి నారాయణసింగు. వారి తాతగారు మహారాజ దయారామ్. వీరు 1817 సం॥లో ఫిబ్రవరి—మార్చి మాసాలలో యింగ్లీషువారితో అతిభీషణ యుద్ధమును చేసిరి. హాధరస్ కోట శిథిలములు నేడుకూడా ఆ భీషణ సమరమును జ్ఞాపకం చేస్తూ ఉంటాయు. ఇచటి ప్రతి అంగుళము భూమి వారి పూర్వీకుల రక్తముతో తడిసియున్నది.

తరాలనాటి దేశభక్తి ప్రభావము స్వాభావికముగా ఆయన మీదపడినది. భారత దాస్య శృంఖలా విచ్ఛేదం తన కర్తవ్యంగా ప్రబోధం కలిగింది. ఆ రోజులలోనే అఖిల భారత కాంగ్రెసును స్థాపించారు. బెంగాలులో రాజకీయ చైతన్యంతో యువకులు జాతీయ



పోరాటానికి నాంది వాచకం పాడుతున్నారు. వంగరాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా స్వదేశ ఉద్యమం ఉధృతంగా సాగుతున్న రోజులవి. ఆ సమయములోనే శ్రీ రాజా మహేంద్ర ప్రతాప్ గారు అలీఘర్ లోని మహమ్మడన్ ఆంగ్లో వోరియంటల్ కాలేజీలో బి.ఎ. పట్టభద్రులయ్యారు. అప్పటికి 21 సంవత్సరముల వయస్సు.

జేంద్ మహారాజాగారైన శ్రీ రణవీర సింగుగారి సోదరి రాజకుమారి బలవీర కౌర్‌తో వివాహం జరిగింది. ఆమెకు రాజకుమారి భక్తి అనే కుమార్తె జనించి శైశవంలోనే 1909 లో చనిపోయినది. రాజకుమార్ ప్రేమప్రతాప్ సింగు అనే పుత్రుడు 1913 సంవత్సరంలో గలిగాడు. ఈయన కూడా 1947 సం॥లో స్వర్గస్థుడైనాడు.

జాతీయోద్యమ ప్రవేశం

1906 సం॥ లో దాదాబాయి నౌరోజీ గారి అధ్యక్షతన కలకత్తాలో జరిగిన కాంగ్రెసుకు వీరు హాజరైనారు. ఇచట బిపిన్ చంద్రపాల్, బాలగంగాధర తిలక్, బరోడా మహారాజుల వంటి పెద్దల సాహచర్యం లభించింది. మహాసభల నుండి

యింటికి తిరిగి వచ్చిన వెంటనే విదేశ వస్తు బహిష్కరణ కార్యక్రమం అమలు జరిపి-అన్ని వస్తువులను తగులబెట్టినారు. స్వదేశీ వస్తువులు మినహా ఉపయోగించమని ప్రతిజ్ఞ చేశారు. ఎన్నో లక్షలు విలువైన విదేశీ వస్తువులను పరశురామ ప్రీతి గావించారు.

ప్రేమ మహావిద్యాలయం

ఆందోళన రూపములోనే యీ బహిష్కరణ కార్యక్రమం నడుపుట శ్రీ రాజాగారిని సంతృప్తి పరచలేకపోయింది. దయనీయ మైన దేశంలోని పరిస్థితులను తొలగించుటకు దేశమును స్వయం పోషకము, శక్తివంతము చేయుటకు నిర్మాణ కార్యక్రమం అవసర మని గుర్తించారు. దేశ ఔన్నత్యము కొరకు పారిశ్రామిక శిక్షణ అవసరమని శిక్షణా సంస్థను నెలకొల్పుటకు నిశ్చయించుకొన్నారు.

రాజా హర నారాయణసింగు చారు బృందావన్ లోని కే. సి. ఘాట్ మీద తన భవనములో నివసించుచుండే వారు. రాజా మహేంద్ర ప్రతాప్ గారి నివాస స్థలం కూడా యిదే! ఆయన ఉదితముగా పరిశ్రమల యందు శిక్షణ నిచ్చు సంస్థను స్థాపించి తన మొత్తము సంపదను దానము చేయుటకు నిశ్చయించుకొన్నారు. కాని వారి పెంపుడుతల్లిగారు అభ్యంతరము తెలిపిరి. ఆ మీదట ఆ సంస్థ ఖర్చుకు తన సగము సంస్థానమును దానముగా యిచ్చి 1909 సం॥లో శిక్షణ సంస్థను స్థాపించినారు. ఈ ప్రేమ మహా విద్యాలయమును తన భవనములోనే స్థాపించినారు. ఈ ప్రయత్న ములో సలహా సంప్రదింపులద్వారా రాజాగారికి పండిత మదన మోహన సాలవ్యాగారు చాలా తోడ్పడి ఉన్నారని ఆయన అనేక సార్లు చెప్పారు.

శ్రీ రాజా మహేంద్రప్రతాప్ గారు ఎప్పుడు సంభాషణ ప్రారంభించినా యీ విద్యాలయాన్ని గురించే ముచ్చటించుతారు. "జాతీయ ప్రచారం ఉద్యమంలో ఒక భాగంగా మన నాయకులంతా జాతీయ విద్యాలయాలు విరివిగా స్థాపించి ఉండవలసింది. మన దేశానికి సాంకేతిక విద్య, యంత్రీకరణ అనే ప్రశక్తి చాలా అవసరం. యీ విషయాలు ప్రథమం నుండి నన్ను ఎంతో జిజ్ఞా సలో ఉంచాయి. అందుకనే నేను యీ సంస్థను స్థాపించి, ఆ తద నంతరం విదేశాలకు వెళ్ళటం, సాయుధ పోరాటం గురించిన ప్రయత్నాలు చేయటం జరిగింది. నాయకులందరిలో యీ ఆలోచనలు ఉంటే మన జాతిలో చాలా కాలం క్రితమే ఆధునీకరణ జరిగి ఉండేది" అని అన్నారు.

ఈ సంస్థ ద్వారా భారతీయ శిక్షణ చరిత్ర గమనమే ముందుకు సాగింది. సామాన్య విద్యకు గాని జాతీయ విద్యకుగాని నోచుకోని కాలంలో పారిశ్రామిక శిక్షణలకు విద్యాలయం నెలకొల్పారు. అప్పటి ఉత్తరప్రదేశ్ మొత్తంలో ఒక అల్లాబాదు విశ్వవిద్యాలయం మాత్రం ఉండేది. బృందావన్‌లో శ్రీ రాజామహేంద్ర ప్రతాప్ గారు యీ విద్యాలయం స్థాపించిన 7 సంవత్సరముల తదనంతరం కాశీ విశ్వ విద్యాలయం స్థాపన జరిగింది. అలిఘర్ విశ్వవిద్యాలయం 11 సం॥ల తదనంతరం జరిగింది.

పారిశ్రామిక శిక్షణాలయం

ఈ ప్రేమ మహా విద్యాలయము ఉన్నత పాఠశాల స్థాయి వరకు చదువుట వ్రాయుట-వడ్రంగము, కమ్మరము, యినుము పోతబోయుట, యింజనీరింగు శిల్పకళ, తివాసీలు, పింగాణీ సామాన్లు తయారుచేయుట, వస్త్రములు నేయుట, జంపకాణాలు తయారుచేయుట, కుట్టుపని, మైపు, షార్టుహాండు, బుక్కీపింగు, ఎకౌంటన్‌సీ మొదలైన కోర్సులతో ప్రారంభమైంది. దేశంలోని నలుమూలల నుండి విద్యార్థులు, అధ్యాపకులు వచ్చి చేరారు. యీ విద్యాలయాన్ననుసరించి అనేక చోట్ల చిన్న చిన్న సంస్థలు స్థాపించారు.

ఈ ప్రేమ మహావిద్యాలయం శ్రీ రాజావారివలెనే కొరకరాని కొయ్యగా, అణచరాని సంస్థగా, అనేక దశలలో వృద్ధిపొందుతూ వచ్చింది. ఈ విద్యాలయ ఆదర్శములైన శ్రమ, నిరాడంబరత-శ్రద్ధ, జాతీయత ద్వారా సురక్షితులైన దేశభక్తులను రూపొం దించే కర్మాగారంగా తయారైంది. వారు జరిపే చర్చలు, ఆలో చనలు, ఎంతో రాజకీయ చైతన్యంతో నిండి ఉండేవి. 1932 సం॥లో బ్రిటిషు ప్రభుత్వం ప్రత్యేక శాసనం ద్వారా యీ ప్రేమ మహా విద్యాలయాన్ని మూతవేసి సీలు చేసింది. తిరిగి 1937లో రాష్ట్రాలలో కాంగ్రెసు ప్రభుత్వాలు వచ్చాక ఆంక్షలు తొలగించ బడినాయి.

పరిస్థితుల అవగాహనకై దేశ విదేశీ పర్యటన

పిన్న వయస్సులోనే భారతదేశం నలుమూలలా పర్యటన గావించి పరిస్థితులను స్వయంగా అవగాహన చేసుకొన్నారు. 1907 సం॥లో ఆయన సతీమణితోను, ఆ పిదప ఒంటరిగా రెండు పర్యాయములు యూరపు దేశాలు పర్యటనగావించి వచ్చారు. 1910 సం॥లో అల్లాబాదులో జరిగిన అఖిల భారత కాంగ్రెసు సభలకు స్వర్గీయ మోతీలాల్ నెహ్రూకు కుడిభుజంగాఉండి పనిచేశారు. స్వర్గీయ గోపాలకృష్ణ గోఖలేగారితో దక్షిణాఫ్రికా వెళ్ళి 1920 సం.లో మహాత్మా గాంధీగారిని దర్శించి వచ్చారు.

గోపాలకృష్ణగోఖలేగారు రాజా మహేంద్ర ప్రతాప్‌తో గాంధీజీ ఎదుట ఒక మాట అన్నారట "మీరు గాంధీజీ-నిర్మాణ కార్యక్రమాలకు కొంత నిధిని సహాయం చేయండి" అని. "చేస్తాను" అన్నారట రాజావారు. ఒకనాడు సంభాషణలో ఆయన యీ విషయం ముచ్చటిస్తూ అన్నారు. "నేను మాట సామెతకు నిధిని పంపించుతానని అన్నానని అనుకున్నారు శ్రీ గోఖలేగారు. భారతదేశం వెళ్ళి జ్ఞాపకం ఉంచుకొని పైకం పంపించే పెద్ద మను షులు ఉన్నారా? అనుకున్నారు గాంధీగారు. బహుశా ఈ విధంగా అనేకం జరిగి ఉండవచ్చు వారి అనుభవంలో. నేను దేశం వచ్చిన వెంటనే రు. 5000 లు పంపించాను. పలువురూ ఆశ్చర్యం వెలి బుచ్చారు" అన్నారు.

చరిత్రాత్మకమైన నిర్ణయం చేసిన రోజు

1914 సం॥ డిసెంబరు 20వ తేదీ ఆయన జీవితంలో, భారత దేశ చరిత్రలో ఒక సుదినం. రాజా మహేంద్ర ప్రతాప్ భవనానికి

పచ్చని తోరణాలుకట్టి, విద్యుత్ దీపాలు వెలిగించిన కారణంగా వేడుకలు జరుపుతున్నారు. ఈ శుభ సమయంలో శ్రీ రాజావారు ఉత్తేజితమైన ఆలోచన చేశారు. ఆ ఆలోచనను ఒక పథకంగా రూపొందించి నిర్ణయాలు చేశారు. మొదటి ప్రపంచ సంగ్రామం ప్రారంభమై జర్మను సైన్యాలు యింగ్లీషు సామ్రాజ్యాన్ని తునాతునకలుగా ఖండింపుతున్న రోజులవి. కనుక జర్మను ప్రభుత్వ సహాయాన్ని అర్థించి యింగ్లీషువారిపై యుద్ధం చేయడానికి జాతీయ సైన్యాలను తయారుచేసి పోరాడాలని, తద్వారా మాతృదేశ విముక్తి సాధించాలని, పథకం తయారు చేసుకొన్నారు. ఆ నాటికి ఆయన వయస్సు 28 సం॥లు మాత్రమే ! వెంటనే బయలుదేరి తన కుటుంబాన్ని, స్వగృహాన్ని, భారత దేశాన్ని వీడి స్వాతంత్ర్య సాధనకై దీక్షబూని కానని దేశాలకు ప్రయాణమై వెళ్ళారు.

అప్పుడు ఆయన ఐదు సంవత్సరముల బాలిక, రెండు సంవత్సరముల బాలుడు, తన అనురాగవతియైన భార్యను వీడి వెళ్ళారు. తిరిగి వారిని చూసే అదృష్టం లేకపోయింది. యీ ఉదంతాన్ని ఆయన నాతో చెప్పేటప్పుడు “కొన్ని నిర్బంధాలకు ఒప్పుకొని భారతదేశం రావచ్చు. లేక కోర్టులో విచారణ కోరుకొని గడపవచ్చు. జైలులో నిర్బంధంలో ఉంటూ కుటుంబ విషయాలు చూసుకోవచ్చు. కాని స్వాతంత్ర్య సాధన కృషి అవిచ్ఛిన్నంగా జరుపుకొనుట దుర్లభం. యింగ్లీషువాళ్ళ విరోధులు అనేకులు, అనేక బలమైన దేశాలు ఉన్నాయి. వారి సహాయాన్ని అర్థించి అక్కడ పని చేయడం మంచిదని ప్రవాసంలో జీవితం అంతా గడిపాను. కుటుంబం వారి విజ్ఞప్తులు నన్నేమీ నా దీక్షనుండి సడలించలేకపోయినవి. నా గమ్యమైన స్వాతంత్ర్య సిద్ధిని సాధించాకనే భారతదేశంలో తిరిగి కాలూనగలిగాను.” అని అన్నారు.

ఈ కాలం 32 సం॥ లు. మాతృదేశవిమోచనకు యింత కంటే దీక్ష, త్యాగం, తపస్సు చేసిన మహనీయులు ప్రపంచ చరిత్రలోనే కానుపించుట దుర్లభమంటే అతిశయోక్తి కానేరదు.

జర్మను ప్రభువు కైజరుతో ఒడంబడిక

అనేక వ్యయప్రయాసల తదనంతరం 1915 సం॥ ఫిబ్రవరి 10 వ తేదీన జర్మను రాజధాని అయిన బెర్లిన్ మహానగరం చేరారు. జర్మనీలో ఆయనకు ఘన స్వాగతం లభించినది. జర్మను ప్రభువు కైజరుతో సంప్రదింపులు జరిపి ఆయన ప్రణాళిక ప్రకారం మన స్వాతంత్ర్య సైన్యాలకు జర్మను ప్రభుత్వం సహాయం చేయునట్లు వడబడికలు చేసుకొన్నారు. ఈ మేరకు కైజరు 26 సంస్థానాధీశులకు జాబులు వ్రాసి యిచ్చారు. రాజాగారికి శుభాకాంక్షలు తెలిపి డా॥ ఫాన్ హాంటీన్‌ను రక్షకదళాధిపతిగా వెంటపంపారు.

మార్గంలో టర్కీ రాజధాని యిస్తాంబులులో అచటి ప్రభువు సుల్తాన్ రిష్యాద్‌ను కలుసుకొన్నారు.ఆయన రాజాగారికి శుభాకాంక్షలు తెలిపి కెప్టెన్ కాజీమ్ బేగ్‌ను తన ప్రతినిధిగా రాజాగారి వెంట పంపించారు. శ్రీరాజాగారి భారత—జర్మన్—టర్కీ మిషను యిస్ఫాన్ మార్గముగుండా యిరాన్ భయంకర ఎడారిని దాటి అక్టోబరు 2 వ తేదీకి కాబూలు చేరుకొన్నారు

ఈ ప్రయాణ మార్గంలో యీయన మిషనుపై శత్రుదాడులు గూడా జరిగాయి. కొంతమంది పట్టుబడిరి. కొంతమంది చనిపోయిరి. ప్రతి ఒక్కరూ బాధలకు గురి కావలసి వచ్చెను.

ప్రథమ తాత్కాలిక హింద్ ప్రభుత్వం

కాబూలులో ప్రభుత్వ అతిథిగా శ్రీ రాజాగారు ఉన్నారు. బాగ్ బాబరు అనే రాజభవనంలో అన్నిలాంఛనాలతోటి డిసెంబరు 1 వ తేదీన తాత్కాలిక అఖిల హింద్ ప్రభుత్వాన్ని యేర్పాటు చేశారు. ఈ ప్రభుత్వానికి శ్రీ రాజా మహేంద్ర ప్రతాప్ అధ్యక్షులు. శ్రీ మకులానా బర్కతుల్లా ప్రధానమంత్రి. ఉబైదుల్లా, మన్సూరు, అన్సారీలు మంత్రులు. ఈ ప్రభుత్వానికి దిన ఖర్చు క్రింద కాబూలు ప్రభుత్వం రు. 25,000 లు యిచ్చేది. బెర్లిన్ నుండి కాబూలు చేరుటకు అయిన రెండున్నర లక్షల రూపాయల బత్తె ఖర్చులు జర్మను ప్రభుత్వం ఇచ్చుకొంది.

తన ప్రభుత్వంతో సహకరించి మాతృదేశ రుణం తీర్చుకోవలసిందిగా భారతదేశంలోని సంస్థానాధీశులను అభ్యర్థించుతూ జాబులు వ్రాశారు. గ్వాలియరు, బరోడా రాజులకు జర్మను ప్రభువు కైజరుచేత స్వయంగా వ్రాయించారు. ఈ పవిత్ర కార్యంలో తన ప్రభుత్వంతో సహకరించ వలసినదిగా శ్రీ రాజాగారు అనేక దేశాల లోని అధినేతలను కోరారు.

రష్యాలోని జారు ప్రభువుకు యీ అభ్యర్థన బంగారు రేకుపై వ్రాసి పంపారు. తరువాత బ్రిటీషు వారు యీ ప్రభుత్వ చర్యను బంగారు జాబు కుట్ర Golden Letter Conspiracy అని అభివర్ణించారు.

ద్వితీయ సాయుధ పోరాటం

బ్రిటీషువారి సైన్యాలకు భారతదేశం పరాధీనత పొందిన తదనంతరం 1857—58 సంవత్సరాలలో బహదూర్ షా నాయకత్వాన ప్రథమ స్వాతంత్ర్య పోరాటం జరగటం, ఢిల్లీ కోటపై స్వేచ్ఛా పతాకం ఎగురవేయడం జరిగింది.

కనుక శ్రీరాజా మహేంద్ర ప్రతాప్ అధ్యక్షతన ఏర్పాటైన ప్రభుత్వం యీ తాత్కాలిక హింద్ ప్రభుత్వం ద్వితీయ ప్రయత్నమనే చెప్పాలి. యిచ్చట 12,000 మంది ఆఫ్రిదీయులతో జాతీయ విముక్తి సేనలను యేర్పాటు చేశారు. వీరంతా అచటి కొండ ప్రాంతపు ప్రజలు. భారత సరిహద్దులపై దాడులుచేసి యీ సైన్యం కొన్ని ప్రదేశాలను ఆక్రమించాయి. శత్రు సరిహద్దు సేనలతో బలమైన పోరాటాలు జరిగాయి. మన విముక్తి సైనికులు చాల మంది నేల కొరిగారు. పట్టుబడిన వారిని ఉరితీశారు. మరి కొందరికి కారాగార శిక్షలు విధించారు.

జర్మనీ ప్రభువు కైజరుతో చేసుకొన్న ఒడంబడిక ప్రకారం జర్మనీనుండి 20,000ల ఆయుధ దళాలు జాతీయ విముక్తి సైన్యాలకు సహాయము రావలసి ఉంది. యిరు సైన్యాలు కలిసి భారతదేశంపై దండయాత్రలుచేసి ఆక్రమించుకోవాలని వ్యూహం తయారుచేశారు. ఏ కారణంచేతనో జర్మను సైన్యాలు రాలేక పోయినవి. మన ప్రయత్నం సఫలీకృతం కాలేదు.

> యిదే వ్యూహం రెండవ ప్రపంచ యుద్ధసమయంలో నేతాజీ సుభాస్ చంద్రబోసు జర్మను నియంత హిట్లరుతో ఒడంబడికలు చేసుకొని పోరాడిన సంగతి లోకవిదితమే. నేతాజీకి శ్రీ రాజాగారు మార్గదర్శకు లయ్యారనుటలో అతిశయోక్తి లేదు.

కామ్రేడ్ లెనిన్ సాహచర్యం

తన ప్రయత్నం విఫలమయ్యాక అఫ్‌గనిస్థాన్ రాజుదగ్గర నుండి పరిచయ పత్రాలు తీసుకొని మొదట టిబెట్, తరువాత చైనా ఆ తరువాత రష్యా చేరుకొన్నారు. కామ్రేడ్ లెనిన్ శ్రీ రాజావారికి ఆతిథ్యం యిచ్చారు. భారత విముక్తి ఉద్యమం, ఆ పరిస్థితులు చర్చలు జరుపుకొనేవారు.

> "రెండవ ప్రపంచ యుద్ధం సమాప్తమయ్యేలోపల భారత దేశ విముక్తి సాధ్యం అనే ఆలోచన కామ్రేడ్ లెనిన్‌తో చర్చించాను. ఆఫ్‌గనిస్థాన్ భారతదేశ సరిహద్దులలోని పరిస్థితి చూసి, అచటి వారితో సంప్రదింపులు జరిపి, భారత దేశంపై దండయాత్ర చేసి బ్రిటీషువారి నుండి విముక్తి చేయుటకు అవకాశాలు ఏమైనా అనుకూలంగా ఉన్నాయేమో చూచిరా, అని కామ్రేడ్ లెనిన్ నన్ను 1919 లో పంపించారు. పరిస్థితులు అనుకూలంగా లేవని తిరిగి వెళ్ళి చెప్పాక ప్రయత్నం విరమించడం జరిగింది" అని అన్నారాయన.

ఆనాడు రష్యాలో తన పలుకుబడిని గురించి ముచ్చటించుతూ "1927 సం॥లో స్వర్గీయ జవహర్‌లాల్ నెహ్రూ యూరపు వెళ్ళినపుడు రష్యా సందర్శించాలని కోరిక కలిగింది. రష్యా ప్రభుత్వం అనుమతించలేదు. నెహ్రూను రష్యా పిలవటం ఉపయోగంలేదని ఎవరో భారత కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు అడ్డుతగిలిన కారణంగా రష్యా ప్రభుత్వం అభ్యంతరం పెట్టింది. అప్పుడు నేను రష్యాలో ఉన్నాను. యీ సంగతి తెలిసి వారి విదేశీ కార్యాలయంలోని అభ్యంతరాన్ని తొలిగించి, రష్యా ప్రభుత్వం చేతనే నెహ్రూకు ఆహ్వానం పంపించే ఏర్పాటు చేయించాను."

> "అంతేగాదు. స్వయంగా స్విట్జర్ లాండు వెళ్ళి నెహ్రూకు యీ రష్యను ఆహ్వానాన్ని అందించాను" అన్నారు.

అమెరికా-జపాను దేశాలలోని కృషి

రష్యానుండి అమెరికా దేశం చేరారు. గదర్ వీరులు యితర భారతీయులతో చేతులు కలిపి అహర్నిశలు మాతృదేశ విమోచనకై కృషిచేశారు. అచట్నుండి జపాను చేరుకొన్నారు. ఎక్కడకు వెళ్ళినా, ఎక్కడ నివాసం చేసినా ఆయనది ఒక విప్లవ సంస్థ, స్వాతంత్ర్య యోధుల కూటమి వెంటనడుస్తూ వుంటుంది. ఆ యా ప్రభుత్వ అధినేతల దగ్గర భారత స్వాతంత్ర్య పథకం చర్చనీయాంశమౌతుంది.

అమెరికా నుండి జపాను చేరుకున్నారు. అగ్రనాయకులతో చర్చలు జరిపారు. వలస భారతీయులను కూడగట్టారు. వరల్డు ఫెడరేషను సెంటరు ఆఫ్ జపాను(world Federation Centre of Japan) అనే సంస్థను స్థాపించారు. పెద్ద భవన నిర్మాణం చేశారు. దానికి ఆయన అధ్యక్షులు. స్వర్గీయ రాష్ బిహారీబోస్ ఉపాధ్యక్షులు. ఆనంద మోహనరాయి కార్యదర్శి. విదేశీయుల సహాయంతో జాతీయ సైన్యాలు నిర్మాణం చేసి భారతదేశ విముక్తికోసం పోరాడటమే యీ సంస్థ ముఖ్యోద్దేశ్యం.

రెండవ ప్రపంచ యుద్ధం

రెండవ ప్రపంచయుద్ధం ప్రారంభం నుండి శ్రీ రాజామహేంద్ర ప్రతాప్ భావాలను జపాను ప్రభుత్వాధినేతలు అంగీకరించలేదు. కనుక, రాష్‌బిహారీబోసును ముందుకు నెట్టి జపాను ప్రభుత్వంతో ఒడంబడికలు చేయించారు. ఆయనే మొదటి జాతీయ సైన్యాలను నిర్మాణం చేశారు. 1943 లో నేతాజీ సుభాస్‌చంద్రబోసు దూరప్రాచ్యం వచ్చినప్పుడు రాష్‌బిహారీబోసు తన నాయకత్వాన్ని వారికి వప్పజెప్పారు. యింతకాలం శ్రీ రాజాగారు టోకియోలో ఉన్నప్పటికి, జపాను ప్రభుత్వం శ్రీ సుభాసుబాబును కలుసుకునే ఏర్పాటు చేయలేదు.

1945 లో జపాను, ఆజాద్‌హింద్ సైన్యాలు ఓడిపోయి మిత్రమండలి సైన్యాలు జపానును ఆక్రమించినప్పుడు, శ్రీ రాజావారిని జైలులో ఉంచారు. కొన్ని మాసాల తదనంతరం విడుదల చేయటం జరిగింది.

ప్రపంచ చరిత్రలోనే సాటిలేని మేటి విప్లవవీరుడు

1947 సంవత్సరం ఆగస్టు మాసంలో స్వాతంత్ర్యం సిద్ధించాక 32 సంవత్సరాల తదనంతరం భారతమాతను తిరిగి ఆలింగనం చేసుకోగలిగారు. బాల్యదశలో దేశంలో వదలి వెళ్ళిన ఆయన సతీమణిని పుత్రిణ్ణి యింతకాలం పెరిగి పెద్దలై వారు కన్నుమూసేటంతవరకు చూచుకోలేకపోయారు.

ఈ మహనీయుడు, విప్లవసామ్రాట్ రాజామహేంద్రప్రతాప్ చేసిన త్యాగాలకు భారతజాతి ఎన్నడు రుణం తీర్చుకోగలుగుతుంది? భారతజాతి చరిత్రలో యీ మహనీయుని కమనీయ గాథ ధ్రువతారలాగ నిలిచిపోతుంది.

చంద్రుని కొకనూలుపోగని 1957 లో స్వర్గీయ నెహ్రూగారి బలవంతంపై పార్లమెంటు సభ్యులుగా ఒక టరం చేశారు.

ఆయన హృదయంలో, భావనలో, దినచర్యలో యీ రోజుకీ భారతదేశం, భారతప్రజలు, వారి అభివృద్ధికి కృషి చేయటం మినహా వేరు ఆలోచనలు లేవు. అఖిల భారత స్వాతంత్ర్య సమర యోధుల సమితికి గౌరవాధ్యక్షులుగా ఉంటూ, అనేక సందర్భాలలో దర్శన భాగ్యం, వారితో చర్చలు, వారి అనుభవాలు వినే అవకాశం నాకు కలిగింది.

★

సంక్షేమ రాజ్యంలో

అస్పృశ్యతా నివారణ

కళింకోట ప్రభాకరదేవ్

"మంచి అన్నది మాల అయితే

మాలనేయగుదున్" అని అన్నారు గురజాడ అప్పారావుగారు. మనమంతా మానవులం. కులాలు, మతాలు మానవ కల్పితాలు. మనం కల్పించిన ఈ కులాలు మతాలు మనమధ్యన అడ్డుగోడల్ని ఏర్పరిచాయి. ఈ అడ్డుగోడల్ని పగులగొట్టి మనమందరం ఒక్కటే నన్న భావంతో సమైక్యతను సాధించాలి. అప్పుడే మనం ప్రగతిని సాధించగలుగుతాం.

'అస్పృశ్యత' అన్నది ఈనాటిదికాదు. మనిషిలో స్వార్థం, అహంకారం వెర్రితలలు వేసినకాలం నుండి ఈ అస్పృశ్యత సంఘంలో ఏర్పడివుంది. మనం గొప్పవాళ్ళం, వారు నిమ్నజాతి అన్న అహంకారమే ఈ 'అస్పృశ్యత' ఏర్పడడానికిగల మూల కారణం అని చెప్పవచ్చును. అన్ని మతాలు 'మనమంతా భగవంతుని బిడ్డలం' అన్న విషయంలో ఏకీభవిస్తున్నాయి. అటువంటప్పుడు పక్కవాడ్నిచూసి, వాడిది తక్కువజాతి యని అతడ్ని అంటరాని వాడిగా తలంచడం, ప్రవర్తించడం అపరాధమవుతుంది. అస్పృశ్యులు అన్న భావంతో వారికి దైనందిన అవసరాలు అందకుండా చెయ్యడం మానవతకే కళంకము.

గాంధీమహాత్ముడు తలపెట్టిన ఉద్యమాలలో అస్పృశ్యతా నిర్మూలన ఒకటి. తన ఆశయసిద్ధికిగాను, 'హరిజన్' అన్న వార పత్రికను మహాత్ముడు నిర్వహించేవారు. 'హరిజన్' ప్రారంభ సంచికలో గాంధీమహాత్ముడు 'హరిజన్' అనే మాటయొక్క పుట్టు పూర్వోత్తరాల గురించి యిలా వ్రాశారు. "హరిజన్" అనే మాటను నేను కనుగొనలేదు. కొన్నాళ్ళక్రితం నేను 'అస్పృశ్యులు' అనే మాటను 'నవజీవన్' పత్రికలో వాడినందుకు కొందరు అభ్యంతర పెట్టారు. అప్పుడు నేను పాఠకులను 'అస్పృశ్యులు' అనడానికి బదులుగా మరోమాటను సూచించమని కోరాను. అప్పుడొకరు 'హరిజన్' అనే పేరును సూచించారు. అంతేకాదు, అస్పృశ్యులు అనేమాటకు బదులుగా 'హరిజనులు' అనే మాటను ఒక ప్రఖ్యాత గుజరాతీకవి వాడినట్టుగా కూడా వారు ఉదాహరించారు. నాకుకూడా ఈ పదం సరిఅయినదిగా కనిపించింది. హరిజనుడంటే దేవుని మనిషనికదా అర్థం? అన్ని మతాలవారూ-స్నేహితులు లేనివారికి స్నేహితుడుగా, బలహీనులకు రక్షకుడుగా దేవుని వర్ణించారు. అంటరానివారుగా విభజించబడినవారికన్నా మనదేశంలో ఒంటరివాళ్ళు మరెవ్వరున్నారు? అందుచేతనే వీరు నిజంగా హరిజనులయ్యారు." 'హరిజన్' ప్రథమసంచికలో విశ్వకవి రవీంద్రుని కవిత ఒకటి ప్రచురింపబడినది. ప్రథమసంచికకు సందేశం పంపమని డాక్టర్ అంబేద్కర్‌కు మహాత్ముడు లేఖను వ్రాశారు. డాక్టర్ అంబేద్కర్ కొంచెం నిషూరంగా యిలా వ్రాశారు.

"నేను సందేశం పంపలేను. అంటరానితనమనేది వర్ణాశ్రమాలవల్లనే వచ్చింది. ఈ వర్ణాశ్రమధర్మం వున్నంతకాలమూ అంటరానివారూవుంటారు. వర్ణాశ్రమవ్యవస్థను సమూలంగా నాశనం చేసినప్పుడుకాని అంటరానితనం తొలగిపోదు." ఈ మాటలతో గాంధీమహాత్ముడు ఏకీభవించలేదు. అంబేద్కర్ వ్రాసిన వుత్తరానికి జవాబుగా గాంధీజీ అంటరానితనమనేది వర్ణాశ్రమధర్మంవల్ల వచ్చిందికాదని, ఎక్కువ తక్కువ భావనవల్లనే వుత్పన్నమైందనీ అన్నారు. అంటరానితనం నిర్మూలించడానికిగాను వర్ణాశ్రమ వ్యవస్థను కూలద్రోయడం కలుపుమొక్కలను పోగొట్టడంకోసం పంటను నాశనం చెయ్యడంలాంటిదని తెలిపారు.

హరిజనులుకూడా ఆర్యులే! మతంగ మహర్షి, ఆదికవి వాల్మీకి, వేదవ్యాసుడు, పరాశరమహర్షి, తిరుప్పాణియాళ్వారు, శ్రీ రామానుజులవారి ఆదిగురువు శ్రీతిరుకచ్చినంబి, రోహిదాసుడు, ప్రివక్త కపిలమహర్షి, ధర్మవ్యాధుడు, జమదగ్నిమహర్షి, పల్నాటి వీరుడు, కన్నమనీడు మొదలైన ఎందరో మహానుభావులు హరిజనులే. వీరి బోధనలు, ఆదర్శాలు మానవజాతికే

శిరోధార్యం. వీరందరిని అంటరాని వారుగా మనం భావించి చిన్న చూపు చూడగలమా? డా॥ అంబేద్కర్, సంజీవయ్య మొదలైన వారు లక్షలాది ప్రజలకు ఈ నాటి సంస్మరణీయులైనారు.

'చాతుర్వర్ణ్యం మయా సృష్టం
గుణకర్మ విభాగశః' – భగవద్గీత.

మనిషి గుణాన్నిబట్టి, పనిని (వృత్తిని) బట్టి మానవ జాతిని నాలుగు వర్ణాలుగా విభజించాను అని శ్రీ కృష్ణ భగవానుడు తెలిపెను. అంతేకాని ఒకరు ఎక్కువ జాతివారని, మరొకరు తక్కువ జాతివారని, అస్పృశ్యులని చెప్పలేదు. అయితే శూద్రులు, బ్రాహ్మణులు ఎవరు! శూద్రత్వం బ్రాహ్మణత్వం అంటే ఏమిటి? శూద్రబ్రాహ్మణత్వాలు ఒకే మనిషిలో అతడి విజ్ఞాన, సంస్కార స్థాయిని బట్టి ఏర్పడతాయి. 'జన్మనా జాయతే శూద్రః' మనిషిని శూద్రత్వం నుండి బ్రాహ్మణత్వానికి వికసింపజేయడమే ఆర్యమత లక్ష్యం. ఈ లక్ష్యాని సాధించే ప్రతి మనిషి ఆర్యుడే.

'న జాతిః పూజ్యతే రాజన్
గుణాః కల్యాణ కారకాః
చండాల మపి వృత్తస్థం
తం దేవా బ్రాహ్మణం విదుః' –భారతం

హరిజనుల కష్టాలను చూసి చలించిన మహాత్ముడు మానవతాదృష్టితో వారికి న్యాయం జరగాలన్నాడు. హరిజనోద్ధరణ జరగాలన్నాడు.

"మనం ఉన్నతులం. వారు నిమ్నజాతివారు అన్న స్వార్థ లక్ష్యం వుంటే అది సాధ్యం కాదు. దానికి తోడు మతం కూడా జోడిస్తే మనం రెండు తప్పులు చేసిన వారమవుతాం. అందుకనే బాగా చదువుకున్న పండితులు వచ్చి అస్పృశ్యత వంటి దురాచారాన్ని శాస్త్రిసమ్మతమని వాదిస్తే నాకు హృదయ విదారకంగా వుంటుంది. హిందువులకి అది నచ్చినా నచ్చకపోయినా అశ్పృశ్యత తొలగిపోక తప్పదు. కాని మనంతట మనమే మన తప్పుని మనం ప్రాయశ్చితం చేసుకుని, మనస్సు పరివర్తనం చేసుకుని, పవిత్రులమయితే, చరిత్రలో ఆ ఒక్కపనిని సువర్ణాక్షరాలలో లిఖించవచ్చును ...... హరిజనులకి సేవచేయడం మన విధి. అందులో దగాకి స్థానం లేదు. నిజాయితీతో అహింసాత్మకంగా అది సాగాలి. అది త్యాగంద్వారానూ, తపస్సుద్వారానూ సాధించాలి. మనం ఆత్మ పారిశుద్ధ్యం సాధించలేని నాడు హరిజనులు మనను విశ్వసించరు. నేడు మనంచేసే ప్రతి పనిని వారు అనుమానంతోనూ, అపనమ్మకంతోనూ చూస్తారు. ఇంతవరకు మనం వారిపై స్వారీచేస్తున్నాం. మనం వారికి న్యాయం చేకుర్చాలంటే గుర్రందిగి, వారినికూడా యితర సవర్ణులని చూచినటు చూడాలి,—ఆలయాలలోనికి వారిని స్వచ్ఛందంగా రానిస్తేతప్ప హరిజనోద్ధరణ పూర్తికాదు. ఆలయాలు తెరచిననాడు మనం వారికికూడా మత సమానత్వం చేకూర్చిన వారమవుతాం. ఆలయాలు హరిజనులకు తెరచిననాడు పాఠశాలలు, నూతులు మొదలయిన యితర సౌకర్యాలు కూడా వారికి వాటంతటవే లభిస్తాయి. మనం అస్పృశ్యతను నిర్మూలించినట్లయితే హిందూ మతంపైగల ఒక పెద్ద మచ్చ తొలగించటమేకాక, దానివల్ల యావత్ప్రపంచంలోనూ సత్ఫలితాలు కల్గుతాయి."

మహాత్ముని సందేశాలను దృష్టిలోనుంచుకుని మనం హరిజనుల యెడల సోదర భావంతో ప్రవర్తించాలి. సమాజంలోని అట్టడుగు ప్రజానీకం అభ్యుదయానికి మనరాజ్యాంగం అంకితమై వున్నందువల్ల, సోషలిజాన్ని స్థాపించాలని మనం లక్ష్యం ఏర్పరచుకోవడంవల్ల, బలహీన వర్గాలైన హరిజనులకు, గిరిజనులకు మరింత న్యాయం చేకూరుతుందని మనం ఆశించ వచ్చును. ప్రభుత్వం అస్పృశ్యతా నివారణకు ఎన్నో జాగ్రత్తలు తీసుకుంది. హరిజనోద్ధరణకై అనేక పథకాలను రూపొందించి వాటిని అమలు జరిపిస్తున్నది. మానవతాదృష్టితో నిండిన ఈ పథకాల వలన హరిజనులకు మహాత్ముడు ఆశించిన న్యాయం జరుగుతున్నదని చెప్పవచ్చును.

మాతంగకన్య - పరమేశ్వరి అవతారం!

మాణిక్య వీణాం ఉపలాలయంతీం
మదాలసాం మంజుల వాగ్విలాసాం
మహేంద్ర నీలద్యుతి కోమలాంగీం
మాతంగకన్యాం మనసా స్మరామి.

మాతా, మరకతశ్యామా,
మాతంగీ మధుశాలినీ,
కుర్యాత్ కటాక్షం కల్యాణీ,
కదంబ వనవాసినీ ?

జయ మాతంగ తనయే!
జయ నీలోత్పల ద్యుతే!
జయ సంగీత రసికే!
జయ లీలాశుకప్రియే!

—కాళిదాసు.

జయ మాతర్విశాలాక్షి!
జయ సంగీత మాతృకే!
జయ మాతంగి! చండాలి!
గృహీత మధుపాత్రకే!

—శ్యామలా స్తోత్రం.

వెంకటాయపాలెం గ్రామపంచాయతీ ప్రగతి

మధురశ్రీ

తూర్పుగోదావరి జిల్లాలో 1970–71 సంవత్సరానికి ఉత్తమ పంచాయతీగా ఎన్నికైన వెంకటాయపాలెం పంచాయతీ అనే టప్పటికి తూర్పుగోదావరి జిల్లా వాసులకు ప్రాంతీయ అభివృద్ధి పథకం జ్ఞప్తికి వచ్చి తీరుతుంది. జిల్లా అభివృద్ధి మండలి ఏర్పడిన తర్వాత మత్స్యఫలాభివృద్ధి, ప్రాంతీయ అభివృద్ధి పథకం మొట్ట మొదటగా వెంకటాయపాలెంలో విజయవంతముగా ప్రయోగాత్మకంగా నిర్వహించబడింది. ఈ పథకం నిర్వహణకు వెంకటాయపాలెం గ్రామ పంచాయతీ సర్పంచ్ శ్రీ పిల్లి అప్పారావుగారు ఉత్సాహంగా సహకరించారని తూర్పుగోదావరి జిల్లాపరిషత్తు అధ్యక్షులు శ్రీ ఎస్. బి. పి. బి. కె. సత్యనారాయణరావుగారు చెప్పారు. ఈ ప్రాంతీయ అభివృద్ధి పథకానికి రూపకల్పన చేసిన వారిలో ముఖ్యులైన తూర్పు గోదావరి జిల్లా పరిషత్తు అప్పటి కార్యదర్శి శ్రీ కళా వెంకటరావుగారు కూడా అధికారుల, అనధికారుల ప్రశంసల నందుకున్నారు. వెంకటాయపాలెంలో మత్స్య ఫలాభివృద్ధి పథకం నిర్వహణకు తూర్పుగోదావరిజిల్లా పరిషత్తు, కపిలేశ్వరపురం పంచాయతీ సమితి పెట్టుబడి పెట్టాయి.

కపిలేశ్వరపురం బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసరు చెలికాని వెంకట్రావుగారిని ఇంటర్వ్యూ చేసినప్పుడు ఈ పథకం గురించి ఇలా వివరించారు. "వెంకటాయపాలెం ప్రాంతీయ అభివృద్ధి పథకం ఉత్పత్తి పెంపుదలకై ఉద్దేశించబడినది. ఈ పథకం క్రింద వెంకటాయపాలెం గ్రామంలో పాడుబడిన చెరువు పునరుద్ధరింపబడింది. ఇప్పుడు ఆ చెరువులో చేప పిల్లలను వేసి పెంచటం జరుగుచున్నది. చెరువుగట్లపై కూరగాయల మొక్కల పెంపకం జరుగుచున్నది. గట్లపై వేసిన మొక్కలవల్ల చెరువు కన్నుల పండువుగా ఉండటమేగాక ఆదాయాన్ని కూడా సమకూరుస్తున్నది.

ఈ పథకం నిర్వహణకు ఏ ఏ సంస్థలు ఎంతెంత డబ్బు సమకూర్చాయని ప్రశ్నించగా, బి. డి. ఓ. శ్రీ చెలికాని వెంకట్రావు గారు ఇలా వివరించారు, "ఈ పథకాన్ని వెంకటాయపాలెం గ్రామ పంచాయతీ నిర్వహించింది. తూర్పుగోదావరి జిల్లా పరిషత్తు ఈ పథకానికి, 7,500 రూపాయలు, కపిలేశ్వరపురం సమితి



వెంకటాయపాలెంలో ఉత్పత్తి పథకాన్ని ప్రారంభిస్తున్న మాజీమంత్రి శ్రీ పెనిగళ్ళ సత్యనారాయణగారు.

10,000 రూపాయలు; వెంకటాయపాలెం పంచాయతీ 5,000 రూపాయలు పెట్టుబడి పెట్టాయి. పెట్టుబడి పెట్టిన మొదటి సంవత్సరములోనే చేపల అమ్మకం, కూరగాయల అమ్మకం ద్వారా 4,045 రూపాయల ఆదాయం లభించింది. చెరువు గట్లపై వేసిన 203 కొబ్బరి మొక్కలద్వారా ఐదు సంవత్సరాల తర్వాత సంవత్సరానికి 6,000 రూపాయల చొప్పున ఆదాయం వస్తుంది. ఈ పథకాన్ని అమలుపరచడంవల్ల సాలీనా 3 టన్నుల చేపలు, 15 వేల కొబ్బరికాయలు ఉత్పత్తి అవుతాయని అంచనా.


ఈ పథకం మొత్తం మీద తూర్పుగోదావరి జిల్లాకే ఆదర్శ వంతమయింది.

ఈ పథకాన్ని అమలు పరచిన ఈ వెంకటాయపాలెం పంచాయతీ కపిలేశ్వరపురం సమితి లోనిది. ఈ పంచాయతీలో 3600 మంది నివసిస్తున్నారు. కోటిపల్లి, ద్రాక్షారామం రోడ్డులో ద్రాక్షారామానికి రెండు మైళ్ళ దూరంలో ఉంది గ్రామం. కాకినాడ నుంచి కాకినాడ–కోటిపల్లి బస్సులో ప్రయాణం చేస్తే ద్రాక్షారామం దాటిన తర్వాత ఈ గ్రామం మనకు కనబడుతుంది. నిర్విరామంగా కృషి చేయటం ద్వారా పంచాయతీని ప్రగతి పథంలో పురోగమింప జేస్తున్న శ్రీ అప్పారావుగారు తూర్పు గోదావరి జిల్లాలో పంచాయతీ రాజ్య కార్యకర్తలకు మార్గదర్శకులైనారు.

శ్రీ అప్పారావుగారు పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికయ్యే సమయానికి గ్రామంలో ఉన్న పరిస్థితిని పోల్చి చూస్తే గ్రామ లో ఎంత అభివృద్ధి జరిగిందో మనకు అర్థమవుతుంది.

మొదట్లో పరిస్థితి

మొదట్లో ఆ గ్రామపంచాయతీకి కార్యాలయ భవనం లేదు. సహకార సంఘానికి కార్యాలయ భవనం లేదు. గ్రామంలో సరి అయిన రహదారులు లేవు. హరిజనులకు నివాసానికి స్థలం లేదు. విద్యుచ్ఛక్తి ఒక వీధికి మాత్రమే ఉండేది. త్రాగటానికి సరిఅయిన నీటి వసతి లేదు. పశుసంపద అభివృద్ధిగురించి రైతులు అంతగా పట్టించుకొనే వారుకాదు.



గ్రామ పంచాయతీ కార్యాలయ భవనం

గ్రామపంచాయతీ కార్యాలయానికి శాశ్వత భవనాన్ని నిర్మించింది. ఈ భవన నిర్మాణానికి పన్నెండు వేల రూపాయలు ఖర్చు పెట్టింది. వెంకటాయపాలెం పంచాయతీ కార్యాలయ భవన స్థలాన్ని శ్రీ సూద్గంశెట్టి ప్రకాశంగారు పంచాయతీకి దానం చేశారు. పంచాయతీ కార్యాలయ భవనం చుట్టూరా మొక్కలను నాటించి ఆ కార్యాలయానికి శోభ చేకూర్చటం జరిగింది. వివిధ ఫల పుష్ప వృక్షాలమధ్య ఎంతో మనోహరంగా ఉందా కార్యాలయం.

సహకార రంగంలో ముందంజ

వెంకటాయపాలెం గ్రామప్రజల ఆర్థికాభివృద్ధికి గణపతి సేవా సహకార సంఘం ఎంతో దోహదం చేసింది. 1962వ సంవత్సరంలో ప్రారంభించబడిన ఈ సహకారసంఘం శ్రీ అప్పారావుగారు అధ్యక్షులు అయ్యే సమయానికి 500 మంది వాటాదారులతో 7,453 రూపాయల వాటా ధనంతో పనిచేస్తున్నది. ఆ సంవత్సరంలో ఈ సంఘం 30,693 రూపాయల ఎరువులు, 4,085 రూపాయలు విలువగల పంచదార అమ్మకం చేసింది. శ్రీ అప్పారావుగారి తీవ్రకృషివల్ల పట్టుదలవల్ల అన్నివిధాల ఈ సహకార సంఘం అభివృద్ధి చెందింది. గత ఇరవై సంవత్సరాలుగా సక్రమంగా పని చేయని ఈ సంఘం చైతన్యవంతమై ప్రగతి పథంలో పయనిస్తున్నది. ప్రభుత్వం నుంచిగాని ఏ యితర సంస్థల నుంచిగాని సహాయం లేకుండానే ప్రజలు యిచ్చిన 6,500 రూపాయల విరాళంతో, 1,235 రూపాయల సహకార సంఘం సాధారణ నిధులతో సహకార సంఘం కార్యాలయ భవన నిర్మాణం జరిగింది. కార్యాలయ భవనం నిర్మించబడిన స్థలాన్ని శ్రీ కుడుపూడి పోతురాజుగారు విరాళంగా యిచ్చారు.

ఈనాడు సహకార సంఘంలో 700 కుటుంబాలవారు సభ్యత్వం స్వీకరించారు. వాటాధనం 42,000 రూపాయలకు పెరిగింది. సంఘ సభ్యత్వంలేని కుటుంబం లేదు. 1964–65 సంవత్సరంలో అన్ని కుటుంబాలను సభ్యులుగా చేర్పించినందుకు వెంకటాయపాలెం సహకార సంఘం ఉత్తమ సహకార సంఘంగా ఎన్నికైనది. ఈ సహకార సంఘానికి 1,40,017 రూపాయలు విలువగల ఆస్తులు ఉన్నాయి. 1968–69 సంవత్సరంలో స్వల్ప వ్యవధి అప్పులుగా 2,33,900, ఇతరరకాల అప్పులుగా 21,596 రూపాయలు సభ్యులకు అందజేసింది ఈ సహకారసంఘం.

గ్రామ పంచాయతీ విద్యుత్ సౌకర్యం అన్ని వీధులకు విస్తృత పరచింది. ఈనాడు 13 శివార్లకు విద్యుత్ సౌకర్యం ఉంది. అన్నివీధులలో కలిపి 67 విద్యుద్దీపాలు వెలుగుతున్నాయి.

హరిజనులకు సేవ


పంచాయతీ తీసుకొన్న శ్రద్ధవల్ల రెండు ఎకరాల 28 సెంట్ల భూమిని ప్రభుత్వం ఉచితంగా హరిజనులకు నివేశన స్థలాలుగా ఒకచోట యిచ్చింది. ఇదికాక ఊళ్ళో మరొకచోట 35 సెంట్ల భూమిని కూడ హరిజనులకు యిచ్చింది.

మంచినీటి సౌకర్యం కోసం వెంకటాయపాలెం పంచాయతీ ఆరు మంచినీటి బావులను 6,080 రూపాయలు ఖర్చుచేసి త్రవ్వించింది.

వ్యవసాయరంగంలో......

గ్రామ రైతాంగం ప్రయోజనం కోసం వెంకటాయపాలెం గ్రామ పంచాయతీ లాభం, నష్టంలేని పద్ధతిపై క్రిమి సంహారక మందులుకొని రైతులకు అమ్మింది. గత సంవత్సరము 3,292 రూపాయలు విలువచేసే మందులను కొని గ్రామ పంచాయతీ రైతులకు అమ్మింది. గ్రామపంచాయతీలో నాలుగు సాధారణ స్ప్రేయర్లు ఒక పవరు స్ప్రేయరు ఉన్నాయి. గత సంవత్సరంలో ఈ స్ప్రేయర్ల అద్దెవల్ల 250 రూపాయల ఆదాయం సమకూడింది. ఈ గ్రామంలో 25 ఫిల్టర్ పాయింట్లు, 8 ఆయిలు యింజనులు రైతులకు ఉన్నాయి. రైతులు మేలిరకం వంగడాలను ఉపయోగించి అధికోత్పత్తికి కృషి చేస్తున్నారు. సర్పంచ్ శ్రీ అప్పారావుగారు కూడా ఒక ఆదర్శ కర్షకులే.

పశుగణాభివృద్ధికిగాను ఒక గ్రామీణ కీలక ఉపకేంద్ర భవనాన్ని 14 వేల రూపాయలు ఖర్చుచేసి నిర్మించింది. ఇందులో కపిలేశ్వరపురం సమితి రెండు వేల రూపాయలు మాత్రమే భరించింది. మిగిలిన 12 వేల రూపాయలు ప్రజలనుంచి విరాళా



కీలక పశుగణాభివృద్ధి కేంద్రం

లుగా ప్రోగు చేయటం జరిగింది. ఈ కీలక కేంద్రం ప్రారంభించక పూర్వం పశుగణాభివృద్ధికి ఈ గ్రామపంచాయతీ ఒక ఆబోతును పోషించింది.

వెంకటాయపాలెం పంచాయతీ ఒక గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్నది. ఈ గ్రంథాలయంలో 400 పుస్తకాలున్నాయి. రెండు సమాజ వికాస రేడియోలు నిర్వహించబడుతున్నాయి. అందులో ఒకటి హరిజనులకు ప్రత్యేకించ బడినది.

వెంకటాయపాలెం గ్రామంలో ఇప్పటికి 32 మంది కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకున్నారు.

ఆదాయ వనరులు

పన్నుల విధింపునకు, వసూలుకు గ్రామ పంచాయతీ అనేక చర్యలు తీసుకొంది. పన్నుల వసూళ్ళలోను విధింపులోను కూడా వెంకటాయపాలెం ఒక అడుగు ముందంజ వేసింది. 1964 సంవత్సరంలో 944 రూపాయలు ఇంటి పన్ను వేస్తే ఈ నాడు 1,831 రూపాయలు ఇంటి పన్ను వసూలు చేస్తున్నది. చేపల పరిశ్రమ పంచాయతీ ఆదాయాభివృద్ధికి తోడ్పడింది. చేపల పెంపకం ద్వారా మొదట్లో 160 రూపాయలు వస్తే ఈనాడు 1,156 రూపాయల ఆదాయం వస్తున్నది. ఈ నాడు పంచాయతీ నూటికి నూరుపాళ్ళు పన్నులను వసూలు చేస్తున్నది.

ఈ విధంగా ఆదాయం పెంపొందించుకుంటూ, అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించుకుంటూ ప్రగతి పథంలో పయనిస్తున్నది వెంకటాయపాలెం.

పంచాయతీ రాజ్యంపై విశ్వాసంలేని, విశ్వాసం సడలిన వారు పంచాయతీరాజ్యం పనిచేసే తీరుపట్ల నిస్పృహ చెందినవారు ఎవరైనా వచ్చి వెంకటాయపాలెం గ్రామాన్ని సందర్శిస్తే పంచాయతీ రాజ్యరథం యే విధంగా విజయపతాకం ఎగురవేసుకొని సాగిపోతున్నదో చూడవచ్చు.

రాష్ట్రంలో కరువు నివారణ కార్యక్రమాలు

కరువు నివారణ కార్యక్రమాల్లో యిప్పుడు రాష్ట్రం మొత్తం మీద రోజూ 5 లక్షల మంది కార్మికులు పని చేస్తున్నారని గవర్నరు సలహాదారు శ్రీ వి. కె. రావు మే 25 వ తేదీన పత్రికల వారితో ప్రసంగిస్తూ అన్నారు.


అనావృష్టి పరిస్థితులను తట్టుకోడానికి యీ కార్యక్రమాలు యిప్పుడు ముమ్మరం చేయబడినవి. జనవరి నెల నుండి యిప్పటి వరకు ప్రభుత్వం రూ. 23 కోట్ల నిధులను విడుదల చేసింది.

కార్మికులకు జీవనోపాధి కల్పించడంతోపాటు యీ కార్యక్రమాలవల్ల రాష్ట్ర అభివృద్ధి పనులకు కూడా లాభం చేకూరే విధంగా కొన్ని ముఖ్యమైన ప్రణాళిక పథకాలకు అనావృష్టి నివారణ నిధులనుండి ధనం కేటాయించడం జరుగుతున్నది. ఇటువంటి పథకాల్లో దిగువసీలేరు, పోచంపాడు, నాగార్జునసాగర్, తుంగభద్ర ఎగువకాలువ, శ్రీశైలం, వంశధార ప్రాజెక్టులు, మురుగునీటి పారుదల పథకాలు, కొన్ని రాష్ట్ర రహదార్లు, మధ్యతరహా నీటిపారుదల పథకాలూ వున్నాయని శ్రీ వి. కె. రావు వివరించారు. ఈ ప్రాజెక్టుల మీద ఖర్చు పెట్టడానికి రూ. 8 కోట్లు కేటాయించారు.

పంచాయతీరాజ్ శాఖకూ, అగ్రో-ఇండస్ట్రీస్ కార్పొరేషన్‌కు చెందిన రిగ్గులన్నింటినీ వినియోగించి మంచినీటి కొరత తీర్చడానికి తీవ్రంగా కృషి జరుగుతున్నది. ఇటీవలనే బొంబాయి నుండి వచ్చిన 3 రిగ్గులను కూడా వుపయోగిస్తున్నారు. త్వరలో మరి కొన్ని కూడా వస్తున్నాయి.

జనవరి నుండి యిప్పటి వరకు 1700 పైగా గొట్టపు బావులు త్రవ్వారు. ఇవికాక అనేక బావులు బాగు చేయడం కూడ జరిగింది. వానలు కురిసేవరకు అవసరమైన చోట్లకు నీటి సరఫరా చేయాలని కలెక్టర్లను కోరడం జరిగింది.

మార్చి నెలతో అంతమైన ఆర్థిక సంవత్సరంలో అనావృష్టి నివారణ కార్యక్రమాలకుగాను రూ. 40 కోట్ల ఖర్చు జరిగింది.



15

విజయోత్సాహము

హరిహరరాయలు యతీంద్రునితో చెప్పినట్లే చేశాడు. బుక్కరాయలు గూడ తన సోదరుణ్ణి అనుసరించాడు.

మరునాటి ఉదయం ఇరువాగుల సేనలు యుద్ధానికి సన్నద్ధమయినవి. హిందూ సేనలు మహోత్సాహంగావున్నవి. గతదినం సంభవించిన విజయము, సోమదేవరాజు, కాపయ్య, బల్లాలుడు తమకిచ్చిన ప్రోత్సాహము అలాటిది. అంతేగాదు. "మీరు ధైర్యముతో పోరాడండి. మీకు జయం కలుగుతుంది. ముస్లిం సైన్యాలకు అధిపతులుగా వచ్చినవారు మనవారు. వారు మీ వైపు వస్తారు" అని యతీంద్రుడు చెప్పిన మాటలు వారిని మరింత ఉత్సాహపరిచినవి.

సాధారణంగా ముందుగా పై బడడమే హిందూసేనల ఎత్తుగడ. అలాగే ఆనాడు గూడ ఆ సేనలు ముస్లిం వాహినుల మీద బడినవి. ఉత్సాహంతో విరుచుకొని పడుతున్న హిందూ సైనికుల్ని ముస్లిములు ఎదుర్కొనలేక పోయారు. ఇంతలో వెనక్కు తగ్గమని ముస్లిం సేనాధిపతులు ఉత్తరువులిచ్చారు. అలాగే ఆ సేనలు వెనక్కు తగ్గడానికి ప్రారంభించాయి.

ఎప్పుడైతే ముస్లిం సేనావాహినులు వెనక్కు వెళ్ళడానికి పూనుకొన్నాయో అప్పుడు హిందూ సైనికులు వారిమీద బడి చెండాడనారంభించారు. ముస్లిములు వెనక్కి వెడుతూ వెడుతూ పోరాడడం కష్టసాధ్యమనిపించింది. తమ సేనాధిపతులు తమ్మెందుకు వెనక్కు తగ్గమన్నారో తమకే తెలియరాలేదు వారికి. కాని వారు అలాగే పోరనారంభించారు.

ఉన్నట్లుండి సేనాధిపతులు ముందుకు వెళ్ళమని ఉత్తర్వులిచ్చారు. పైబడి వస్తున్న హిందూ సైనికుల్ని నిలవరించడమే కష్టంగా వున్న ముస్లిములకు ముందుకు వెళ్ళడం కష్టమయింది. వారాలాగే నిలిచి పోరాడసాగారు. కాని చాలా నష్టపడ్డారు.

ఈ విధంగానే వారు తమ సేనాధిపతుల ఉత్తర్వుల ననుసరించి రెండు మూడు సార్లు వెనక్కు, ముందుకు వెళ్లి పోరాడవలసి వచ్చింది. అందువల్ల ముస్లిం సేనలు చాల నష్టపడ్డాయి. పైగా అలసిపోయాయి. అంతలో హిందూ సైన్యాలను చక్రబంధం గావించమని సైన్యాధిపతు లాజ్ఞాపించారు.

హిందూ సైన్యాల నెదుర్కొనడమే కష్టంగా వున్నప్పుడు వారిని చక్రబంధం చేయడమెలాగో ముస్లిములకు తోచలేదు. కాని సేనాధిపతుల వత్తిడివల్ల వారు పలచబారి హిందూ సేనల్ని చక్రబంధం చేయడానికి ప్రయత్నించారు. అప్పుడు కాపయ్య నాయకత్వాన ఉన్న సేనలు మధ్యకు చొచ్చుకొని వచ్చాయి. బల్లాలుని సేనలు, సోమదేవరాజు సేనలు, ప్రక్కలకు వస్తున్న ముస్లిం సేనల్ని చెల్లాచెదరు గావింపసాగాయి.

మరలా సేనాధిపతులు ముస్లిం సైన్యాలను వెనక్కు తగ్గమన్నారు. ఈ మారు ఈ యవకాశాన్ని హిందూ సైనికులు చాల చక్కగా ఉపయోగించుకొని ముస్లిం సైన్యాలను తరుమసాగారు. ముస్లిం సైనికులు గూడ బెదిరిపోయి పరుగిడనారంభించారు. ఆ తరుణంలో హరిహర బుక్కరాయళ్లు 'జై ఆంధ్ర!' అంటూ ఆంధ్ర సైన్యాలతో కలిసిపోయారు.

తమ సేనాధిపతులు ఆంధ్రులతో కలిసి పోరాడడం చూచి ముస్లిం సేనలు అదరిపోయాయి. వెనక్కు తిరిగి పరుగిడనారంభించాయి. ఆంధ్ర సేనలు వెన్నంటి తరిమి తిరిగివచ్చాయి.

ఆ పోరాటంలో ఢిల్లీ సేనలు చావుదెబ్బ తిన్నాయి.

తమ వైపుకు వచ్చిన హరిహర బుక్కరాయళ్ళను కాపయ్య, సోమదేవరాజు కౌగిలించుకొన్నారు. ఆంధ్ర సేనలన్నీ 'జై హరిహరరాయ!' 'జై బుక్కరాయ!' అంటూ నినాదాలు గావించాయి. ఆ తరువాత వారు ఏనుగులపై ఎక్కించబడ్డారు. ఎంతో గౌరవంతో ఆనెగొందికి తీసుకొని పోబడ్డారు.

ఆనెగొందిలో ఆ నాటి విజయోత్సాహం చెప్పడానికి వీలులేదు. హరిహర బుక్కరాయళ్లకు జరిగిన గౌరవం వర్ణించడానికి కలవిగాదు.

విజయ వాహినులు తిరిగి వచ్చేవరకు యతీంద్రుడానెగొందిలోనే వున్నాడు. హరిహర రాయలు, బుక్కరాయలు ఆనెగొంది చేరిన వెంటనే యతీంద్రుని వద్దకు వెళ్లి సాష్టాంగ పడ్డారు. అతడు వారిని లేపి కౌగిలించుకొన్నాడు. ఆ తరువాత ఆశీర్వదించాడు. అప్పుడు వారికి కలిగిన ఆనందానికి మేరేలేదు.

ఆ నాడు నాయకులందరూ అలసట తీర్చుకుని మరునాడు సమావేశమయ్యారు. ఆ సమావేశంలో విద్యారణ్య యతీంద్రుడు, హరిహర రాయలు, బుక్కరాయలు, కాపయ్య, వేమారెడ్డి, సోమదేవ రాజు, అన్నమదేవరాజు, తదితర నాయకులు ఉన్నారు. వారందరూ ఎంతో ఆనందంగా వున్నారు.

"ఓటమి జెందిన సైన్యాలేమవుతాయి? సుల్తాను ఏమాలోచిస్తాడు?" ప్రశ్నించాడు యతీంద్రుడు హరిహర రాయల్ని చూచి.

"ఈ సైన్యాలు దేవగిరి చేరుతాయి. మేము తిరుగుబాటు గావించామన్న విషయం సుల్తానుకు తెలుస్తుంది. అది తెలిసి అతడు తప్పనిసరిగా కలవర పడుతాడు." అన్నాడు హరిహర రాయలు.

అప్పుడాతడు హిందూ వేషంలో ఉన్నాడు.

"మరలా ఆంధ్రావనిపై దండెత్తి రాడా?"

"రావచ్చు. రాకపోవచ్చు. కాని రాకపోవడానికే ఎక్కువ అవకాశాలున్నవి.

"ఎందువల్ల?"

"దేవగిరి సేనలు చాల వరకు దెబ్బతిన్నాయి. ముందుగానే ఇప్పుడు ఢిల్లీ సేనలు గూడ నాశనమైనవి. దక్షిణా పథంలో చెలరేగుతున్న తిరుగుబాట్లను చూచి ఆర్యావర్తంలో గూడ కొందరెదురు తిరగడానికి పూనుకొన్నారు. అందువల్ల అచ్చట గూడ సుల్తాను పరిస్థితి కొంత క్లిష్టంగా వుంది."

"క్లిష్టంగా వున్నప్పటికీ మరొక మారు సుల్తాను ప్రయత్నం గావిస్తాడు" అన్నాడు కాపయ్య.

"ప్రయత్నించడని నేననను. కాని ఆ ప్రయత్నం గావించే ముందు చాలసార్లు ఆలోచిస్తాడు."

"అది నిజమే. కాని మీరు మావైపు తిరిగిపోయారని" వింటూనే అతడు క్రుద్ధుడౌతాడు. ఆ కోపంలో ఆలోచనంటూ వుండదు. అందువల్ల అతడు తప్పనిసరిగా దండెత్తి రావడానికి ప్రయత్నిస్తాడు." అన్నాడు కాపయ్య.

"వచ్చినా ఏమీ చేయలేడు" అన్నాడు సోమదేవరాజు.

"చేయలేడని మనమెందుకనుకోవాలి? మనం సంసిద్ధంగా వుండాలి," అన్నాడు కాపయ్య.

"కాపయ్య అన్నదే మంచిది. మీరు మాత్రం సాధ్యమయినంత సన్నద్ధంగా వుండాలి. తీరాంధ్రం మీద సుల్తాను దండెత్తితే తక్కిన వారు అచ్చటికి సాయంగా వెళ్లాలి. ద్వార సముద్రం మీదికి వెడితే మిగిలినవారు బల్లాల రాజుకు సాయపడాలి. అలాగే ఆనెగొంది మీదికి వస్తే అప్పుడు ద్వారసముద్ర తీరాంధ్ర సేనలు ఇచ్చటికి రావాలి" అన్నాడు యతీంద్రుడు.

"అలాగే చేస్తాము." అన్నారచ్చట ఉన్నవారందరూ.

"ఇక హరిహరబుక్కరాయల విషయాన్ని గూర్చి మాట్లాడుకొందాము." అన్నాడు విద్యారణ్యుడు.

"ఆ విషయంలో మేమేమీ చెప్పనవసరంలేదు. మీరేమి చెబితే అలా చేస్తాము." అన్నాడు సోమదేవరాజు.

"మీరు చెప్పడమే మంచిది. వారు మీ మీద విశ్వాసముంచి సుల్తానును వీడి వచ్చారు." అన్నాడు యతీంద్రుడు.

"అయితే వినండి. నాకు గాని నా సోదరునికి గాని రాజ్య కాంక్ష లేదు. తుంగభద్ర, కృష్ణ అంతర్వేదిలో మేము జయించిన కోటలతో సహా మా రాజ్యాన్ని వారికి సమర్పించడానికి సంసిద్ధంగా వున్నాము. మాకు కావలసింది ఆంధ్రుల విముక్తి. అంతేగాని రాజ్యం గాదు" అన్నాడు సోమదేవరాజు. అతని త్యాగానికచ్చటి వారందరూ అచ్చెరువందారు.

"మీ రాజ్యం మాకెందుకు? మేముగూడ హిందూమత ధర్మ రక్షణ కోసమే సుల్తానును వీడి వచ్చాము. అంతేగాని రాజ్య కాంక్షతో గాదు" అన్నాడు హరిహరరాయలు.

"కావచ్చు. కాని మేము మీ నాయకత్వాన్నంగీకరించి మా రాజ్యాన్ని మీ కప్పగిస్తున్నాము. మీ రంగీకరించాలి. మేము మీకు విధేయులుగా వుంటాము." అన్నాడు సోమదేవరాజు.

"నా సోదరుని మాట నంగీకరించండి. అంతకంటే కావలసింది మాకేమున్నది? మీ రీపక్షానికి రాకుంటే యీ రాజ్యం స్వతంత్రంగా ఎలా వుండగలుగుతుంది? అందువల్ల మీరీరాజ్యాన్ని అంగీకరించండి.'' అన్నమదేవుడభ్యర్థించాడు.

ఆ సోదరులంతగా అర్థిస్తుంటే హరిహర బుక్కరాయలు కాదనలేక పోయారు.

సోమదేవరాజు సోదరుల త్యాగానికి యతీంద్రుడెంతో మెచ్చుకొన్నాడు. వారికి శుభం కలగాలని దీవించాడు.

"విజయం చేకూరిన సందర్భంలోనే నాకొక ఆలోచన స్ఫురిస్తున్నది., అన్నాడు యతీంద్రుడు.''

ఆసక్తితో అందరూ అతనివైపు చూచారు.

"ఆనెగొంది అంత సురక్షిత ప్రదేశంలో లేదు. అందువల్ల ఇది ఒక రాజధానినగరం కాజాలదు. కనుక మనం దీని చేరువనే తుంగభద్రా నదీ తీరంలోనే మరొక నగరాన్ని నిర్మించాలి. అప్పుడు అన్ని దండయాత్రలను తట్టుకోడానికి వీలుంటుంది."

"మీరు సరిగానే చెప్పారు. మేముగూడ ఆ విషయాన్ని గూర్చే ఆలోచిస్తున్నాము.'' అన్నాడు సోమదేవరాజు.

"కంపిలైతే?" హరిహరుడు ప్రశ్నించాడు.

"అది పతనమైన రాజ్యం. అందువల్ల అచ్చట కొత్త నగరాన్ని నిర్మించి లాభంలేదు. ఋష్యమూక పర్వతం వద్ద నగరాన్ని నిర్మిస్తే అది చాల బలంగా వుంటుంది. చుట్టూ పర్వతశ్రేణులున్నవి గనుక రక్షణ వుంటుంది. దుర్భేద్యంగా వుంటుంది." అన్నాడు యతీంద్రుడు.

ఆ మాటకందరూ సమ్మతించారు. [సశేషం]

ఆంధ్ర ప్రదేశ్‌లో యాత్రా స్థలాలు

కొలనుపాక పుణ్య క్షేత్రం

—ఎ. పండరినాథ్

కొలనుపాక ఆంధ్రప్రదేశ్‌లో గొప్ప శైవ మత క్షేత్రంగానూ జైన మతక్షేత్రంగానూ ప్రసిద్ధి చెందినది. అంతేకాదు భారత దేశంలో, విలసిల్లిన జైన దేవాలయాలలో కొలను పాక జైనదేవాలయం రెండవ స్థానాన్ని ఆక్రమించడం గమనించదగిన విషయం.

నేడు ఒక గ్రామంగా నిలిచిన కొలను పాక ఒకప్పుడు రాజధానిగా విరాజిల్లినది. ఆనాడు కొలనుపాక 7000 గ్రామాలకు రాజధాని నగరంగా వెలిసింది. ఇప్పుడు ఈ గ్రామం ప్రక్కనుండి ప్రవహిస్తున్న ఆలేరు వాగు ఆనాడు సీమంతంగా సస్యశ్యామలంగా చేసి ఫలవంత మొనర్చింది. ఇచట బయల్పడ్డ ఎన్నో శాసనాల వల్ల ఒకప్పుడు ఈ నగరాన్ని ముఖ్యపట్టణంగా చేసుకొని, చాళుక్య చక్రవర్తులు, కాకతీయ చక్రవర్తులు దేదీప్యమానంగా పరిపాలించినట్లు తెలుస్తున్నది.

క్రీ. శ. 1110 నుండి1126 వరకు కొలనుపాకను శ్రీ సోమేశ్వర దేవ భూపతి పరిపాలించాడు. క్రీ.శ 1143 వరకు కూడా కొలను పాక పశ్చిమ చాళుక్య చక్రవర్తుల పరిపాలనలోనే ఉన్నది చాళుక్యుల అనంతరం కొలనుపాక ఓరుగల్లును పరిపాలించిన కాకతీయ సామ్రాజ్యానికి ఒక భాగమయింది. క్రీ శ. 1260 నుండి 1294 వరకు ఈరాజ్యం రుద్రమదేవి అధీనంలో ఉన్నట్టు తెలుస్తున్నది. క్రీ శ. 1042 నకు ముందే మొదటి జగదేకమల్లు దీనిని రాజధానిగా చేసుకొని పరిపాలించాడు

పౌరాణిక ప్రశస్తి

పౌరాణికంగా కూడా దీనికి ప్రశస్తి ఉన్నది. స్థల పురాణాలలో ఈ నగరం బింబావతీ నగరం, వ్యాఖ్యనగరం, సరోవర కుటీరం, సోమశేఖర పురం, కుదటపురం, కుళ్ళదపురం అనే పేర్లతో వ్యవహరి పబడింది ఈ క్షేత్రం శైవమతానికి కేంద్రంగా ఉండి "దక్షిణకాశి" అని వ్యవహరింపబడింది దీనికి సమీపంలోనే 'కాశీబుగ్గ' అనే బావి ఉన్నది ఈ బావిలోని నీరు అపరగంగోదకంగానూ, దీనికి సమీపంలోనే ఉన్న శివాలయంలోని లింగం అపరకాశీ విశ్వేశ్వర లింగంగానూ పరిగణింప బడినందున ఇది "దక్షిణకాశీ"గా ప్రసిద్ధి గాంచింది.

శాసనాలలో ఈ గ్రామంపేర్లు కొలిపాక, కొళ్ళియపాక, కొట్టిపాక, కుల్పాక అని ఉన్నాయి కొళ్ళియపాక, కుల్పాక అనే పేర్లు వాడుకలో కొలనుపాకగా మార్పు చెందింది.

సోమేశ్వరాలయం, ప్రతాపరుద్రాలయం

నేడిచట శిథిలావస్తలో నున్న కీర్తిస్తంభాలను, నందులను, లింగాలను, సప్తమాతల విగ్రహాలను పరిశీలిస్తే, ఇచట పూర్వం ఎన్నో దేవాలయాలు విలసిల్లినట్లు గోచరిస్తుంది ఇచటికి సమీపంలో ఉన్న ఆలేరువాగులో ఇటీవల బయల్పడ్డ పెద్ద కంచు గుడిగంటలను చూస్తే ఆనాడు ఇచ్చట పెద్ద దేవాలయాలు ఎంతో వైభవంగా విలసిల్లి ఉంటాయని చెప్పకతప్పదు. ఇంత పెద్ద కంచుగంట దేశంలోనున్న దేవాలయాలల్లోని గంటలలోకెల్ల పెద్ద గుడి గంటగా భావించబడుతున్నది. ఇచట నేటికీ నిలిచిఉన్న సోమేశ్వరాలయం సుమారు 800 సంవత్సరాల క్రితం కుమార సోమేశ్వరునికాలంలో నిర్మించబడ్డట్లు భావించబడుతున్నది ఈ ఆలయం విశాలంగానూ, బ్రిహ్మాండంగానూ ఉన్నది. దీనిలోని ముఖ్యభాగాలన్నీ శిథిలమై పోయినందున దీనిలో ప్రవేశించినప్పుడు భయంకరంగా ఉంటుంది. ఇచట ఇంకా గ్రామమధ్యలో వీరనారాయణ గుడి ఉన్నది. దీనికి జగద్దేవనారాయణగుడి అనే పేరుకూడా ఉన్నది.

సోమేశ్వరుని గుడికి ఉత్తర దిశలో "ప్రతాపరుద్ర గుడి" ఉన్నది. దీనిపైనున్న శిల్పం హనుమకొండలోని వేయిస్తంభాల ఆలయశిల్పాన్ని పోలి ఉంటుంది. ఇక నైఋతిదిశలోని ఒక చిన్న దేవాలయంలో విచిత్రమైన లింగం ఉన్నది. దీనిని కోటిలింగమంటారు. దీనిచుట్టూ గొలుసుమాదిరిగా సమానపరిమాణం కలిగిన సుమారు వెయ్యి చిన్నలింగాలున్నాయి దీనితో కలిపి ఈ ప్రాంతంలో కోటిలింగాల ప్రతిష్ఠ జరిగిందనే ప్రసక్తి ఉన్నది

శిల్పసంపద

సోమేశ్వరాలయానికి సమీపంలో ఉన్న చండికాలయంలో దేవి విగ్రహం ఉన్నది. ఈ విగ్రహం శిల్పరీతి ఎంతో అద్భుతంగా ఉన్నది. ఈ గ్రామంలోనే ఒకదిబ్బపైన 20 అడుగుల పెద్ద ద్వారం ఉన్నది. దీనిలో ఒక బండపైన 6 అడుగుల నిడివిగల మూడు పాదాలున్నాయి. దీనిని బట్టి ఏదో ఒక బ్రహ్మాండమైన విగ్రహం భిన్నమైఉంటుందని తెలుస్తున్నది. ఇచట భూగర్భంలో ఇంకా ఎంతో శిల్పసంపద, ప్రాచీనకాలానికి సంబంధించిన చరిత్ర దాగి ఉన్నది. ఇచట త్రవ్వకాలు జరిపితే గత చరిత్ర ఎంతో బయటపడి ఈ గ్రామ చరిత్రనే కొంగ్రొత్త రీతుల్లోకి మళ్లిస్తుంది.

ఇచటి హిందూదేవాలయాలమీద నున్న శిల్పం చాళుక్య శిల్పాన్ని పోలి ఉంటుంది. ఈ ప్రాంతం కొంతకాలం వరకు కాకతీయుల ఆధీనంలో ఉన్నందున ఇచట కాకతీయ శిల్పరీతి ఎన్నో చోట్ల కానవస్తుంది. ఇచట బయల్పడిన ఇటుకలు మౌర్యులకాలానికి, గుప్తరాజులకాలానికి చెందిన ఇటుకలుగా భావింపబడుతున్నాయి.

కాకతీయుల పరిపాలనానంతరం ఈ ప్రాంతం విశిష్టతను కోల్పోయిందనీ, ఈ నగర చరిత్ర మరుగుపడిపోయిందనీ చెప్ప వచ్చును. 17వ శతాబ్దంలో ఖిలషాపురాన్ని, భువనగిరి పరగణాలను ఏలిన సర్వాయి పాపడు దీన్ని కొల్లగొట్టిన తరువాత ఇది పూర్తిగా చరిత్ర మరుగున పడిపోయింది.

జైనమందిరం

ఇచట శైవమతంతోపాటు జైన మతంకూడా సమంగా ఆదరించబడింది. ఈ క్షేత్రం ఒకప్పుడు జైనులకు పవిత్ర క్షేత్రంగా విలసిల్లింది. ఇచటి జైనమందిరం నిర్మాణం ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యంలో ముంచివేస్తుంది. ఈ ఆలయంలో అడుగు పెట్టగానే మనస్సులో భక్తిభావం, ప్రశాంతత నెలకొంటాయి. దీనిలో జైన శిల్పులు చెక్కిన మహావీరుని విగ్రహం మరియు 11 గురు జైన తీర్థంకరుల విగ్రహాలు ఆలయం మధ్యభాగంలో ఎంతో కళాత్మకంగా అమర్చబడ్డాయి. ఇవన్నీ అతి ప్రాచీన మైనవిగా భావింప బడుతున్నాయి.

ఈ ఆలయంలోనే "పచ్చ'' రాయితో తొలిచిన మహావీరుని ఆయిదడుగుల ఎత్తు విగ్రహం ఉన్నది. దీని విలువ కొన్ని కోట్ల మేరకుంటుంది. ఒకప్పుడు బ్రిటిష్ వారు దీనిని ఏడు కోట్ల రూపాయల వరకు బేరం చేశారట. ఇంత పెద్ద "పచ్చ'' రాతి విగ్రహం మరెచ్చటా లేదంటారు.

ఈ జైనదేవాలయం వెనక 2000 సంవత్సరాల చరిత్రదాగి ఉన్నది. రెండువేల సంవత్సరాల క్రితం మనదేశంలో వెలిసిన ఇతర జైనదేవాలయాలతో పాటు ఈ ఆలయం కూడా వెలిసింది. కాని కాలం తీసుక వచ్చిన మార్పుకు ఇది గురి అయింది. అన్ని ప్రాచీన ఆలయాలకు పట్టిన దుర్గతే దీనికి పట్టింది. కాని రెండు వందల సంవత్సరాల క్రితం ఈఆలయానికి మళ్లీ సుదినాలు తట స్థించాయి. శికింద్రాబాదుకు చెందిన జైనమతస్థుడు, లక్షాధికారి అయిన సేట్ హీరాచంద్, ఈ గ్రామం ప్రక్కనుండే ప్రవహిస్తున్న ఆలేరువాగులో ప్రమాదవశాత్తు కొట్టుకొని పోసాగాడట. "ఓ జైన దేవా రక్షించమని'' ప్రార్థించాడు. అదేతడవుగా అతనికి ఒక చెట్టు పట్టు దొరికినది. ప్రాణాలు దక్కాయి. అతడు వెంటనే శిథిలావస్థలో నున్న ప్రాచీన జైనమందిరాన్ని బాగుచేయించాడు. క్రమంగా అదొక దివ్యమందిరంగా తయారై పూర్వపు ఔన్నత్యాన్ని సంతరించుకొన్నది.

యాత్రికులకు వసతి

బయట నుండి చూస్తే ఇది ఒకకోట ప్రాంగణంలా కని పిస్తుంది. దీనిలో అడుగు పెట్టగానే ఒక సుందర మందిరం మనలను ఆకర్షిస్తుంది. ఆలయానికి కుడిఎడమల ప్రక్కల్లో చక్కని తోటలు, ఆపైన రెండు వైపులా యాత్రికులు బసచేయడానికి ఎన్నో గదులు నిర్మించబడ్డాయి. ఆలయం ముందు భాగంలో కూడా కొన్ని గదులు నిర్మించ బడ్డాయి. ఆలయానికి ముందు ఒక పెద్ద ఉద్యాన వనం యాత్రికుల సౌకర్యం కోసం ఉన్నది. ఈ ఆలయాన్ని నిత్య నూతనం గావిస్తూ యాత్రికులకు అన్నివసతులను కల్పిస్తున్న ఈ ఆలయకమిటీ కృషి ఎంతేనీ కొనియాడదగినది.

కొలనుపాక నల్లగొండ జిల్లాలోని భువనగిరి తాలూకాకు చెందిన గ్రామం. హైదరాబాద్-విజయవాడ రైలుమార్గంలో ఆలేరు స్టేషన్ దిగి ఇచటికి చేరుకోవచ్చును. కొలనుపాక ఆలేరుకు 4 మైళ్ల దూరంలో ఉంటుంది. హైదరాబాద్-సిద్ధిపేట (వయా ఆలేర్) బస్ ద్వారా కూడా ఇచటికి చేరుకోవచ్చును. ఆంధ్రప్రదేశ్‌లో అతిప్రాచీన చరిత్రను కలిగి, అపురూప శిల్ప సంపదతో విలసిల్లి, శైవ, జైనమతాలకు పేరు గాంచిన ఈక్షేత్రం తప్పకుండా చూడ దగినది.

విరివిగా చెట్లు నాటితే సౌభాగ్యం వెల్లివిరుస్తుంది

తెలుగు వారి ముచ్చట్లు

వేదవతీ దేవి

సందడంటే సందడి! కలవారి ఇంట్లో పెళ్ళిసందడి ఎలా ఉంటుంది మరి!

ఆకాశమంత పందిరీ, భూదేవి అంత అరుగూ వేశారు. పచ్చని మామిడాకు తోరణాలు కట్టారు. పందిరి స్థంబాలకు కొబ్బ రాకులూ, రంగు రంగుల కాగితాలూ చుట్టారు. నేలంతా అలికి ముగ్గులు పెట్టారు. కళ్యాణ వేదిక కన్నుల పండువుగా అలంక రించారు. ఊరూ వాడా కదిలి వచ్చారు. మేళతాళాలమధ్య మహా వైభవంగా పెళ్ళి జరిగింది. బారులుతీర్చి బంతులు పెట్టారు.

పసుపు బట్టలతో వధువూ, వరుడూ పాన్పుమీద ఎదురెదు రుగా కూర్చుని ఉన్నారు. చుట్టూ బంధువర్గం నుంచుని ఉన్నారు. సన్నాయి మేళం సన్నగా, 'పోయిరాగదమ్మ జానకీ!'...అంటూ రాగం అందుకుంది.

పెళ్ళికూతురి అత్తమామలు, బావగార్లు, తోటికోడళ్ళ, ఆడపడుచులు సిద్ధంగా నుంచుని ఉన్నారు. వాళ్ళకు ఇదొక ముచ్చట. ఆ నవ వధువు ఇక తమ ఇంటి పిల్ల. ఆ పిల్ల బరువు బాధ్యతలన్నీ ఇకనుంచీ తమవి.

ఆడపిల్లను కన్న ఆ తల్లికీ, తండ్రికీ కళ్ళనిండా తడి, ఎంత తుడుచుకున్నా ఆరని తడి. పెళ్ళికూతురి చెల్లెళ్ళకూ— చెంగులు తడుస్తూనే ఉన్నాయి.

పెళ్ళికూతురికి దుఃఖం పొంగుకు వస్తూ ఉంది. చెంపల మీదుగా కన్నీరు వర్షిస్తూ ఉంది. జీవితానికి ఇది ఒక చిత్రమైన మలుపు. ఇంతటితో బాల్యం వదిలినట్లే! ముందు జీవితం ఎలా ఉంటుందో! ఎలా సాగిపోతుందో! అమ్మను, నాన్నను, ఈ ఇంటిని వదిలి పోవడం ఎలాగ!

పెళ్ళికొడుకు ముభావంగా కూర్చుని ఉన్నాడు. అతడి భావాలు వర్ణించి చెప్పటం కాస్త కష్టమయిన సంగతే. ఎదురుగా కూర్చునిఉన్న ఆ పిల్ల తన వధువు! తన భార్య. అందరి ఎదుటా ఆమె మెడలో తాళిగట్టి తాను 'భర్త' అయినాడు. పాపం, ఆ అమ్మాయి అంతగా దుఃఖపడుతూ ఉంది. తనతో రావటానికి, తనతో జీవితం పంచుకోవటానికి, ఆ పిల్లకు ఇష్టం లేదా ఏమిటి! ఏమిటో! ఈ ఆడవాళ్ళ మనస్సులు తెలుసుకోవటం కాస్త కష్టమైన సంగతే!

పెళ్ళి కొడుకు తలఎత్తి చూచాడు. కూతుర్ని అప్పగింతలు పెడుతున్న మామగారి వదనంలో దైన్యం. ఏదో విలువైన వస్తు వును పోగొట్టుకుంటున్న బాధ. అత్తగారి కళ్ళల్లో తీరని తడి.

కుర్రవాడికి జ్ఞానోదయం అయినట్లు అయింది. నిజమే మరి! ఇన్నేళ్ళనుంచీ ప్రేమంతా ఒలకబోసి పెంచుకు వచ్చారు. తమ బిడ్డ, తమ స్వంతం, తమ ఆస్తి. ఆ పిల్లను పరాయివాడికి ఒప్పగించి వేస్తున్నారు! వాళ్ళకు ఎంత బాధగా ఉంటుంది మరి! ఆ అమ్మాయికి కూడా అదే బాధ అయి ఉంటుంది. ఆ కాటుక కళ్ళనిండా నిండి బుగ్గలమీద జారే కన్నీళ్ళను చూస్తుంటే, చాలా బాధగా ఉంది. కొనగోటితో ఆ బుగ్గలమీద జారే అశ్రువుల్ని తుడవాలని అనిపించింది పెళ్ళికొడుక్కి. కాని ఎలా! ఇది సమయం కాదు! ముళ్ళమీద కూర్చున్నట్లు తోచీ తోచకుండా కూర్చున్నాడు పెళ్ళికొడుకు.

సన్నాయిమేళం అప్పగింతలు పెడుతూఉంది.

"అత్తమామల మాట అడుగు దాటకుమా
చిత్తము మెప్పించి చెలగుమో తల్లి!
పతిని దైవమ్ముగా భక్తితో నమ్మి
మతిమంతురాలవై మనుము మాయమ్మా!
పోయిరా ముద్దులా మల్లె మా తల్లి
పోయిరావే చిలుక మురిపెంపు మొలక!
ఎన్నడు నిన్విడచి ఎడబాయనైతి!
కన్న తల్లిరో నేను కడతేరుటెట్లు!
గారాలపట్టి నా కన్నార చిట్టి
పేరంటముల కెవరు వెంట వచ్చెదరు!
నన్ను గన్నమ్మ నా నాఞెంపు సొమ్మ!
చిన్న మాణిక్యమ్మ చింతించకమ్మ!"

తల్లికీ బిడ్డకూ కన్నీటి కాల్వలు ఆగటంలేదు. ఆ తల్లి ముందుగా తన ధర్మాన్ని గుర్తించి, అత్తవారింట్లో తన బిడ్డ నడుచుకోవలసిన పద్ధతులు చెప్పింది. 'పోయిరా తల్లీ!' అని ఒప్పగింత పెడుతూండగానే, మనస్సు మరీ ఉద్విగ్నం అయి పోయింది. 'నిన్ను విడిచి నేను కడతేరేదెట్లాగే తల్లీ...' అంటూ

వాపోంది. తన వెంటవెంటనే మసులుతూ, పేరంటాళ్లకు వెళ్ళితే వెంట వెళ్లతూ, ఇంట్లో ఉంటే చేదోడు అవుతూ ఉండే తన బిడ్డను విడిచి బ్రతకట మెట్లాగో ఆ అమాయకురాలికి తెలియలేదు.

'ఆడపిల్ల పుట్టినప్పుడే ఆదరువు పుడుతుంది'... అని మన వాళ్ళు అంటారు. ఈ పిల్ల పుట్టినప్పుడు తొలిచూలు ఫలంగా లక్ష్మీదేవి అవతరించిందని ఆనందపడ్డారు. ఆడింది ఆటగా, పాడింది పాటగా, అల్లారు ముద్దుగా పెంచుకు వచ్చారు.

ఎదుగుతూ ఉన్న ఆడపిల్లకు అడుగడుగునా వేడుకలే! ఎన్ని వేడుకలతో పిల్లను పెంచుకు వచ్చారు! పిల్ల పుట్టిన దగ్గర నుంచీ, ఇప్పటి వరకూ, అన్నీ వేడుకలే! అన్నీ సరదాలే!

ఆ తల్లి కళ్లలో నిలచిన నీటిబిందువు ముత్యంలా జారిపడింది. ఆవిడ మనస్సులో ఒక తెరలేచినట్లు అయింది. పసుపు బట్టలతో కళ్యాణపు తిలకంతో, పాదాల పారాణితో, ఎదురుగా కూర్చుని ఉన్న కూతురు ఆమెకు అద్దాలలో పిల్లగా కనిపించింది.

అవును, అద్దాలలో పిల్ల! పురిటి స్నానం నాటి అద్దాలలో పిల్ల! పిల్లకు స్నానం చేయించి, బొట్టూ కాటుకాపెట్టి, ఎడం బుగ్గనా, గడ్డంకిందా, నల్లసాదు చుక్కలు పెట్టారు. ముఖాన దిష్టి బొట్టు కాస్త పెద్దదిగా దిద్దారు. తాతగారు చేయించిన ఉంగరాలు ఆ బుల్లి వ్రేళ్లకు తొడిగి, ఆ పసి చేతులకు బంగారపు మురిడీ గొలుసులు తొడిగారు-మెడలో పులిగోరు ఒంటి పేట గొలుసు వేశారు. ఇవన్నీ అలంకరించి పిల్లను తన చేతుల్లో పెట్టేటప్పటికి, మమకారం ఆగక, తాంబూల రక్తిమతో ఎర్రగా అయిపోయిన పెదవులతో, పిల్ల బుగ్గల మీద ముద్దుల వర్షం కురిపించింది.

ఇరవై ఒకటో రోజున బారసాల చేసుకున్నారు. ఆయన గారితో కలిసి మళ్లా ఒకసారి పాపను పట్టుకుని పీటలమీద కూర్చునే టప్పటికి తాను ఒక సిగ్గుల పెళ్లికూతురైంది. తండ్రినైనానన్న గర్వంతో, ఆయనగారు బిడ్డ వంక చూస్తూ ఉంటే, తనకు ఎంత పొంగుగా ఉందని'. బ్రాహ్మణుడు వచ్చి మంత్రాలు చదివి పూజ చేయించాడు. బియ్యంలో రాయి లేని ఉంగరంతో ఆయన గారు 'లక్ష్మి' అని వ్రాస్తూఉంటే, తన మనసులో ఉన్నమాట ఆయనకెలా తెలిసిందా అని తనకు ఆశ్చర్యంతోపాటు ఆనందం కలిగింది. ఆ తర్వాత వచ్చిన బంధు వర్గానికి భోజనాలతో, ఆ బారసాల వేడుక ముగిసింది.

ఆ సాయంత్రం పిల్లను ఉయ్యాలలో వేసి పేరంటంచేశారు. కంటికి నిండుగా కనిపించే బొమ్మలూ, గిలకలూ ఉయ్యాలకు కట్టి అలంకారం చేశారు. పాపకు తలంటి నీళ్లు పోసి కొత్త చొక్కా తొడిగి, ఉయ్యాలలో వేసి ఊపుతూ ఉంటే-తనకు పరవశత్వంతో ఒళ్లు తెలియలేదు. వచ్చిన పేరంటాళ్లు అక్షతలు వేసి బిడ్డను దీవించారు. ఏలా ఒక కానుకా తీసుకు వచ్చారు.

పిల్ల పుట్టిందగ్గరనుంచీ అడుగడుక్కీ వేడుకే, రోజురోజూ పండుగే.

మూడోనెల వచ్చేటప్పటికి పిల్ల కాస్త ఒళ్లు చేసింది. కాళ్ళూ చేతులూ తన్నుకుంటూ ఆటలు ఆడుతూంది. వెల్లకిలా పడుకోబెట్టి ఏదో పని చూచుకుందామని లోపలకు వెళ్లి తిరిగి వచ్చేటప్పటికి బోర్ల పడుతూ ఉంది. చేతులు పిడికిళ్లు బిగించటం నేర్చుకుంది.

తన అత్తగారు మరీ పూర్వకాలం మనిషి. అన్నీ ఆనవాయితీ ప్రకారం, ఆచారం ప్రకారం జరిగి పోవాలని అంటుంది. అన్ని వేడుకలూ తు. చ. తప్పకుండా చేయవలసిందేనని అంటుంది. ఆమె ఇష్ట ప్రకారమే లక్ష్మికి అన్ని వేడుకలూ జరిగాయి. మూడో నెలలో ఆమె పిల్లకు ముద్దకుడుములు చేయించి, పేరంటం చేసి పంచి పెట్టించింది.

ఆరు నెలలు పట్టేటప్పటికీ పిల్ల బాగా తేలింది. ముద్దు వస్తూ ఉంది. అత్త, తాత — అంటూ మాటలు చెప్పబోతూ ఉంది. అప్రయత్నంలో ఆ చిన్నారి నోరు అష్టవంకరలు తిరుగుతూ ఉంది. పెద్ద మొత్తంలో చక్కెర కొని, వంటవాళ్ళచేత పాకం పట్టించి, అచ్చులు పోయించి, చిలకలు తయారు చేయించారు. పిల్ల పలకబోయే ప్రతి మాటా, చిలకలా తియ్యగా, ఆర్ద్రంగా ఉండాలి! పేరంటాళ్లకు పలుకులకు చిలుకలు పంచిపెట్టారు.

ఎనిమిదోనెల వచ్చేటప్పటికీ పిల్లకు అన్నప్రాసన చేసే ప్రయత్నాలు చేశారు. మళ్లా దగ్గర బంధువుల్ని పిలిచి విందు భోజనాలు పెట్టి, ఆవేడుక పెద్ద ఎత్తున చేశారు. పిల్లకు తాతగారు వెండి గిన్నె, గ్లాసు చేయించి తీసుకొచ్చారు. బంగారపు ఉంగరంతో తాతగారు పిల్లకు పరమాన్నం నాకించారు. పూజ దగ్గర పీట మీద పుస్తకం, పసుపు, డబ్బు, నగలు, కలం— ఇలా వివిధ సామాగ్రి చేర్చి పెట్టారు. పిల్ల వరసనే అన్నిటి మీదకీ ఎగబడింది. అన్నీ తనకే కావాలంటుంది. లక్ష్మి, పార్వతీ, సరస్వతీ-ముగ్గురు తల్లుల కటాక్షమూ ఆపిల్లయందు ఉంది లెమ్మని అందరూ సంబరాలు పడ్డారు. 'దీని దుంపతెగ! అసాధ్యురాలు అవుతుందిలే!... అనుకుని మురుసుకున్నారు.

అప్పటి కప్పుడే అమ్మాయి తడ బడుతూ అడుగులు వేయబోతోంది. మంచాల్నీ, కుర్చీల్నీ పట్టుకుని అమాంతంగా లేచిపోతుంది. ఇంకేం, అత్తగారు బియ్యం నానబోసి పిండి కొట్టించి అరిసెలు వండించింది. అడుగులకు అరిసెలు అంటూ వేడుక చేసి ముత్తయిదువులకు పంచిపెట్టించింది.

సంవత్సరం గిర్రున తిరిగి వచ్చేసింది. మొదటి సారి పుట్టిన రోజు పండుగ ఘనంగానే చేశారు. ముత్తయిదులందర్నీ పేరంటానికి పిలిచారు. దగ్గరి వాళ్లకు భోజనాలు పెట్టారు. పిల్లకు తలంటి, పట్టుగౌను తొడిగి, నగలు పెట్టి, చేతులకి బంగారు గాజులు వేసేప్పటికి మెరిసి పోతోంది; కుర్చీ వేసి పిల్లను కూర్చోబెట్టి పండుగ చేశారు.

సంక్రాంతి వచ్చిందంటే భోగి పండుగ ఘనంగా చేసేవారు. అదొక పెద్ద హడావిడీ, సంబరం! రేగుపళ్లతో సరికి సరిగా పైసలు కలిపి పిల్లతల మీద పోసే వాళ్ళు. పేరంటానికి వచ్చిన చిన్న పిల్లలకు ఆ పైసలు ఏరుకోవడం ఒక ఆట.

పిల్ల అల్లారుముద్దుగా పెరుగుతోంది. ఇంట్లో అందరికి తేనెలవాక అయిపోయింది. ముచ్చటయిన మాటలు, కులు ఎన్నో కావాలి. మొత్తానికి ఆడపిల్ల ననుపించుకుంది.

మూడో ఏడు వచ్చాక పిల్లకు చెవులు కుట్టించారు. నాజూకైన చిన్న ఒంటి ముత్యం లోలాకులు చేయించి, కంసాలిని పిలిపించి పుట్ట దగ్గర చెవులు కుట్టించారు. పిల్ల తలకాయ వూపినప్పుడల్లా ఆలోలాకులు అందంగా కదులు ముద్దుగా వుండేది.

ఐదో ఏట పిల్లకు అక్షరాభ్యాసం చేశారు. ఈ లోపునే ఒక మంచి రోజున తాతముత్తవ్వలు పిల్లకు పట్టు పరికిణీ, చొక్కా, కట్ట పెట్టారు. ఈ వంకతో మళ్లా పేరంటం చేశారు. గౌను వేసుకు తిరిగే పిల్లకి పరికిణీ కట్టి, నాగరంపెట్టి జడవేసి, జడ చివర బంగారపు కుప్పెలు కట్టి, బొట్టూ కాటుకా దిద్దే సరికి ముద్దుల గుమ్మలాగే ఉంది.

అక్షరాభ్యాసపు దినం మళ్లా ఒక పండుగ. పంతులుగారిని ఇంటికి పిలిపించి పంచెల చాపు పెట్టి, పిల్లకు కొత్త పలకా బలపం కొని అక్షరాభ్యాసం చేయించారు. అప్పటి నుండీ పిల్ల బడికి వెళ్లతూ ఉండేది. ఆరిందా అయింది. చదువులో చురకత్తిలా వేసుకు పోతుంది. ఇంటిదగ్గర ఉంటే ఆడుకున్నంత సేపు ఆడుకుని ఆపైన అమ్మను చుట్టుకు చుట్టుకు తిరుగుతుంది.

పదకొండవ ఏడు వచ్చేటప్పటికి పిల్లకు తాత ముత్తవ్వలు పమిటఇస్తామని తీసుకువెళ్ళారు. మంచి రోజు చూచి కొత్త పరికిణీ, జాకెట్టు, ఓణీ కట్ట బెట్టి పేరంటం చేశారు. ఓణీ వేసేటప్పటికి పిల్ల ఎంతో ఎదిగిపోయినట్లు అనిపించింది. మంచి రోజు చూచి పైట వేయించారు. కనుక ఇహ ముందు ఎప్పుడు అవసరం వస్తే అప్పుడు పమిటలు వేసుకోవటం మొదలు పెట్టవచ్చునన్న మాట! పిల్ల పమిట సర్దుకుంటూ హోయలు పోతుంటే ఒకటే నవ్వువచ్చేది.

పిల్ల ముద్ద బంతి పువ్వులా ఎదుగుతూ వుంది. పదమూడేళ్లు నిండుతాయనగానే మూల కూచుంది. తాటాకులు పరిచి తెల్లబట్ట పరిచి పిల్లను కూర్చోపెట్టారు. ముత్తయిదువులంతా పేరంటానికి వచ్చారు. చిమ్మిలి తొక్కి ఉండలు చేసి పంచిపెట్టారు.

మూడు రోజులూ పేరంటమే. పులగం వండి మట్టి మూకుట్లో బెల్లం, పాలు పోసి పిల్లకు తినటానికి పెట్టే వాళ్లు. ఆ నాలుగు రోజులూ పిల్లకు ఉప్పుకారం పెట్టకూడదని అలా పత్యం చేయించారు. నాలుగో రోజు రాత్రి ప్రొద్దు పోయినాక పిల్లకు తలంటి పోశారు. తాటాకులు తగలేశారు. విడిచిన చీరే, జాకెట్టూ చాకలివానికి ఇచ్చారు. అయిదవ రోజు అట్ల బంతి చేశారు. అరిసెలు వండారు. ఏడు రోజులూ మందిరం కట్టించి, లక్ష్మీ, పార్వతి, సరస్వతి– ఇలా అన్ని రకాల వేషాలు వేసి పేరంటాళ్లు చేసి ఫోటోలు తీయించారు. సన్నాయి మేళం పెట్టారు. పదకొండో రోజున పెద్దబంతి పెట్టారు. ఊరంతా భోజనాలు, సందడి, సాయంత్రం మళ్లా పిల్లకు పట్టుచీర కట్టి, పెళ్ళికూతుర్లా అలంకరించి కుర్చీలో కూర్చోబెట్టి పేరంటం చేయించారు. వచ్చిన ముత్తయిదువులందరికీ పిల్లచేత పళ్లూ, తాంబూలం పంచి పెట్టించారు. అంతటితో ఆ వేడుక ముగిసింది.

వారాలు, నెలలు, సంవత్సరాలు జరుగుతూ ఉన్నకొద్దీ, పిల్ల ఒంటికి మిస మిస వచ్చింది. వయస్సు శరీరానికి ఎన్ని మెరుగులో పెడుతుంది. పిల్లను చూస్తే మురిపెంగా ఉంది. చదువంటే పిల్లకి ప్రాణాలు. ఇంట్లో ఉన్నప్పుడు తనకు సాయం చేయబోతుంది. పిల్లకు చిన్న చిన్న పనులు నేర్పింది తాను.

కళ్యాణ ఘడియ వస్తే క్షణం కూడా ఆగదని అంటారు. చదువుకుంటున్న పిల్లకి అన్నివిధాలా అనుకూలంగా ఉన్న సంబంధం కలిసి వచ్చింది. 'ఈ సంబంధం కుదరకపోతే ఎలా' అని తనకు రంధి పుట్టింది. ఇంకా రెండు మూడేళ్ళ పోయినాకయినా, పెళ్లి చేయవలసినదే కదా! సిరిరా మోకాలొడ్డినట్లు ఇంత మంచి మనువు పోగొట్టడం ఎవరికీ ఇష్టం లేకపోయింది. తాను పిల్లను కూర్చోపెట్టి నచ్చ చెప్పింది. పెళ్లి చూపులికి వొప్పించింది.

మంచి రోజు ఏర్పాటు చేసుకొని పెళ్లివారు పెళ్లి చూపులకు వచ్చారు. పిల్ల కడిగిన ముత్యంలా ఉంది. ఆర్భాటాలూ అలంకారాలూ ఎక్కువ ఏమీ చేయలేదు. పిల్లవాడి తల్లీ తండ్రీ అక్కగారూ ఏవో ప్రశ్నలు వేసి పిల్లను మాట్లాడించారు. పిల్లవాడు పిల్లను చూచుకున్నాడు. ఏమీ మాట్లాడించే అవసరం లేదని అన్నాడు. అతని సంస్కారానికి అందరికీ ఆశ్చర్యమూ ఆనందమూ కలిగింది.

పెళ్లి చూపులు ముగుస్తూనే పెళ్లి నిశ్చయం అయిపోయింది. 'అదంతా మన లక్ష్మి అదృష్టం' అనుకున్నారు తామందరూ.

మంచి రోజు చూచి వియ్యాల వారు పిల్లకు ప్రధానం తెచ్చారు. పట్టు చీరె, రవిక, మెడలోకి ముత్యాల నెక్లెసు, ఉంగరము పెట్టారు. వచ్చిన పెళ్లివారందరికీ విందు భోజనాలు, అందరికీ తామ ఖరీదయిన బట్టలు పెట్టారు. బ్రాహ్మణ్ణి పిలిపించి ఆరోజు పిల్లచేత పూజ చేయించారు.

ముహూర్తం కూడా దగ్గరలోనే కుదిరి పోయింది. మంచి రోజు చూచి ముత్తయిదువుల్ని పిలిచి పసుపు కొట్టించారు. అక్కడి నుంచీ పెళ్లి పనులు మొదలు పెట్టారు. ఊపిరాడని పనులు మగ వాళ్లద్వారా కావలసినవి కొన్ని, ఆడవాళ్లు ఇంట్లో చేసుకోవలసినవి కొన్ని, ఇంటికి సున్నాలు, రంగులు వేయించటం, పందిళ్లు వేయించటం, ఇంట్లో వాళ్లకు బట్టలు, పెళ్లికూతురికి పట్టుచీరెలు, వియ్యాల వారికి బట్టలు, అప్పడాలు, వడియాలు చేసుకోవడం ఇంకా లక్షా తొంభై పనులు ఆడవాళ్లవి. అన్నీ తయారుచేసుకొనేటప్పటికి ఆ శుభఘడియ రానే వచ్చింది.

రెండు మూడు రోజులు ముందుగానే మంచి రోజు చూచి పిల్లను పెళ్లికూతుర్ని చేశారు. ముత్తయిదువులందర్నీ పిలిచి మేళాం పెట్టి పేరంటం చేశారు. అప్పటి కప్పుడే పిల్లకు పెళ్లి కళ వచ్చేస్తోంది.

ఈ సంబరాలలో ఎప్పుడు ప్రొద్దు కుంకుతూ ఉన్నదో, ఎప్పుడు ప్రొద్దు తిరుగుతూ ఉన్నదో కూడ తెలియకుండానే కాలం గడిచి పోయింది.

రాత్రికి ముహూర్తం, సాయంత్రం నుంచీ పిల్లకు అలంకారం ప్రారంభించారు. పూలజడ వేశారు. కళ్యాణపు బొట్టు దిద్దారు. బుగ్గన చుక్క పెట్టారు. బెనారసు జరీ పువ్వుల చీరె కట్టారు. పిల్ల మెరసి పోతూఉంది. దృష్టి తగలదు కదా-అనిపించింది.

పిల్లను గౌరీపూజకు కూర్చోపెట్టారు. సర్వమంగళ రూపిణి గౌరీదేవి. ఆ తల్లిని పూజించితే సర్వశుభాలూ అనుగ్రహిస్తుంది. పెళ్ళి చేసుకోబోయే ఆడపిల్లకు ఆ తల్లి అనుగ్రహం మిక్కిలి అవశ్యకం గదా!

వివాహ వేదికపైన వరుడి చేత పూజ చేయిస్తున్నారు. నుదుట బాసికం కట్టి పిల్లను వేదికపైకి తీసుకువచ్చారు. వధూవరుల మధ్య పరదా వెలిసింది. కంకణధారణ అయింది.

తాను వెండి చెంబుతో నీళ్ళు పోస్తూ ఉండగా, మంత్రఘోషల మధ్య ఆయనగారు అల్లుడి కాళ్లు కడిగి కన్యాదానం చేశారు. బిడ్డను ఒక అయ్య చేతిలో పెట్టారు. అంతటితో పిల్ల పరాయిదయిపోయినట్లే.

ముహూర్తం సమయానికి వధూవరు లిద్దరిచేతా, ఒకరి నెత్తిమీద మరొకరిచేత జీలకర్ర బెల్లం పెట్టించారు. తర్వాత మంగళ వాయిద్యాల మధ్య మంగళ సూత్ర ధారణ అయిపోయింది. పూలదండలు వేయించారు.

తలంబ్రాలు పోసుకున్నారు. ఈ తలంబ్రాల వేడుక ఎప్పుడు ఎవరు ఏర్పాటు చేశారోకాని, అవి నెత్తిమీద పోసుకునే క్రొత్త దంపతులకూ, చూచేవారికీ కూడా వినోదంగానే ఉంటుంది. దంపతుల తెల్లని క్రొత్త బట్టలనిండా పసుపు, క్రొత్త కళ.

మేనమామ తెచ్చిన మట్టెలు, పిల్లేళ్ళు, పిల్ల కాళ్ళకు తొడిగారు. అత్తవారు తెచ్చిన నల్లపూసలు మెళ్లో కట్టించారు. బిందెతో మంచినీళ్ళు తెప్పించి, మట్టె, ఉంగరం—అందులో పడవేసి వధూవరు లిద్దరినీ అందులో చేతులుపెట్టి వెతికి తీయాలన్నారు. అల్లుడు అలా ఉన్నాడు కాని గడసరే కామోసు. పిల్ల చేతిని గిల్లాడో గిచ్చాడో కాని రెండు సార్లూ బంగారపుటుంగరం తానే పైకి తీసి మెర మెచ్చులు పొందాడు. మూడోసారి ఏమనుకున్నాడో కాని పిల్లను తీయనిచ్చాడు. ఆ క్రొత్త దంపతుల ఆట చూచి అందరి ముఖాలలోనూ ముసి ముసి నవ్వులే.

బ్రహ్మముడి వేశారు. వరుడి ఉత్తరీయపు చెరగుకూ, పిల్ల పమిట చెరగుకూ ముడి. అంతటితో వాళ్ళ ఇద్దరి జీవితాలకూ ముడి పడింది.

సానమీద కాలివేలితో తొక్కించారు. హోమగుండం చుట్టూ ఇరువురినీ ఏడడుగులు నడిపించారు. బయటకు తీసుకువచ్చి ఆకాశంలో దేదీప్యంగా వెలుగుతున్న అరుంధతి నక్షత్రాన్ని వధూవరులకు చూపించారు.

ఇంటోకి వచ్చేముందు వాకిట్లో కాపలా కాశారు. వరసయిన పడుచు భామలు వాకిట్లో చేరి పేరు చెప్పందే వాళ్ళను లోపలకు రానీయమని మొండికేశారు. చుట్టూ గుమిగూడిన వాళ్ళకు అది ఒక సరదా, వేడుక. వధువుకీ వరుడికీ దాచుకుందామన్నా దాగని దరహాసం. సిగ్గు పడటాలు, పంతులు పోవటాలు, వరసయిన వాళ్ళు వాగ్బాణాలు విసురుకోవటాలు. అర ఘడియసేపు ఆ వేడుక సాగింది. చివరకు అప్పటిదాకా పంతం పోయిన వరుడు స్పష్టంగా పిల్ల పేరు చెప్పి పిల్లవంక చూచాడు. పిల్ల తప్పదనుకుని గొణిగినట్టుగా మొగుడి పేరు చెప్పింది. మాకు వినపడలేదంటే మాకు వినపడలేదని గోలకెత్తారు. మగవాళ్లు కాలాతీతం అవుతుందని కేకలు వేశాక, ఇహ వాళ్ళను లోపలకు వదిలారు.

అలివేణి కుండల దొంతుల దగ్గర వధూవరుల్ని కూర్చోపెట్టి పూజ చేయించారు.

అంతటితో అన్ని వేడుకలూ వేడుగ్గా ముగిశాయి. ఇప్పుడు తానూ ఆయనగారూ—ఈ చిట్టితల్లిని భర్తకీ, అత్తవారి ఇంటిలో వారందరికీ ఒప్పగింతలు పెడుతున్నారు. కళ్ళ నీళ్లు తుడుచుకుటూ బిడ్డవంక చూచుకున్నది ఆ తల్లి.

పురిట్లో పిల్లను పందిట్లో పెళ్ళికూతురయేంతవరకూ ఆ తల్లి భావనలో కొద్ది నిముషాలలో సినిమా రీలువలె తిరిగింది. ప్రపంచంలో అన్నిటికన్నా మనిషి మనస్సు మహా వేగవంతమయినదని అంటారు. మనోవేగం ఆఘమేఘాలమీద తేలిపోతుంది.

పిల్లకూ కన్నీటిధార ఆగటంలేదు. కన్నకడుపు ద్రవించి పోయింది.

"కంట నీరు తుడుచుకో కనకంపు బొమ్మ
జంటగా పతితోడ సుఖియింపు మమ్మా!"

అంటూ ఆఖరు వొప్పగింత పెట్టింది ఆ తల్లి.

—ఆ తర్వాత కథ నేను చెపుతాను. ఉద్వేగంతో, దీనంగా ఉన్న ఆ తల్లి ఏమి చెపుతుంది మీకు కథ!

ఆ తర్వాతకూడా పిల్లకు ఎన్నో వేడుకలే. అత్తవారి ఇంటికి తీసుకువెళ్ళి గృహప్రవేశం చేయించారు. మళ్ళా వాకిలి ముందు నిలవేసి పేర్లు చెప్పించటం, వేళాకోళాలు, ఈ సారి వరుడికి స్థానబలిమి వచ్చింది. నవ్వుల్తో ఇంట్లోకి నడిచారు. క్రొత్తకోడలు కుడిపాదం ముందుపెట్టి గడపదాటింది.

మర్నాడు అత్తవారి ఇంట్లో సత్యన్నారాయణ వ్రతం చేయించారు. పిల్ల తల్లీ తండ్రీ వచ్చారు. నూతన దంపతులకు పట్టుచీరెలూ పట్టంచు తాపితాలూ కట్టపెట్టారు. కన్యాదానంచేసిన ఆ దంపతులకు వియ్యాలవారు బట్టలుపెట్టారు.

పెళ్ళయిన పదహారు రోజులకు పదహారు రోజుల పండుగ చేసారు. దగ్గర చుట్టాలందరికీ విందు భోజనాలు. అత్తింటి వారిదీ, పుట్టింటివారిదీ రెండు మంగళ సూత్రాలూ కలిపి ఒకటిగా గుచ్చారు.

పిల్లకు అట్ల వాయినాలు, తద్దె పేరంటాళ్ళు తీర్చారు. ముత్తయిదువుల్ని పిలిచి వాయినాలు ఇచ్చారు.

నవ దంపతులు మానసికంగా విడని బంధమైనారు. వారి అనురాగం మరింత గాఢమూ, పరిపూర్ణము కావటానికి ఇంకా కొంత తరవాయి ఉంది. కుర్రవాడికి భార్యమీద క్రొత్తగా ఏర్పడిన ఇష్టం, కోరిక, కాంక్ష, అది ఆమెకు ఎలా ప్రదర్శించి తెలిపితే బాగుంటుందో అతనికి తోచలేదు. ఈ తప్పనిసరి విరహం అతనికి తీయగానూ, బాధగానూకూడ ఉంది. ధైర్యంచేసి క్రొత్త పెళ్ళానికి ఉత్తరం వ్రాశాడు. భార్యకేకదా వ్రాసుకున్నాడు! ఎవరేమంటారు! అదీ అతని ధైర్యం.

పిల్లకు ఎక్కడలేని సిగ్గు వచ్చిపడింది. మొగుడంటే మోజు, ఇష్టం, తనవాడని ఏదో పొంగు, ఎవరైనా అతని ప్రసక్తి తీసుకువస్తే గుండెల్లో సంబరం, అతను వ్రాసిన ఉత్తరం చేతిలోకి వచ్చేటప్పటికి గుండె గుబగుబలాడింది. గుండె ఎందుకూ అంత శబ్దం చేస్తూ కొట్టుకుంది! ఎవరికైనా వినిపిస్తుందేమో! అణచుకోవటానికి చాతకాని ఉద్వేగం! ఉల్లాసం! దానికితోడు స్నేహితురాళ్ళ వేళాకోళాలు, ఉడికించటాలు ఎక్కువయినాయి. వాళ్ళు ఉడికిస్తుంటే తనకు కోపం వచ్చినట్లు నటిస్తున్నది కాని నిజంగా లోలోపల సంతోషంగానే ఉంది!

పిల్ల నడుస్తుంటే క్రొత్తగా పెట్టిన మట్టెల సవ్వడి మంజులంగా వినవస్తున్నది. మెళ్ళో మంగళ సూత్రాల గలగల పచ్చటి మెడలో నల్లపూసల అలంకారం. పిల్ల కన్నె ముత్తయిదువులా కలకలలాడి పోతున్నది.

మంచిరోజుచూచి పునస్సంధానానికి ముహూర్తం పెట్టించారు. దగ్గర చుట్టాల్ని పిలిచారు. మళ్ళీ పెళ్లి చేసినంతపని చేశారు. పిల్లా పిల్లవాడూ పీటలమీద కూర్చున్నారు. బ్రాహ్మణుడు వాళ్ళిద్దరిచేతా పూజ చేయించాడు. వారి దాంపత్యం మూడుపూవులూ ఆరుకాయలుగా వర్థిల్లాలని దీవించాడు. పాన్పులేసి వారిద్దరినీ ఎదురెదురుగా కూర్చోపెట్టారు. దంపతులను దగ్గరకు రప్పించి వారిద్దరిచేతా ఫలప్రదానాలు ఇప్పించారు. రవికల గుడ్డ, కొబ్బరిబొండాం, పండు, తాంబూలం పంచిపెట్టించారు.

పడకటింటిని ఇంద్రభవనంలా అలంకరించారు. అగరు ధూపాల సువాసనలు, మల్లెలదండల విరితావులు, అత్తరువుల ఘుమఘుమలు, పానుపునిండా మల్లెలు, వెండిపళ్లాలనిండా ఫలహారాలు, మీగడపాలు.

పిల్లను మళ్లా పెళ్ళికూతుర్లా అలంకరించారు. అందాల భరిణలా ఉంది పిల్ల. మొఖంలో ఆ సిగ్గు ఒక పెద్ద ఆభరణంలా అమిరింది.

ఇంతవరకూ మానసికంగా మాత్రమే దగ్గరయిన ఆ నవ దంపతులు ఆ రాత్రి శారీరకంగా ఏకమయ్యారు. వారి దాంపత్య జీవన భాగ్యానికి పునాది వేసుకున్నారు.

నోముల పంటలా శ్రావణలక్ష్మి తల్లివచ్చింది. పిల్లచేత వరలక్ష్మీవ్రతం చేయించారు. అత్తవారు పిల్లకు నగ రూపు చేయించి తెచ్చారు. పెద్దయెత్తున బంధువులకు భోజనాలు. సాయంత్రం పేరంటం చేశారు.

పెళ్ళయిన తొలి వినాయకచవితికి పిల్లను ఉపవాసం ఉంచారు. పూజ చేయించి ముత్తయిదువులకు ఉండ్రాళ్ల వాయినం ఇప్పించారు.

కార్తీక సోమవారాలు చేయించారు. ఉండ్రాళ్ళ తద్దె, అట్ల తద్దె, పదహారు కుడుముల తద్దె. అన్ని పండుగలూ, నోములూ వ్రతాలూ ఆనవాయితీప్రకారం వదిలిపెట్టకుండా చేశారు.

మంచిరోజు చూచి సారెపెట్టి పిల్లను తొలిసారిగా అత్తవారి ఇంటికి కాపురానికి పంపారు. 'సారె' అంటే మాటలా 'సారె' అంటే సర్వమూను. ఇత్తడి సామాను, సీలు సామాను వెండిసామాను, ఇంట్లోకి కావల్సిన కుర్చీలు, టేబిల్లు, ఫానులు, రేడియోలు – ఒకటేమిటి! కరివేపాకు దగ్గరనుంచి కావిళ్ళదాకా అన్నీ పెట్టి పిల్లను పంపించారు.

ఈ సంపదనంతా వెంటతీసుకుని అత్తవారి ఇంట్లో ఉడుగు పెట్టింది పిల్ల. ఆఇంటికి సిరి వచ్చింది. శ్రీ వచ్చింది.

నవదంపతుల కొత్త దాంపత్యం, కొత్తకాపురం, మాటి మాటికీ మదనుని విరితూపులు, అడుగడుగుకీ అనురాగపు తొలకరులు. అతడికి జీవన యానంలో ఏదో పట్టుగొమ్మ దొరికినట్లు అయింది. జీవితానికి అర్థంకూడా తెలిసి వచ్చినటులయి ది. ఆమెకు ఆలంబనం దొరికింది. బ్రతుక్కి పరమార్థం ఏమిటో అవగతమయింది.

వారి ప్రణయానందం పరాకాష్టను అందుకున్నది. వారి ఆనంద చిహ్నం పొటమరించింది. పిల్లకు వేవిళ్లు ప్రారంభమయినాయి.

పిల్ల కన్నవారికి కబురు తెలిసింది, వాళ్ళకు పరమానందం కలిగింది. అయిదోనెలలో అత్తవారి ఇంటికి చలివిడి, పిండివంటలు చేసుకు వచ్చారు. పిల్లను కుర్చీలో కూర్చోపెట్టి పేరంటాళ్ళను పిలిచి సీమంతపు వేడుక చేశారు.

అంతటితో ఆ వేడుక తీరలేదు. ఏడవనెలలో పిల్లను పుట్టింటికి తీసుకువచ్చి మళ్ళీ సీమంతం చేసుకున్నారు. పిల్లకు గాజులు తొడిగించారు. వచ్చిన ముత్తయిదువుల దయా పండంటి కొడుకును కనుతల్లీ ... అని పిల్లను దీవించారు.

తొమ్మిది నెలలూ నిండాక, ఒక నాటి సుప్రభాతాన పిల్ల సుఖప్రసవమై పురుడు పోసుకుంది. చూలింతదనం చాలించి బాలింత అయింది.

పిల్లకు కొడుకే పుట్టాడని అనిపిస్తున్నది నాకు ఆడపిల్ల అయినట్లయితే, ఆ పిల్లకు పోయిన పౌడుగూతా

(తరువాయి 23వ పుటలో)

తెలంగాణా కవి పండితులు

తిరుమల రామచంద్ర

(గత సంచిక తరువాయి)

గద్వాల అనగానే గాడేపల్లి వీరరాఘవశాస్త్రిగారి మధురోదారమూర్తి, ప్రతిభే ఆకృతిగా వచ్చిందా అన్నట్టున్న మూర్తి ప్రత్యక్షమవుతుంది. వారు సహస్రావధానులు. ఆశువుగా అత్యంత కమనీయ కవిత చెప్పేవారు. వారి కవితలు వినే అవకాశం నాకూ కలిగింది. రాజాస్థానాలలో గణికలు నాట్యమాడుతుండగా, రాజవంశ్యులు, రాజబంధువులు ఆ గణికల సోయగానికీ భంగిమా సౌందర్యానికీ విస్తుపోయి రూపాయలు విసిరే కాలమది, అదొక రాజలీల. ఆ రూపాయలను ఆ గణికలు మొగ్గవాలి తీసుకోవాలి. మొగ్గవాలినప్పుడు అంగాంగాకుంచన ప్రసారాలవల్ల కలిగే అందచందాల ఆస్వాదననుగురించి చెప్పనక్కరలేదు. ఒక ఉత్సవ సమయంలో రాజాగారి కొలువుకూటంలో ఒక గణిక నాట్యమాడుతున్నది. నిండు ఓలగం. ఒక రాజన్యుడు రూపాయి విసిరాడు "మొగ్గవాలి తీసుకో!" అని ఫర్మాయించాడు. ఆమె గర్భవతి, మొగ్గ వాలలేకపోయింది. అప్పుడు ఆశువుగా అన్నారు గాడేపల్లి వీరరాఘవశాస్త్రిగారు :

"మకరాంకు కేళికోర్వని

ముకురానన మల్లయుద్ధమునకెటోర్చున్ ?

అని, ఉత్తరార్థం జ్ఞాపకంలేదు. పూర్వార్థం మాత్రమే ఉదహరించాను.

గద్వాల దేశం నాలుగంచులనుంచి వచ్చిన పండిత ప్రకాండుల వాక్యార్థ యుద్ధాలకు, అనేకానేక గాయక సార్వభౌముల జుగల్‌బందీలకు రంగమయినట్టిది. అష్టావధాన, శతావధాన, సహస్రావధాన, ఆశుకవితా మల్లయుద్ధాలకు, భరతమునినే దిద్దిన నర్తకీమణుల నాట్య స్పర్ధలకు ఆటపట్టయినట్టిది. గద్వాలేకాదు, ఈ జిల్లాలోని సంస్థానాలన్నీ అలాటివే. గద్వాలనుగురించిన మరొక విచిత్రమైన కథ చెబుతాను.

అర్ధశతాబ్ది క్రితం శాఖాభిమానాలూ, పరమత అసహనాలూ మరీ ఎక్కువ. మరొక శాఖవారిని గుర్తించడానికీ, వారికి ఆస్థానంలో ప్రవేశం కలిగించడానికీ ఆస్థాన విద్వద్వరేణ్యులు ఎన్నో అడ్డుపుల్లలు వేసేవారు. ఒకసారి ఒక మహావిద్వాంసుడు గద్వాలకు వచ్చాడు. రాజాస్థానంలో ప్రవేశం దొరకలేదు. యుక్తి పన్నవలసివచ్చింది. ఆస్థానం గుమాస్తాను ఆశ్రయించాడు. మహారాజు పండితగోష్ఠి చివరినాడు "మరెవరైనా వున్నారా విద్వత్కవులు ? ఉంటే దయచేయవచ్చు." అని ప్రకటించారు. దర్బారు గుమాస్తాలేచి, "చిత్తం, హుజూర్. మా ఇంటో ఒక పెద్దమనిషి దిగాడు, ఎప్పుడూ ఏదో వ్రాసుకుంటూ ఉంటాడు. నేను కవిని. మహారాజావారి దర్శనం చేసుకోవాలి అంటున్నాడు. సెలవయితే . . . . ." అని నీళ్లు నమిలాడు. "అట్లనా! రమ్మనండి!" అని మహారాజా సెలవిచ్చారు.

ఒక ఆజానుబాహువైన స్ఫురద్రూపి దర్బారులో అడుగు పెట్టాడు. ఆయన చేతిలో ఒక చిన్న మూట ఉంది. "ఏమి చేస్తారు ? ఏమి చెబుతారు ?" మహారాజా ప్రశ్న. "కవిత్వం చెబుతాను మహారాజా". ఆయన మనవి చేశారు. వ్రాసుకొని వచ్చారా ? మూటవిప్పి చదవండి." అన్నారు, మహారాజా! "వ్రాసుకొని రాలేదు మహారాజా!" ఆయన సవినయంగా మనవి చేశాడు. "అయితే ఆశువుగా చెబుతారా ?"

"ఆఁ!"

"అయితే, చెప్పండి."

ఆ వ్యక్తి నెమ్మదిగా మూట విప్పాడు. జరీ ఉత్తరీయం తీసి కప్పుకొన్నాడు. చేతిలో టెంకాయ పట్టుకొన్నాడు. వంద పద్యాలు ఆశువుగా చెప్పాడు. మహారాజు ఆశ్చర్యపడ్డారు. తమ ప్రక్క విడిగా కుర్చీ వేయించి కూర్చో బెట్టుకొన్నారు. ఆయన ఎవరో కాదు! దేశంలోని అనేక రాజాస్థానాలలో ఆశుచిత్ర కవితలు చెప్పి, అవధానాలు వినిపించి ఆనందింప జేసిన పిశుపాటి చిదంబర శాస్త్రిగారు. శాస్త్రిగారు తర్వాత ఆరు నెలలపాటు గద్వాలలో ఉండి నిత్యకవితోత్సవం జరిపారని వారి శిష్యులు చెప్పేవారు.

నేటికీ గొట్టుముక్కల కృష్ణ మూర్తిగారు మొదలయిన కవులు గద్వాల కవితా సంప్రదాయం కాపాడుతున్నారు.

కవి పండితులను పోషించిన మరొక సంస్థానం అమరచింత ఆత్మకూరు. ఇక్కడ బుక్కపట్నం వంశీయులు మహావిద్వాంసులు. ఆ వంశంవారే ప్రౌఢ సరస్వతి బుక్కపట్నం శ్రీనివాసాచార్యులు. వారు పెక్కు శాస్త్రాలలో విద్వాంసులు, శ్రీనివాస విజయాది కావ్యాలు రచించినవారు. శ్రీనివాసవిజయం పరకాల మఠాధిపతులు, హైదరలీ కాలంవారు అయిన శ్రీ శ్రీనివాస బ్రహ్మతంత్ర పరకాల యతీంద్రుల విజయాలు వర్ణించే కావ్యం. ఈ ప్రౌఢ సరస్వతితోనే తిరుపతి వేంకట కవులు ఢీకొన్నది.

మొన్న మొన్నటిదాక పరకాల మఠాధిపతులయిన శ్రీ అభినవ రంగనాథ బ్రహ్మతంత్ర పరకాల మహాదేశికులు ఆత్మకూరు వారే. వారు న్యాయవిశిష్టాద్వైత వేదాంతాలలో అసమాన విద్వాంసులు, వ్యాఖ్యాతలు .

ఆత్మకూరు వారయిన పుసులూరు శేషాచార్యులవారు, వారి సోదరులు దీక్షాచార్యులు గారు సుప్రసిద్ధ విద్వాంసులు.

ఆత్మకూరులో పెరవలివంశం విద్వాంసులపుట్ట. వారిలో ఇటీవలి పెరవలి లింగయ్యశాస్త్రిగారు, సంస్కృత వాగ్గేయకారులు. వారి సంస్కృత గేయ మొకటి, వారి జ్యేష్ఠ సోదరులయిన నరసింహావధానులు గారి పుత్రి శ్రీమతి కప్పగంతుల అన్నపూర్ణమ్మ గారినుంచి విన్నది ఉదాహరిస్తున్నాను.

శంకరా హర శంభో
శంకరా హర శంకరా
సంకట కృన్మీనాంక వి
శంకట దర్పాంకుర హర–శంకరా
ఫాలలోచనా, నాథ
పాప యోచనా
బాలేందు మౌళే, గౌరీలలన
పాలయమాం నీలకంఠ–శ్శంకరా
రాజతాచలవాస పూజితాఖిల
తేజః పరిమాణ దివ్య
భ్రాజత్సకలాగమ
యోజన పదరాజీవ–శంకరా

ఈ నరసింహావధానులుగారు అటు వేదాలను ఇటు సంగీతాన్ని పుక్కిట బట్టినవారు. వైదికలౌకిక కళావిదులు. వీరు సంస్కృత నాటకాలలో సూత్రధార పాత్రను, తక్కిన పాత్రలను అతి నిపుణంగా నిర్వహించి తమ శ్రావ్యగానకళతో ప్రేక్షక శ్రోతలను ఆనందపరచేవారు. వీరి వంశం వేదశాస్త్ర నిష్ణాతృముక్తామణులకు వంశం. వీరు సార్థక శ్రీవత్స గోత్రులు.

కృష్ణాతీరంలో జటప్రోలు సంస్థానంలోని మంచాలకట్ట "సర్వధర్మాన్ పరిత్యజ్యమామేకం శరణం వ్రజ'' అన్న భగవద్గీతోక్తిని అనుసరించే విశిష్టాద్వైత సంప్రదాయాన్ని సార్థకం చేసినట్టిది. ఇది ఒకప్పుడు పరమైకాంతులకు పుట్టినిల్లు, శరణాగతి శాస్త్రానికి ప్రతీక. వేదవేదాంత సారమని విశిష్టాద్వైతులు నమ్మే మూల మంత్రంతోనే వైదికకర్మలు చేయవచ్చుననే సంప్రదాయం ఇక్కడ పుట్టింది. ఇది నిజానికి ఉత్తమోత్తమ భక్తియోగానికి ఉదాహృతప్రాయమయినా, ఆ స్థాయిని అందుకోలేని వారికి విడూరమయి మంచాలకట్టసంప్రదాయం అని ఆక్షేపణకు, కువ్యాఖ్యలకు దారితీసింది. ఈ గ్రామంవారయిన గోవిందాచార్యులవారు మొదలయిన మహావిద్వాంసులు ఆంధ్రదేశమంతటా విఖ్యాతులు.

విఖ్యాత తార్కికులు దోనిపూడి నరసింహశాస్త్రిగారు ఈ మంచాలకట్టవారే. వీరు నాచిన్నతనంలో తిరుపతికి వచ్చినప్పుడు, "కాపూర్వః'' మీది ఏ ఊరు? అని ప్రశ్నించేవారు. విద్యార్థులను ప్రశ్నించేటప్పుడు కాతర్వాత ఒక మాత్రాకాలం ఆగేవారు, శ్రోతలను పట్టి కొట్టించటానికి.

అలంపురంలో వెల్లాల శంకరశాస్త్రిగారు, బాలసరస్వతి కుమారస్వామి శాస్త్రిగారు ప్రఖ్యాత విద్వాంసులు.

అలంపురం తాలుకా అన్నప్పుడు సార్థక నామధేయులయిన సురవరం ప్రతాపరెడ్డిగారు తెలుగు వాడయిన ప్రతివాడికీ జ్ఞాపకం వస్తారు. వారు ఇటిక్యాల గ్రామ వాస్తవ్యులు. నీళ్లులేని ఇటిక్యాల అని ఆయన వ్రాసుకునే వారు. నిజాం ప్రభుత్వాన్ని పల్లెత్తుమాట అన్నా పరలోకం చూడవలసిన భయంకరకాలంలో కోఠికి సమీపంలోనే గోలకొండ పత్రిక నెలకొల్పినడుపుతూ నిరంకుశ ప్రభుత్వానికి పక్కలోబల్లెమై, ధైర్యానికి, న్యాయానికి, ధర్మనిష్ఠకు పత్రికా రచనను ప్రతీకగా తీర్చిదిద్దిన మహాప్రతాపులు వారు. వారుకవులు, వచన రచయితలు, పరిశోధకులు,కథకులు, సాటిలేని ప్రజాసేవకులు. సహృదయత అనేది వారి స్వభావానికి బంగారు రంగరింపు. దానికొక చిన్న ఉదాహరణ ఇస్తున్నాను:—

నేను మీజాన్ పత్రికలో పనిచేస్తున్నప్పుడు ప్రతాపరెడ్డిగారు అధ్యక్షులుగా విజ్ఞాన వర్ధనీ పరిషత్తు అనే సాహిత్య సంస్థ నెలకొన్నది. దానిలో వారం వారం ఒకరు వ్యాసం చదవాలి, దాని పై చర్చలో ఎవ్వరు మొగమాటపడరాదు; పడలేదు. ఒక మారునేను "తెలుగు సాహిత్యంలో స్త్రీవాచకపదాలు'' అనేవ్యాసం చదివాను. దానిలో నంగనాచి శబ్దచర్చ ఉంది. ఆ చర్చలోవారు నంగనాచ్— సిగ్గులేక ఎగిరేది అనే అర్థమిచ్చే హిందీమాట నంగనాచి పదానికి మూలమయి ఉంటుందన్నారు. నేను నాకుర్రతనం కొద్ది ప్రతిఘటిస్తూ, నంగనాచి అంటే, అమాయికురాలివలె ప్రవర్తించే గరిత గనుక,నంగనాచ్ అనేమూలం సరిపోదని, ఇది ద్రావిడ పదాల సమాహారమేనని అన్నాను. నంగై అంటే అమాయకురాలైన చిన్నపాప. నాచ్చి అంటే నాయకురాలు. అర్థాత్ నంగైగా అమాయకురాలయిన చిన్నపాపగా కనిపించే నాతి చతురురాలు—అన్నాను. రెడ్డిగారు ఆనందించడమే కాక ఫైలాలజీ ద్వారా నాకు ఆత్మీయులయ్యారు.

ఈ జిల్లాలోని సంస్థానాధీశ్వరులూ మహా విద్వాంసులు. కవిత చెప్పగలవారును, వనపర్తిని 16వ శతాబ్దివరకు పాలించిన అష్టభాషా బహరీ గోపాలరావుగారు రామచంద్రోదయ కావ్యం శృంగారమంజరీ భాణం రచించారు. వారి మేనల్లుడు బిజ్జల తిమ్మారెడ్డి అలంపురం వాస్తవ్యులు. అనర్ఘరాఘవ నాటకాన్ని మహాప్రబంధంగా తెనిగించారు. దీనికి ఏ కారణంవల్లనో అంత ప్రచారం రాలేదు. దానిలో నాకు తెలిసిన రెండు పద్యాలు ఉదాహరిస్తాను.

తిమ్మారెడ్డిగారు తమ ప్రబంధం అవతారికలో తమవంశ ప్రశస్తి ఇట్లా చెప్పుకున్నారు:—

"ఏ సరిత్తిలకంబు హేమాంబరుని పాద
రాజీవమునకు మరందధార,
ఏ నదీ తల్లజం బీశాను మస్తక
సీమకు పాండురోష్ణీషశాటి,
ఏ వాహినీసతి హిమవద్ధరాధర
శృంగాంతరంబుల క్రీడసల్పు,
ఏ ధునీకెంత పాథోధి మూర్ధన్యున
కగ్రభార్యామణియై రహించు.
అట్టి గంగకు తోబుట్టువగు చతుర్థ
జాతియందు నితాంత విఖ్యాతి దనరి

యున్న మొటవాడ కులమున చెన్నుమీరె
చాల బిజ్జల తిమ్మభూపాలమౌళి"

ఇది వారి ఊహాచమత్కృతికి తార్కాణం. వారి పాండిత్యానికి మచ్చుతునకగా ఒక పద్యం ఉట్టంకిస్తారు. వారు నామధాతువు పైన శత్రంతాలతో నడిపిన మత్తేభం. చిన తిమ్మభూపతి ప్రతాపాగ్ని కాంతికి ప్రపంచమే ఎర్రబడి పోయిందట.

"ఇనదబ్జంబు, ధనంజయచ్ఛరము, వాణీశద్గిరీశంబుకో
కనదత్కైరవ, మబ్జరాగదుడురా
ట్కాంతంబు, కాశ్మీరజ
స్తనసారంబు, సురాలయద్రజతగో
త్రంబౌచు, చెన్నొందె నా
చినతిమ్మ క్షితిపాల బాహువిభవా
ర్చిర్వ్యాప్తి మల్లోకముల్

ఇన ఇవ ఆచరతి — ఇనయతి. ఇనయతీతి ఇనత్, సూర్యుని వలె ఆచరించు చున్నది చంద్రమండలం. అంటే ఎర్రబడి పోయింది.

విద్వత్కవులకు నెలవైన ఈ జిల్లా పూర్వమేకాక ఇప్పుడూ ఎంతో ప్రతిష్ఠ కలిగి ఉంది. ఈ ప్రాంతం వారయిన మిత్రులు ముకురాల రామరెడ్డి గారు నవ్వుపై వ్రాసిన పద్యాలలో ఒక్కటి ఇది :—

" నా కవితా మనస్విని క
నంత విహార వికాస రాస హే
లా కమనీయ జీవిత వి
లాసము నిత్యకళా కలాపమై
చేకురుదాక నవ్వేదను
చింతల పుంతల గ్రమ్ముకొన్న చీ
కాకులు ద్రుల్లగా బ్రతుకు
కంచెల నవ్వులబండి దోలెదన్ "

ప్రాచీన సాహిత్యాన్ని లోతుగా అధ్యయనంచేసి అనర్గళంగా ఉపన్యసించి, తన భావాలను మరుగులేక తెలిపే సాహిత్యోపాసకురాలు డాక్టరు శ్రీమతి పి. యశోదారెడ్డి గారు వనపర్తి ప్రాంతం వారే. వారు ఆశువుగా జాను తెలుగులో కవిత చెప్పగలరు; ధురోహతో కథ నడిపించగలరు; ఎర్రన హరి వంశంలోని బిర్రుగిసిన పద్యాలను పిండి కొట్టగలరు, అన్నిటికీ మిన్నగా అమాయకమైన అంతరంగంతో సాహిత్య ప్రేమికులకు భావామృతం పంచి పెట్టగలరు.

నాకు తెలియని వారు ఎందరో మహానుభావులూ ఉంటారు.

మరిచాను. మహబూబ్‌నగర్ జిల్లా వారయిన మహనీయులొకరిని స్మరించకపోతే నా కృషి సమగ్రం కాదు. వారు బహుభాషాకోవిదులు, పండితులు, న్యాయనిపుణులు, పరిశోధకులు, రచయితలు, కవిత, వక్తృత్వం పుణికి పుచ్చుకొన్న వారు, ప్రజాసేవాపరాయణులు. వారు జీవించి ఉంటే ఆంధ్ర ప్రదేశ్ రూపరేఖలు మరొక విధంగా ఉండేవేమో ! వారు బూర్గుల రామకృష్ణరావు గారు, షాద్‌నగర్ వాస్తవ్యులు. వారిసేవను గురించి ఆంధ్రావళికి చెప్పడం చర్విత చర్వణం. (సమాప్తం)

తెలుగువారి ముచ్చట్లు

(19వ పుట నుండి)

ఎన్నెన్నో ముద్దు ముచ్చట్లు జరపాలి. వేడుకలు చేయాలి. ఈ వేడుకలన్నీ పిల్ల ఎరిగినవే కనుక, చేయించుకుని అనుభవించినవే కనుక, ఈ సారి పిల్ల కొడుకును ఎత్తుకుంటేనే మన అందరికీ మంచిది. లేకపోతే, ఈవేడుకలన్నీ నేను మళ్ళీ ఏకరువుపెట్టనూ లేను, మీరుచదువనూలేరు.


చక్రభ్రమణం పూర్తి అయింది. ఇంగ్లీషులో చెపితే cycle repeat అయింది. పురిట్లో పిల్ల మళ్ళీ పురిటి బాలెంత అయింది. ఇంతటితో నేను చెప్పదలుచుకున్న కథకూడా పూర్తి అయింది.

నిజానికి ఇది సామాన్యపు అర్థంలో 'కథ' అని చెప్పటానికి వీల్లేదు. కాని ఒక విధంగా ఇది తెలుగువారి ఇంటి ఆడపడుచు కథ. కలవారి ఇంటికన్నె కథ. అనాదిగా వస్తున్న ఆచారాల కథ.

ఈవిధులు, వేడుకలు— కాలంతోపాటు కనుచూపుదూరంలో లేకుండా పోతున్నాయి. ఈతరం వారికి ఈ అనాది ఆచారాలపట్ల ఒక విధమైన విముఖత్వమూ, ఏవగింపూ కలుగుతున్నాయి. కాలచక్రభ్రమణవేగంలో మంచికో చెడుకో విలువలూ, ఆచారాలూ, నమ్మకాలూ— అన్నీ తారుమారు అవుతూనేఉన్నాయి. కాని ఇదంతా మంచికేనని మనం అనుకుందాము. ఈతంతులన్నీ చేసే ఓపిక పెద్దవాళ్ళకీ, చేయించుకునే తీరిక పిల్లలకూ ఉండటంలేదు.

కానీ, ఈ ఆచారాలు పూర్తిగా కాలగర్భంలో కలిసి పోయినాక, మన ముందుతరాల వాళ్ళకి 'వేడుక' అంటే అర్థంకూడా తెలియని రోజులు రావచ్చును. లాబొరేటరీల్లోనూ, చంద్రయానాల్లోనూ, కాలం గడపబోయే పడుచు పిల్లలకు ఈ పల్లకీ మోతలెందుకు? ఈ ముద్దూముచ్చటలెందుకు !

కాలగర్భంలో కలసిపోతున్న మన తెలుగుదనం, తెలుగువేడుక, తెలుగుఆచారం, ఒక్కసారి అందరికీ చెప్పాలనే నా ఆరాటమే ఈ రచనకు ఉపక్రమణిక అయింది. ★




కరిగించిన మైనం ద్వారా చికిత్స పొందుతున్న రోగి


...ండంలోని కు
ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రా
చికిత్స, వికలాంగ పునర్నిర్మాణం
జిల్లా సాలూరులోని శస్త్ర చికిత్సా
పరిష్కరించబడుతున్నాయి. ఆగే
ఆసుపత్రులలో యిదే పెద్దది.

ఇక్కడ ఫిలడెల్ఫియా కు
ప్రారంభించబడింది. 1967లో దీని
పథకం అమలుపరిచారు. 1971
చికిత్సాపునర్నిర్మాణ వైద్యశాల ప్ర
కేంద్రం తోపాటు యిప్పుడిక్కడ
సామాగ్రి వున్నది. ఈ ఆసుప
వుంది. ఇంతవరకు సుమారు 7
ఈ మిషన్ కార్యక్రమాలకు నిధు
వస్తున్నవి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్
యిస్తుంది. ఇక్కడ డాక్టర్లకు, న
ప్రస్తుతం ఇండొనేషియాకు చెందిన
ఒక వైద్య విద్యార్థి శిక్షణ పొందు
విద్యార్థులకుకూడా శిక్షణ యివ్వాల
వున్నది.

మానవ సేవే



విజయవంతంగా ఆపరేషన్ పూర్తిచేస్తున్న డాక్టర్ల బృందం



వ్యాధినుంచి కోలుకుం


ఫ రోగుల్లో దాదాపు సగంమంది
లలో వున్నారు. ఈ రోగులకు
మొదలగుసమస్యలు శ్రీకాకుళం
) పునర్నిర్మాణ వైద్యశాలలో
ఆసియాలోకల్లా యిటువంటి

ష్ఠరోగమిషన్ ఆసుపత్రి 1916 లో
వృద్ధి పరచడానికి ఒక బృహత్తర
లోరు 10 లక్షల ఖర్చుతో శస్త్ర
రంభమైంది. కృత్రిమఅంగాల
రకరకాల అధునాతన చికిత్సా
లో 125 పడకల ఏర్పాటు
0 శస్త్ర చికిత్సలు జరిగాయి.
వాలాభాగ, అమెరికా నుంచి
న వత్సరానికి రు. 12,000 లు
ల్లలకు శిక్షణ కూడ యిస్తున్నారు.
ఒక డాక్టరు, ఇంగ్లండుకు చెందిన
న్నారు. ఆంధ్ర వైద్యకళాశాల
ప్రతిపాదన ఒకటి ఆలోచనలో



చేతి వ్రేళ్ళకు వ్యాధిసోకిన భూటాన్‌కు చెందినరోగి చికిత్సపొందుతున్న దృశ్యం

మాధవ సేవ



న్న ఒక రోగి



కనుపాపలకు ఆపరేషన్ చేసిన ఒక రోగిని పరామర్శిస్తున్న పాత్రికేయులు

గోబర్ గేస్ ప్లాంట్

చుండి జగన్నాథం

సామాన్యంగా మనం వాడుకునే వస్తువులలో ఎటువంటి మహిమలు వుండేది మనకు తెలియదు. మనం పల్లెటూళ్ళల్లో నిత్యం ఇండ్లల్లో వాడుకునే ఒక వస్తువు యొక్క సద్వినియోగం అందరికీ పూర్తిగా తెలియదు. ఇండ్లలో శుభ్రం చేయడం కోసం ఆవస్తువును విశేషంగా వాడుతారు. గిట్టనివారిని నిందించేటప్పుడు ఆ వస్తువు పేరుతో దుర్భాషలాడుతారు. 'నీ మొహాన పేడనీళ్ళు కూడా చల్లరు' అని తిడుతూవుంటారు. ఆ మాట విన్నప్పుడు కవి చౌడప్ప శతకంలోని గాడిద జ్ఞాపకం వస్తుంది.

ఒక తల్లి కోపం వచ్చి తన కొడుకును 'గాడిదకొడుకా' అని తిడితే 'వీడా నాకొడుకు' అని గాడిద ఏడ్చిందట. నిజానికి పేడ చాల విలువైన వస్తువు. దానిని ఒక తిట్టులో పూర్తిగా అధమస్థం చేయటం తగని పని. కాని, అజ్ఞానం వలన అటువంటి అభ్యాసం కలిగింది.

ప్రతాపరుద్రీయంలో ఈ అజ్ఞానాన్ని గురించి అన్యాపదేశంగా శాస్త్రిల వారు చమత్కరించారు. 'హావు పేడ మీరు హల్కికొంటార్! హావు వుచ్చ మీరు తాగికొంటార్!' ఒకరి చేత అలా అనిపించి ఆ వస్తువుల విలువలను మనకు వివరించడమైనది. గోమయము, ఇతర పశువులు వేసే మయము (పేడ) చాల ఉపయోగ కరమైనవి.

ఇంటి కళ్ళాపు చల్లుడుకే గాక, ఇంటిలో అలుకుడుకేగాక, ఇంటిలో దీపం వెలుగించుకోవడానికి కూడా పశువుల మయము (పేడ) ఉపయోగపడుతుంది. వంటచెరుకు (పుల్లలు, కట్టెలు) బొగ్గు చేసేపనులు గూడా పశువుల మయము (పేడ) సహాయంతో నెరవేర్చుకొనవచ్చును.

పశువుల మయము (పేడ)తో పనులు నెరవేర్చుకున్నట్లుగానే మనుషుల మలముతో కూడా అట్టి పనులు నెరవేర్చుకొనవచ్చును.

ఈ విషయాలపై గొప్ప పరిశోధన జేసినారు. ఆవిధంగా జేసిన సంస్థలలో ఖాదీ గ్రామోద్యోగ కమీషన్ ముఖ్యమైనది. కేంద్ర ప్రభుత్వం వారు పార్లమెంటరీ చట్టం ద్వారా ఆ సంస్థను నిర్మాణం చేసినారు. గ్రామీణ పరిశ్రమల వృద్ధికై ఆ సంస్థ అనేక పథకాలను తయారు జేసి అమలు చేయించినది.

ఇందులో గోబర్‌గేస్ ప్లాంట్ పథకం ఒకటి. దీనిని సిద్ధం జేయడానికి ప్రబలమైన కారణాలను ఇక విందాం. మనదేశంలో ఆహారం కొరత ముఖ్యమైన సమస్యగా వుంటూనేవున్నది. మన పరిమిత కుటుంబ పథకం, సస్యవిప్లవ సన్నాహం సంపూర్ణంగా ఫలించేవరకు ఈ కొరత వుంటూనే వుంటుంది. ఆహారం తర్వాత ముఖ్యమైనది వంట చెరకు (పుల్లలు అనగా కట్టెలు, బొగ్గు) సమస్య.

ఈ రెండు సమస్యల పరిష్కారంలో గోబర్ గేస్‌ప్లాంట్ తోడ్పడగలదు. (గోబర్ అనేది హిందీ పదం. దానిని పశుమయము లేక పేడ అని అర్థం.) గత సెన్సస్ ప్రకారంగా మన వద్ద 22 లక్షల 60 వేల పశుగణం వున్నది. ఇవి నిత్యం వేసే మయం రమారమి 120కోట్ల టన్నులవుతుంది–సాలీనా.

అందులో నుంచి ఏడాదికి 40 కోట్ల టన్నుల పిడకలు జేసి పొయ్యిలోకి వినియోగిస్తారు. దీనిని ఎరువుగా తయారు జేస్తే ఒక కోటి టన్నుల పంట అదనంగా వస్తుందని అంచనా వేశారు. మన ఆహార కొరతను అది పూర్తి చేస్తుంది.

ప్రతిసంవత్సరం మనం పదికోట్ల టన్నుల వంటచెరుకు కట్టెల పొయ్యిలోకి వినియోగిస్తున్నాము. గ్రామ సీమల చుట్టూరాచెట్టు–చేమలేకుండా చేస్తున్నాము. ఇందువలన పంటకు వచ్చే భూమి తరిగి పోతుంది. అందుమూలాన ఆహారోత్పత్తి కుంటుపడుతుంది. ఒక్కొక్క ఏడాది గడచిన కొద్ది గ్రామాదులలో పచ్చగా వుండిన ప్రాంతంలో చెట్టు చేమ కనిపించకుండా పోతున్నవి. గోబర్ గేస్ ప్లాంట్ ద్వారా వంటచెరకు వినియోగం పొయ్యిలోకి చాల వరకు తగ్గించవచ్చును. అంతేగాక, పిడకలుగా కాల్చేకంటే, పేడలో నుంచి వచ్చే గేస్ పొయ్యిలోకి వినియోగమయితే వేడిమి (ఇంధనశక్తి) 20 శాతం ఎక్కువవుతుంది.

సాధారణంగా పశుమయమును కాల్చేస్తే ఎరువురాదు. దానిని పంటకు పనికి వచ్చే ఎరువుగా చేస్తే, వంటకు పనికిరాదు. కాని, ఆ మయమును (పేడను) గేస్‌ప్లాంట్ ద్వారా వినియోగిస్తే, రెండూ లభ్యం కాగలవు. మరింత అధికంగా లభ్యం కాగలవు. ఉదాహరణానికి ఒక వ్యవసాయకుని వద్ద అయిదు పశువులుంటే ఒక ఏడాదిలో ఈ క్రింది విధంగా లాభిస్తుంది. 620 క్యూబిక్‌మీటర్ల ఇంధనశక్తి పది బండ్ల ఎరువు వస్తవి. లెక్కగడితే రూ. 303.

(దానినే కేవలం ఎరువుకై వేస్తే ఏడు బండ్ల ఎరువు వస్తుంది, అనగా రూ. 105 గిడుతుంది. దానినే పిడకలుగా కాలిస్తే ఆ ఇంధన శక్తి వలన గిట్టేది రూ. 197 మాత్రమే. కాని పైన సూచించినట్లు, గ్యాస్‌ప్లాంట్ ద్వారా అయితే రూ 493 గిడుతుంది. ఇంధన శక్తి, ఎరువూ రెండు దొరుకుతవి).

పిడకలు కాలిస్తే 11 శాతం కంటె ఎక్కువ వేడిమి రాదు. చక్కగా తయారైన బర్నర్లలో గేస్ వల్ల వచ్చే వేడిమి 60 శాతం.

ఈ విధంగా పేడలో నుంచి గ్యాస్ ప్లాంటా ద్వారా 43 శాతం అదనంగా ఎరువు, 20 శాతం అదనంగా వేడిమి రాగలవు.

ఇవి గాక గ్యాస్‌ప్లాంట్‌లో పేడను వేసినందువల్ల వచ్చే లాభాలు మరికొన్ని వున్నవి. మామూలు ఎరువులో 0.75 శాతం నత్రజని వుంటే, ఈ మార్గానవచ్చిన ఎరువులో 1.5 శాతం నత్రజని వుంటుంది. ఎక్కువ బలకరంగా వుంటుంది.

హ్యూమస్ లక్షణం కూడా గాస్ ప్లాంట్ ఎరువులలో ఎక్కువ. నేల స్వభావాన్ని వృద్ధి చేస్తుంది. ఎక్కువ నీటిని పట్టి వుంచగల శక్తి వస్తుంది. నీరు ఎక్కువై నిల్చిపోదు. గాలి బాగా వస్తుంది.

గోబర్ గేస్ ఎరువు చక్కగా పొడిపొడిగా విడివిడిగా వుండి నేలలో హాయిగా కలిసిపోతుంది.

ఈగలు ఇందులో పెరగవు.

సహించరాని వాసన మామూలు ఎరువు గుంటల్లో నుంచి వస్తూవుంటుంది. గాని ఈ ఎరువులో నుంచి అట్టి దుర్గంధం ఏదీ రాదు.

పిడకలు కాలిస్తే వంటయింటిలో వచ్చే పొగ రాదు. గృహిణి కండ్లు మండవు. వంటఇంటిగోడలపై, పైభాగాన పొగ చూరి చూడటానికి అసహ్యంగా వుండే పరిస్థితి ఇకరాదు. వంట పాత్రల అడుగున కూడా పొగవల్ల ఏర్పడే మరకలుండవు. వాటిని సులభంగా శుభ్రంచేసి వుంచవచ్చును.

మల విసర్జన స్థావరాలను గాస్ ప్లాంటుకు అనుబంధముగా చేస్తే, ఎక్కువగేస్ మేలైన ఎరువు దొరుకుతవి ఆరోగ్యకరమైన పద్ధతులలో మలమును ఆవల పారేసే పద్ధతిలో గల చిక్కులు కూడా ఇందువలన వీడిపోగలవు. ఈ విధంగా వ్యవసాయకునికి గోబర్ గేస్ ప్లాంట్ ఒక వరప్రసాదమనుకోండి.

గేస్ ప్లాంట్ స్థాపనకు తయారీ

ఈ ప్లాంటును పెట్టుకో దలచుకున్న వ్యక్తికిగానీ సంస్థకు గానీ కావలసినన్ని పశువులు వుండవలెను. ఒక కొఠాంలో ఆ పశువులను కట్టివేసే ఏర్పాటువుండవలెను. విడిగా వెళ్ళి మైదానంలో మేసే పశువుల మలం చేతికందదు. ఎక్కడికక్కడే పడిపోతుంది. రాత్రిపూట అవి ఇంట్లోవేసే పేడ లభ్యమవుతుంది. అది విలువైనదే. ఐతే, అది ఎంతో తెలుసుకోవలెను. ఎందుకంటే, ఒక ప్రమాణంలో పశుమయం లభ్యం కాకుంటే ప్లాంట్ పెట్టిన ప్రయోజనం చేకూరదు. నిత్యం నూతనంగా వేసే మయం (పేడ) 45 కిలో గ్రాములుంటే, అతిచిన్నరకం ప్లాంట్ పెట్టుకోవచ్చును. అది రెండు క్యూబిక్ మీటర్లు లేక 60 క్యూబిక్ అడుగుల పరిమితిలో వుంటుంది.

సగటున, రోజుకు ఒక మధ్యరకం గోవు, బర్రె,దున్నపోతు, ఎద్దు నూత్నంగా వేసే పేడ 10 కిలోగ్రాములుంటుంది. కొంకణ ప్రాంతంలోవలె, కొన్ని కొండప్రాంతాలలో వలె పశువులు చాల చిన్నసైజువైతే, అవి వేసే పేడ చాల తక్కువగావుంటుంది. చాల పెద్దసైజు బర్రెలు రోజుకు 20 కిలోగ్రాములు వేయగలవు. కొఠాంలో క సే పశువులు ఈ మాత్రం వేయగలవు.

మల విసర్జన స్థావరాలపై ఆధారపడిన ప్లాంటులను కూడా పెట్టుకోవచ్చును. అటువంటి ప్లాంటుకు 60 మంది మల విసర్జన కనీసం అవసరం. హాస్టళ్ళు, పబ్లిక్‌ప్రదేశాలలో వుండే మల విసర్జనకేంద్రాలు — అటువంటి చోట్ల పెద్దసైజు ప్లాంటులను పెట్టవచ్చును. ఈ క్షేత్రాలలో నీటి సమస్య ముఖ్యమైనది. జాగ్రత్తగా నీటిని లోపలికి వాడవలెను. ఒకసారి మలవిసర్జన చేయగా ఒక లీటర్ నీళ్ళకంటె ఎక్కువ పోయరాదు. నీరెక్కువై పోతే, నీటిలో కలిమడియైన మలం (స్లర్) మరీ పలచనై పోతుంది. దానిలో నుంచి పులిసి, గాస్ బాగా రాదు.

పశువులలో, మనష్యులలో వుండే తేడాలను బట్టి ఖచ్చితంగా చెప్పడం కష్టంగాని, ఉరామరికగా అయిదు పశువులు లేక 60 మంది జనం వుంటే, రెండు క్యూబిక్‌మీటర్ల గేస్‌ప్లాంట్ నడుస్తుంది.

గేస్‌ప్లాంట్ నిర్మాణం

ఈ ప్లాంట్‌ను నిర్మించడానికి స్థలం కాస్త వెశిలికగా వుండవలెను. మలపుస్లర్‌కుండలు తవ్వడానికి కూడా స్థలం కాస్త విశాలంగా వుండవలెను. పశువులకొఠానికి దగ్గరగానూ, గాస్ విని యోగమయ్యే స్థలానికి సమీపంగానూ వుంటే మంచిది. పేడను చాల దూరం తీసుకపోవడం మంచిదిగాదు, అట్లే గేస్‌ను చాలా దూరం లాగుకునివెళ్ళడం మంచిదిగాదు. 20 మీటర్ల దూరం లోపుగానే వుండడం బాగా వుంటుంది.

నీళ్ళు పుష్కలంగా దొరకవలెను. మామూలుగా పేడ, నీళ్ళు సగం-సగం కల్పుతారు. తదుపరి గేస్‌ప్లాంట్‌లో వేస్తారు. అందువలన, నీళ్ళు కావలసినన్ని వుంటేగాని, ఈ ప్లాంట్‌స్థాపన సాధ్యం కాదు.

• పేడ, మలం వున్నచోటనేగాక, పశువులు మరణించిన తర్వాత వాటి చర్మం-మాంసం తీసివేసేటప్పుడు, బయటపారేసే పదార్థమంతా పోగై వున్నచోటకూడా గేస్‌ప్లాంట్ పెట్టవచ్చును. పందులు, కోళ్ళు పెంచే చోట్లకూడా పడిపోయిన పదార్థం ఎక్కువగా వుంటే గేస్‌ప్లాంటుకు అది ఉపయోగకరంగా వుంటుంది.

గేస్ డైజెస్టర్ వల్ల వచ్చే ఎరువు చాల విలువగలది. కాని గేస్‌కూడా ఇంధనంగా వినియోగంకావడం మంచిది. ఇంటికి దూరంగా, ఒక గోశాలలో, పశువులకొఠాంలో ప్లాంట్‌వుంటే, ఇంధనంగా ప్లాంట్‌గేసును వాడుకోవడం కష్టం.

ఒక బావికి 15 మీటర్ల దూరంలోగా ప్లాంట్ వేయరాదు. బావి నీటిలోనికి మలం లేక పేడ స్లర్ వెళ్ళి కలిసే అవకాశం వున్నది గనక ఈ నిషేధాన్ని గమనించవలెను.

ప్లాంట్ భాగాలు

డైజెస్టర్ ఈ ప్లాంట్‌లో ముఖ్య పాత్రధారి. నేల మట్టం నుంచి అడుగుకు దీనిని త్రవ్వి నిర్మిస్తారు. మన్ను, ఇటిక పేసి కడతారు. లోతు 12 అడుగుల(మూడున్నర మీటర్లు)నుంచి 20అడుగుల (ఆరు మీటర్లు)వరకు వుండవచ్చును. డయామీటర్ (మధ్య చుట్టుకొలత) నాలుగడుగులు (1.2మీ.) మొదలు 20 అడుగుల (ఆరు

మీటర్లు)వరకు వుండవచ్చును. ప్లాంట్‌లోనికి ఎంత సరుకు సప్లయి అవుతుందో, దానిని బట్టి నీటి సైజు వుంటుంది.

ఓరగావుండే రెండు సిమెంట్‌పైపులు దించుతారు. పేడ నీళ్ళు సమపాళ్ళుగా లేకపోతే ఒకటి నాలుగు మరొకటి అయిదు పాళ్ళుగా కల్పుతారు. లోపలి గుంటలో 50 రోజులుగా సరిపడు సరుకు వుండేంతస్థలం వుంటుంది.

గేస్ హోల్డర్

డైజెస్టర్‌లో నుంచి వచ్చే గేస్ ఈ హోల్డర్ ద్వారా సేకరించబడుతుంది. 30 మీటర్ల దూరంలో వుండే గేస్ దీపాలను దీనితో వెలిగించవచ్చును.

ప్లాంట్‌లోనుంచి వచ్చేవి

ఇంధనపుగేస్, ఎరువు—ముఖ్యంగా ప్లాంట్‌లోనుంచి వచ్చేవి.

ఇంధనం: వేడి చేయడానికీ, దీపానికీ, మరొక యంత్రాన్ని నడపడానికీ దీనిని వాడుతారు. ఇందులో 55 శాతం మెథేన్, 45 శాతం కార్బన్‌డైఆక్సయిడ్ వున్నవి. కోల్‌గాస్, బుర్‌షేన్ గేస్ వలెగాక ఈ గాస్‌లోవున్న పదార్థసంగ్రహం వేరు గనుక, దీనితో వెలిగే బర్నర్లు, దీపాలు ప్రత్యేక నమూనాలో తయారు కావలెను. దీర్ఘపరిశోధన చేసి ఖాదీగ్రామోద్యోగ కమిషన్ వారు ఆ నమూనాలను సిద్ధంచేశారు. ఇతర దీపాలు వెలిగినట్లే ఇవీ బాగా వెలుగుతవి.

ఆయిల్‌ఇంజన్లను నడపడానికి గోబర్‌గేస్ పనికివస్తుంది. గేస్ ఇందుకొరకై విస్తారంగా కావలెను. ఒక గంట ఒక హార్స్ పవర్ నడపడానికి 425 లీటర్ల గేస్ అవసరం. నీటి పంపును లేక జనరేటరును ఇంజనుకు జోడించవచ్చును. అయిదు హెచ్. పి. (5 h. p.) ఇంజన్ ఎనిమిది గంటలు నడపడానికి 18 క్యూబిక్ మీటర్ల గేస్ రోజుకు అవసరమవుతుంది. దీనికే 50 మొదలు 80 పశువులు కావలెను. ఇదిగాక వంటకూ, దీపాలకూ గేస్ కావలసివస్తే ఇంకా ఎక్కువ పశుసంపద కావలెను.

డిసెల్, పెట్రోల్, కిరసనాయిల్ ఇంటర్నల్ కంబస్‌షన్ ఇంజన్లను గాస్ ఇంజన్లుగా మార్చడానికి ఒక స్పెషల్ అటాచ్‌మెంట్ కావలెను. దానిని ఖాదీగ్రామోద్యోగ కమిషన్ సప్లయి చేస్తుంది.

ఇక ఎరువు సంగతి. అనేక విధాలుగా దీనిని చేయవచ్చును. పొలాలకు పారే నీటితో ఈ ప్లాంట్‌లో పులిసి తయారైన మంచి ఎరువును కలిపి వాడవచ్చును. ఇది అత్యుత్తమమైన పద్ధతి.

అది కానపుడు కంపోస్టు బాగా తయారు కావడానికి దీనిని వాడవచ్చును.

ఇంకొక మార్గం వున్నది. మర ఎరువులలో (కెమికల్ ఫర్టిలైజర్లు) అనగా అమ్మోనియం సల్‌ఫేట్, సూపర్‌ఫాస్‌ఫేట్ లతో కలిపి మంచి బలమిచ్చే ఎరువును తయారు చేయవచ్చును.

ఇందులో ఖాదీగ్రామోద్యోగ కమిషన్ నుంచి టెక్నికల్ మార్గదర్శనం, ఆర్థికసాయం లభ్యం కాగలవు.

టెక్నికల్ మార్గదర్శనం మూడు రకాలు: (1) దరఖాస్తులను పరిశీలించి, ఆర్థికసాయాన్ని మంజూరు చేయడం (2) గాస్ ప్లాంట్ స్థలాన్ని సర్వేచేయడం (3) గాస్‌ప్లాంట్ నిర్మాణాన్ని తనిఖీచేసి, అది తృప్తికరంగా పనిజేసేటట్లు చేయడం.

ఆర్థిక సాయం మూడు రకాలు: (1) సంస్థలకు, సహకార సంఘాలకు పెట్టుబడి ఇవ్వడం. (2) వ్యక్తులకు పెట్టుబడి సాయం. (3) బలహీన వర్గాలకు, గిరిజన—సరిహద్దు ప్రాంతాలకు పెట్టుబడి సాయం.

సంస్థలకు, సంఘాలకు మంజూరైన దరఖాస్తుల మేరకు రుణం, విరాళం ఇస్తారు—అనగా అప్పు, గ్రాంటు ఇస్తారు. అదిగాక ఈ క్రింది వాటికి అప్పు లిస్తారు: (1) ఒక మలవిసర్జన కేంద్రానికి (latrine) రూ. 300/- అప్పిస్తారు. దీనికీ, గాస్‌ప్లాంటుకు ఇచ్చే అప్పును 10 ఏండ్లలో తీర్చవచ్చును. రెండవ సంవత్సరం నుంచీ సమానమొత్తాలుగల తొమ్మిది సాలీనా వాయిదాలలో చెల్లింపు జరగవలెను.

అదనంగా లైన్‌పైప్పు వేసుకోడానికి యిచ్చే అప్పును, ఐదేండ్లలో అనగా రెండవ ఏడాది నుంచి నాలుగు సమాన మొత్తము వాయిదాలలో ల్లిచెంచ వలెను.

అదనంగా గాస్‌వుండి ఇంజన్లకు ఉపయోగిస్తే ఒక హెచ్.పి. (one h.p.) కి వెయ్యి రూపాయల వంతున అప్పిస్తారు. అయిదేండ్లలో పైని జెప్పిన అప్పు వలెనే తీర్చుకోవచ్చును.

వ్యక్తులకు సాయం

లట్రిన్‌కిచ్చే సాయం రూ. 300/-లు కల్పుకుని మొత్తం ఒక వ్యక్తికిచ్చే అప్పు రూ. 2,500/-లకు మించరాదు. గ్రాంట్ రూ. 300/-లు ఇస్తారు. సాయం పద్ధతి గమనించండి.

ప్లాంట్ సైజు	ఖరీదు	గ్రాంటు	అప్పు
60 క్యూబిక్ అడుగులు	రూ. 750-00	రూ. 300-00	రూ. 450-00
100 ,,	,, 1200-00	,, 300-00	,, 900-00
150 ,,	,, 1600-00	,, 300-00	,, 1300-00
200 ,,	,, 2100-00	,, 300-00	,, 1800-00
250 ,,	,, 2500-00	,, 300-00	,, 2200-00

ఒక వ్యక్తి స్టేట్ ఖాదీ గ్రామోద్యోగ బోర్డు వద్ద సరియైన పత్రములు దాఖలుచేసి ఈ సాయాన్ని పొందవచ్చును. లేదా, రిజిస్టర్ సంస్థ ద్వారా, లేక సహకార సంఘం ద్వారా దరఖాస్తులు పంపి సాయం పొందవచ్చు.

బలహీన వర్గాలకు సాయం

బలహీన వర్గాలకు గిరిజనులకు సరిహద్దు ప్రాంతీయులకు గాస్ ప్లాంట్ నిర్మాణానికయ్యే ఖర్చు సంస్థలకు పూర్తి గ్రాంటుగా ఇస్తారు. ఇందులో వ్యక్తులకు రూ. 450/- మాత్రమే గ్రాంటుగా యిస్తారు.

రాకమచర్ల క్షేత్రము: వేంకట దాస వరేణ్యులు

చేకూరి చెన్నకృష్ణయ్య

బిరాన రారా కరివరద కృష్ణ
బిరాన రాగదె సరోజలోచన
మొరాలకించవె నరాది పాచ్యుత ॥బి॥
ఉరమున భాసుర సరములు మెరయగ
శిరమెరయగ శ్రీకర తేజమునను ॥బి॥
స్థిరముగ రాకమచర్లస్వామి వని
ధరణిలో వెంకటదాసు బొగడగ బి॥

సర్వేశ్వరా! సర్వజగన్నియామకా। సజ్జన పరిపాలకా—రాకమచర్ల క్షేత్ర పాలా—స్వామీ యోగానంద నారసింహా! భవ బంధములనుండి నాకు విముక్తి ప్రసాదింపవా? ముక్తినొసగవా? తండ్రీ ఎన్నినాళ్లీసంసార కూపమున బడి తపి చవలయును తండ్రీ! నన్ను త్వరలో నీలో ఐక్యమొనరింపుము ఆర్త జనావనా!

నే చేయు పూజల నందుకొనుము ప్రభూ! "పాద్యం బిచ్చెద రామా! నన్ను పాలించవె గుణధామా"; "ఇదిగో అర్ఘ్యము నిత్తునయ్యా—చాల ముదమొంది గైకొనవయ్యా" మజ్జనమొనరింపవా దేవా? నే నొసగు ఆచమనమును గైకొనుము. అభివస్త్రముల నలంకరింపుము, గంధములది కొనుము. "కర్పూర గంధము బూసెదా, శ్రీకాంతా విమ్ముల నుతి జేసెదా—శ్రీశ రాకమచర్ల వాస వినుతి జేసి—నే వెంకట దాసుడనని మ్రొక్కి" కర్పూర గంధముపూయుచున్నాడను స్వామి. ఆభరణముల నలంకరింపుము అయోధ్యరామా. "ధూపమాఘ్రాపయామి—శ్రీరామనామ దీపం దర్శయామి"; భోజనము నారగింపుమయ్యా! విడము లర్పించుచున్నాడ నయ్యా! స్వీకరింపుము.

నిగమోక్త మంత్ర పుష్పము
తగ నొసగుచు నాత్మలో ప్రదక్షిణములు చా
లగ జేసి భక్తి యుక్తం
బుగను నమస్కృతులు సేయ బూనితి రామా.

రాజోపచారముల నందుకొని నన్ను కృతార్థుని చేయుము, ప్రభూ! అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం మమ.

శ్రీ రాకమచర్ల క్షేత్ర నాథున కనవరతము షోడశోపచారములాచరించుచు, నిత్య సంకీర్తనమున కాలము పుచ్చుచుండెడి ఆ భాగవతోత్తముడు శ్రీ వెంకటదాసవరేణ్యుడు. ఆ భక్తుని భౌతిక కాయము ఏనాడో పంచత్వమొందినది. కాని ఆ మహనీయుని కీర్తికాయము ఈ నాటికిని సజీవమై రాకమచర్ల దివ్య క్షేత్ర పరిసరప్రాంతముల విరాజిల్లుచున్నది.

ఉదాహృత రాకమచర్ల క్షేత్రము హైదరాబాదు మండలమున వెలసియున్నది. హైదరాబాదు నుండి తాండూరునకుపోవు రోడునకు ప్రక్కన, వికారాబాదునకు సుమారు 10 కిలోమీటరుల దూరమునను, పరిగి గ్రామమునకు 6 కి॥ మీ॥ దూరమునను ఉన్నది. పురాణ యుగము నుండియు ముచికుంద క్షేత్రముగ ప్రసిద్ధి గాంచిన ఈ క్షేత్రము, రాకమచర్ల గ్రామ సమీపముననున్న కారణమున రాకమచర్ల క్షేత్రముగ వ్యవహరింపబడుచున్నది.

ఈ క్షేత్రమున ఒక చిన్న కొండపై నృసింహాలయము నిర్మింపబడియున్నది. గుబురైన పొదలతో నిండియున్న చిట్టడవి నలుమూలల విస్తరించియున్నది. కొండ దిగువ భాగముననున్న తటాకము, పరిసరములందున్న మామిడి వనము కన్నుల పండువు చేయుచుండును. నానావిధ పక్షి సంతానముల కూజితములు వీనులకు విందొనగూర్చుచుండును. క్షేత్ర మందలి ప్రకృతి రమణీయముగను, ప్రశాంతముగనుండి భక్తి ప్రపత్తుల ఇనుమడింప జేయుచుండును.

స్థల పురాణ ప్రకారముగ ఈ క్షేత్రము త్రేతాయుగమున వెలసినది. షట్చక్రవర్తులలో నొకడగు మాంధాతనృపతి నందనుడైన ముచికుందుడు దేవేంద్రునకు సహాయముగ పెద్దకాలము రాక్షసులతో పోరాడి, వారి నోడించి, దేవతలకు విజయము సాధించెను. అందులకు నిర్జరపతి సంతసించి ముచికుందుని వరముల కోరుకొమ్మన, ఆతడు చాల అలసియున్నాడననియు, ఒకచోట నిద్రపోవలయునని తలంచుచున్నాడననియు, తా నిద్రించెడు కాలమందు ఎవ్వరైనను నిద్రాభంగ మొనరించిన, వారు తన చూడ్కులకు భస్మీభూతులు కావలయునని కోరుకొనినాడట. ఇంద్రుడు తథాస్తనినాడు. అంత ముచికుందుడు నేటి రాకమచర్ల గ్రామ సమీపమున కొండ గుహలో విశ్రమించి, నిదురపోసాగినాడు. ఎన్నియో యుగములు గడచిపోయినవి. నిద్రా ముద్రితుడై యున్న ముచికుందునకు స్పృహ రాలేదు.

కంసాది విహతుల శిక్షించి, శిష్టరక్షణ మొనరించుటకై శ్రీ మన్నారాయణుడు దేవకీనందనుడై ద్వాపర యుగమున అవతరించి యున్నాడు. తన అల్లుడగు కంసుని సంహరించిన శ్రీకృష్ణునిపై పగ సాధించుటకై జరాసంధుడును, అతని మిత్రుడగు కాలయవనుడును నొకరి వెంట నొకరు మధురపై దండెత్తి వచ్చి బలరామకృష్ణ పరి రక్షితులగు యాదవులను పలుబన్నములకు గురి చేయుచుండిరి. ఒక తటి రామకృష్ణులు జరాసంధుని పారద్రోల గల్గిరి. కాని నేలయీని నటులున్న కాలయవనుని సేనలను, ముక్కంటి వర గర్వితుడ యవనుని జయించుట దుర్భరమైనది. అట్టి యెడ, మాయోపాయ దురంధరుడగు గోపాలుడు యాదవ సైన్యమును కోటలో బలరాముని ఆధిపత్యమున నిలిపి, తానొక్కడే, నిరాయుధుడై యవనసైన్య శిబిరములలో తక్కుచు,

తారాడుచు, నేరుగా కాలయవనుని శిబిరముపైన నడిచినాడు. ఈ విచిత్ర సంఘటనను చూచుచుండిన సేనావాహినికి దిగ్భ్రమ కలిగినది. నిశ్చేష్టితమై సైన్యము నిలచి పోయినది. దూరము నుండి చోద్యమును తిలకించుచున్న కాల యవనుడు, కాలియ మర్దనుని పట్టి మర్దించ వలయుననెడి పేరాశతో బిరాన పరుగెత్తసాగాడు. కాని, కంసారి కాలయవనునకు చిక్కక, చిక్కునటుల ఒకొక్క తరి నటించుచు, ఆశలు రెకెత్తించుచూ, పరుగెత్తసాగెను.

శ్రీకృష్ణ పరమాత్మ కాలయవనుని ముచికుందుడు నిద్రించు చుండిన గుహ వరకు తీసుకొని రాగల్గినాడు. గాఢాంధకారముగ నున్న ఆ గుహలో కృష్ణ స్వామి దూరి, ముచికుందుని తలవైపున ఒక ప్రక్క నక్కి యుండెను. కాలమాసన్నమై యున్న కాలయవనుడు కృష్ణుని వెన్నంటవలయు ననెడి తమకమున గుహలో దూరి నిద్రించుచున్న ముచికుందుని జూచి, ఆతనిని మాయలమారి గోపాలునిగ భ్రమించి, కోపోద్దీపితుడై పాదతాడన మొనరించెను. పెద్ద కాలము నుండి నిద్రించుచున్న ఆ రాజర్షి కన్నులు విప్పి, తనకు నిద్రా భంగమొనర్చి, మొట్ట మొదట నిలిచియున్న కాలయవనుని రోషకషాయిత నేత్రుడై తీక్షణముగ చూచెను. ఇంకేమున్నది: జరుగవలసినది, వాసుదేవుడు తలచినది క్షణంలో జరిగిపోయినది. కాలయవనుడు నామరూపములు లేక భస్మీ భూతుడై పోయాడు. కంటి మంటలు తగ్గగా, వేడి వలన రాజర్షి కన్నుల నుండి ధారా వాహినిగా నీరు కారినది. ఆ ప్రవాహమే నదిగా రూపొంది, రాసులుగా నున్న కాల యవనుని భస్మము గుహ నుండి బయటకు కొట్టుకొని పోయినది. ఆ నదియే ముచికుంద నది నేడు మూసీ నదిగా పిలువబడుచున్నది.

జగన్నాటక సూత్రధారియగు నందనందనుడు ముచికుందునకు దర్శనమొసగి మోక్ష సామ్రాజ్యమొసగ సంకల్పించెను. కాని ముచికుందుడు క్షత్రధర్మమున మృగయావినోదంబుల మృగముల వధియించి హింసా పాత్రుడైనందున వైకుంఠ పదము ననుగ్రహింప వలనుపడదయ్యెను. కరుణార్ద్ర హృదయుడగు దేవదేవుడు ముచికుందునకు తపమొనరించి, పాపప్రక్షాళనముగావించుకొనుమనియు, మరొక జన్మమున బ్రాహ్మణుడవై జన్మించి, విగత కల్మషుడవై సాయుజ్యము చెందగలాడవనియు తెలిసి అంతర్హితుడయ్యెను.

శ్రీకృష్ణస్వామి ముచికుందునకు ప్రసాదించిన యీ వరముల ప్రసక్తి శ్రీమద్భాగవతమున గలదు. స్వామి ఆదేశానుసారముగ ముచికుందుడు తప మొనరించి, పెద్ద కాలమునకు దాసవరేణ్యుడగు వెంకటదాసుగ జన్మించి, రాకమచర్ల క్షేత్రమునుద్ధరించి, భక్తులకు దారి జూపి, సిద్ధిపొందినాడని భక్తుల దృఢవిశ్వాసము.

భక్త రామదాసుగారివలె వెంకటదాసుగారి వంశీయులు కుతుబ్‌శాహీల కాలమున మంత్రి వరేణ్యులుగ ఖ్యాతిగన్న అక్కన్న మాదన్నలకు దగ్గరి బంధువులు. గోలుకొండ వ్యాపారస్థులు: శ్రీరామానుజ కూటమునకు జెందిన వైష్ణవ సాంప్రదాయులు. దాసుగారి వంశీయులు భరద్వాజగోత్రులు: ఆపస్తంభ సూత్రులు. వీరి జన్మస్థలము నల్లగొండ మండలమందు దేవర కొండ సీమయందలి పెద్దాపురం అనెడి చిన్నపల్లె. వీరి తండ్రి పేరు మల్లయ్య: తల్లి అనంతమాంబ వంశపారంగతమగు కర్ణీకము (పట్వారిగిరి) వీరి వృత్తి. వెంకటదాసుగారి జ్యేష్ఠ సోదరుడు రామయ్య: ఆతని సహోదరి రామమ్మ. చిన్ననాడు వెంకయ్యగా వ్యవహరింపబడు దాసుగారు క్రీ. శ. 1808 సం॥ మున జన్మించినారు.

రామయ్య, వెంకయ్య, రామమ్మ, నవ వయస్కులుగ నుండు కాలముననే వీరి తండ్రి మల్లయ్యగారు పరమపదించిరి. కరిణీకమునకు కావలసిన గడుసు దనము, లోకజ్ఞత రామయ్య యందుగాని, ఆదినుండియు వైరాగ్యసంపన్నుడగు వెంకయ్య యందుగాని మచ్చుకైనా కన్పించలేదు. ఈ సమయముకై నిరీక్షించుచున్న బంధువర్గము రాబందులవలె అమాయకులగు వీరిపై బడి కబంధులవలె కర్ణీకమును హస్తగతము చేసికొనిరి. అంతట చేయునదిలేక అనంతమ్మ తన బిడలతో స్వగ్రామము విడచి, తనకు దూరపు బంధువులున్న రాయప్రోలు అనే గ్రామము చేరుకొనినది. ముచికుంద క్షేత్రమునకు సమీపముననే ఈ పల్లె ఉన్నది.

సంసారభారము వెంకయ్యగారిపై బడినది. పిల్లలకు పాఠములు చెప్పుచు, సంగీత ప్రియులకు కోలాటము నేర్పుచు వెంకయ్యగారు కొంత సంపాదన మొనరించుచు, కుటుంబపోషణ గావించుచుండిరి. ఆతని సోదరియగు రామమ్మకు వివాహము జరిగినది. కాని బావగారు యిల్లరికపు బావగారై సంసారభారమునకు చేయి కలిపిన వాడయ్యెను. వెంకయ్యగారు స్వయముగా కీర్తనలు వ్రాసి, మృదు మధురముగ పాడుచు కోలాటమును నేర్పెడివారట. అందువలన రాకమచెర్ల క్షేత్ర సమీపమున ఉన్న ఉమ్మెంతాల గ్రామవాసులు వెంకయ్యగారిని కోలాటము నేర్పుటకై తమ గ్రామమునకు ఆహ్వానించిరి. కుటుంబముతోబాటు తరలి వెంకయ్యగారు ఉమ్మెంతాల గ్రామముచేరి స్థిర నివాస మేర్పఱచుకొనిరి.

రాకమచర్ల క్షేత్ర సమీపమునకు వచ్చిన నాటినుండి, వెంకయ్యగారు అనుదినము క్షేత్రమునకు బోవుచు, క్షేత్ర నాథుని పూజాకైంకర్యముల ప్రొద్దులు పుచ్చసాగినాడు, ధ్యాన నిమగ్నుడై దినముల తరబడి అచటనే నిలిచెడివాడు. గ్రామస్థుల దాసార్యుల భక్తి వైరాగ్యముల గుర్తించి, గౌరవించుచుండెడివారు. వారి సంసారము గడచుటకు సానుభూతితో సాయ మొనరించుచుండిరి. వెంకయ్యగారి తీవ్ర వైరాగ్యమును, భక్తి ప్రపత్తుల గుర్తించి, సంతసించి, మరికంటి లింగమ్మయనెడి భక్తురాలు అతనికి తత్త్వోపదేశముచేసి, తర్వాత బ్రాహ్మణులు, వీర శైవమత పీఠాధిపతులునగు వీరారాధ్యుల దగ్గర మంత్రోపదేశము నొంది దీక్ష వహించుమని వెంకయ్యను ఆదేశించినది.

యోగిని, లింగమ్మ ఆదేశానుసారముగ వెంకయ్య దీక్ష వహించుటకై పండరీ క్షేత్ర సమీపమున నున్న నీలంగిరి శైవ పీఠమునకు ప్రయాణము సాగించినాడు. వెంకయ్య కొక శంక చీకాకు పరచ జొచ్చినది. తాను వీరవైష్ణవ కులసంజాతుడు. ఉపదేశ మొసగబోయెడిగురువర్యులు వీరశైవులు. పొత్తుకుదురుట యెటులనా అని సందేహము. ఏది ఎటులున్నను దేవునిపై భారమిడి నీలంగిరి చేరుకొనినాడు.

శైవపీఠాధిపతులగు వీరారాధ్యులు సద్గురువులు. పరమ కారుణ్యమూర్తులు, శిష్యపరమాణువు హృదయ వేదన గుర్తించి, శ్రీరామ తారక షడక్షర మంత్రోపదేశ మొనర్చిరి. శిష్యుడు సంగీత ప్రియుడని గ్రహించి తంబుర నొసగి జగదీశ్వర కృపా లబ్ధ సహజపాండిత్య వర కవిత్వ మహాత్మ్య శోభితుండ వయ్యెదవు గాక యని దీవించిరి. వెంకటదాసు తంబూరమీటుచు భక్త్యావేశమున పెల్లుబికి వచ్చెడి ఆశు కవిత్వ ధారతో గురుప్రశంస జేయుచు సుప్రసిద్ధమైన "గురుమహరాజా గురుమహరాజా పర బ్రహ్మ సద్గురు మహరాజా–ధారుణి వెంకటదాస హృదయ సంచార వీర సద్గురు మహారాజ" అనెడి పాటను అల్లి కీర్తించినాడు.

మంత్రోపదేశము నొందిన నాటి నుండియు దాసార్యులలో ఎంతయో మార్పు గల్గినది. సంసారము పైరోసి, నిరంతరధ్యాన నిమగ్నులై రాకమ చర్లక్షేత్రమున కాలము పుచ్చెడివాడు. ఉమ్మెంతాల గ్రామమున భజనకూటమి నేర్పాటుచేసి అనవరతము శ్రీ మన్నారాయణ నామకీర్తనమున మునిగియుండెడివాడు. భజన ప్రారంభించుచునే తన ఎదుట భగవద్గీత గ్రంథము నిడుకొని, గురు స్తవమొనరించి, మానసబోధ గావించి, నిశ్చలచిత్తుడై ధారా వాహినిగా వచ్చెడు ఆశుకవిత్వమున కీర్తనలు అల్లి పాడుచుండెడి వాడట. అక్కడచేరిన భక్తులు, కీర్తనపై ఆసక్తి గలవారు దాసు గారు పాడుచుండగా వ్రాసుకొనెడి వారట. అట్లు సేకరించిన కీర్తనలు వేలకు మించియున్నవి. కాని నేడు సుమారు 500 కీర్తనలు బహుళ ప్రచారమున నున్నవి. ఉమ్మెంతల, పరిగి, వికారాబాదు, తాండూరు మహ్మదాబాదు సీమలలో నేటికిని ప్రచారమున నున్నవి.

దాసుగారు సహజ పండితుడు. చిన్ననాటి నుండియు దారిద్ర్యమున సతమత మగుచున్నందున గురువునాశ్రయించి సంగీత సాహిత్యముల కృషి చేయజాలక పోయినాడు, కాని భగవదనుగ్రహమున చక్కని భావముల చిక్కని కవితలో పొదిగి లోకమునకందీయ గల్గినాడు. సందర్భ శుద్ధి, శబ్ద సౌష్ఠవము, అర్థ గాంభీర్యమును పోషించుచు, శబ్దార్థాలంకార శోభితముగ, భక్తిరస ప్రధానముగ ఎన్నియో కీర్తనల ప్రకటించి యున్నాడు. తియ్యతేనిలొలుకు తెలుగు నుడికారమునను, లలితపద భూయిష్టమగు సంస్కృతమునను కీర్తనలు రచించినాడు. ఎన్నియో కీర్తనలయందు తత్త్వ రహస్యములను పొందుపరిచినాడు. ముఖ్యముగ మానస బోధల తెలుగు పాటలయందు దాసుగారు పొందుపరిచిన వేదాంత రహస్యములు పామరులునూ గ్రహింపజాలునటుల సరళభావ సుందములై యొప్పుచున్నవి. ఉదాహరణకు :

చెలియా జీవునిలోని దేవుడేదే–అక్కరో
వెలయా ముక్కాటాన వున్న దే–ఓ చెల్లెలా
భావమాత్మ గన్న యట్టి ప్రౌఢ యెవ్వరే–అక్కరో
అవలీల సంచరించెడి అంతరాత్మే–చెల్లెలా
అంతరాత్మ కావలైనా ఆతదెవ్వరె–అక్కరో
సంతతా బ్రహ్మానంద సాక్షిభూతుడె చెల్లెలా

వీరి సంగీతజ్ఞాన మపారము. "ఒరయా కల్యాణి, నీలాంబరీ, భైరవి, సావేరి, మరిమోహన, నాటా, పూరీ మాళవి, జంఝూటి, ధన్యాసి, వరాళి, సురటా–అరయగ సరిగమ పధనిని–సధపమగరి స్వరముల యింపారయ బాడుచు రాజోపచారము లొనరించుదాము." అని పాడుచూ తనకు ప్రియములైన రాగముల తెలిపినాడు. ఈ రాగములలో ఎన్నియో కీర్తనలు అల్లినాడు.

దైవదర్శన భాగ్యము త్వరలో గలుగ నందున భద్రాచల రామదాసువలెనె వెంకటదాసు విసిగి, వేసారి, రాకమచర్ల క్షేత్ర నాథుని అధిక్షేపించుచూ ఎన్నియో కీర్తనల హృదయవేదన తెల్ల మగునటుల పాడియున్నాడు :

"ఎంత వేడినను దయరాదా నీకు, ఏమొ రామయ్యా యింతపరాకా" అనియు,

"ఆలసించనేలా, నే బిలచితే, ఆలసించనేలా" అనుచూ తనను దయజూడక ఆలసించుచున్నాడని వెతలు వెళ్లబోసికొనుచూ,

"ముచ్చటాడరా నీదు ముల్లేమి పోదు" అని సంభాషింప మని వేదనబడుచూ,

"పలుకరించుతె మాట బంగారమవునురా
నిలిచితే గనుగొందు నీకు నీయాన"

అని ఆనపెట్టుచూ రామభద్రుడు కనికరించ లేదనియు, సీతమ్మయే తనను బ్రోవగల తల్లి యని భావించి ఆయమను ప్రార్థించినాడు.

"నీవైన దయజూపవమ్మా–లోకపావనీ–ననుబ్రోవవమ్మా
రాముని పట్టంపురాణీ–వరరాజిత ఘననీలవేణి ధరణిలో
వెంకటదాసు నేలవమ్మా"

జీవిత సాయం సమయమున యోగనిష్ఠా గరిష్ఠుడై బాహ్య సంపర్కము వీడి, కాలము గడుపుతూవచ్చి తన ఏబదవ సంవత్సరమున అనగా క్రీ॥ శ॥ 1859 వ సంవత్సరమున తన ఆరాధ్య దైవమగు రాకమచర్ల యోగానంద నృసింహస్వామిమూర్తి యందు ఐక్యమొందినాడు.

వీరి మహాత్మ్యమును తెలుపు ఎన్నియో గాథలు ప్రచారములో యున్నవి. ఇవన్నియు భక్తులకు వెంకటదాస వరేణ్యులపై గల భక్తి విశ్వాసముల నిరూపించుచున్నవి. వీరి సమాధిపై ఉమ్మెంతల గ్రామములో నొక ఆలయము నిర్మింపబడియున్నది. వీరిపేరట పీఠమేర్పరుప బడినది. వీరి తర్వాత వీరి మేనల్లుడగు తిరుమలయ్య పీఠాధిపతులైరి. ఏకనాథ స్వామిగారు పీఠాధిపతులలో ప్రసిద్ధి గాంచినారు. నేటికిని సమాధికి నిత్యము పూజలు జరుపబడుచున్నవి. దీపారాధనలు, భజనలు భక్తులు జరుపుచున్నారు. వెంకటదాసు గారికి నీలంగిరి పీఠాధిపతులు బహూకరించిన తంబుర పూజలనందు కొనుచున్నది. వెంకటదాసుగారి కీర్తనలు భజనకూటము లందును, కోలాటము లందును శ్రద్ధాభక్తులతో, ఉత్సుకతతో పాడుచుందురు.

హైదరాబాదు రేడియోస్టేషన్ వారు వెంకటదాసుగారి కీర్తనలు కొన్ని భక్తిరంజని కార్యక్రమమున వినిపించుచున్నారు. "గురుమహరాజ;" "పూలవసంతము లాడుదామా," "నమామి వెంకటరమణా" అనెడి కొన్నిపాటలు హృదయరంజనముగ ప్రసారితములై యున్నవి. దాసుగారి కీర్తనల ఇంకను సేకరింపవలసి యున్నది. సేకరించిన కీర్తనలను, వారి సమగ్రజీవిత చరిత్రను ప్రచురించవలసిన బాధ్యత తెలుగుజాతిపై నిలిచియున్నది. *

వందేమాతరం

ముదిగొండ వీరభద్రమూర్తి

మొదలు కొక్కెమంత పదపడి సంకెల
యంత యగుచు గార యంత యెదిగి
మబ్బు క్రమ్మ గగనమండలీ లక్ష్మికి
జలము వచ్చె గంటి కొలకు లందు

ఎంత రాజేసిన నించుకంతయ మండి
పొయి నిప్పు చల్లారి పోవుచుండె
మీగడ వలె నుండి రేగడి మోకాలి
లోతున నిడిన కాలు దిగుచుండె
నీ వేళ నీ రాజ్య మెవరిది కాదు మా
ద న్నట్లు కీచురాళ్ల అచుచుండె
నెటు పోదమన్నను నేఋలడ్డము వచ్చి
జనుల ప్రయాణమ్ము సాగకుండె

పండు వగుచుండె గొక్కెరతండమునకు
చినుకులయి తుంపర లయి చిమ్మనపుగ్రోవి
చిమ్మిన ట్లయి మోటకొండమ్ము ధార
క్రుమ్మరించిన వడి జడి ముమ్మరింప.

అట్టి జడి బొటుకుపెట్టిన
మట్టింటం గూరుచుండి మలగెడు దివియన్
ముట్టించ పత్ర మైదుగు
రెట్టులొ వ్రాసి ముగియింప నెంచిరి కడకన్.

కలము తెచ్చె నిస్మాయిలు ఖాను కాగి
తమ్ము తెచ్చె నీశ్వర భట్టు తక్కువయ్యె
బుడ్డిలోన మషీరసంబు కొనివచ్చె
రవ్వయంత 'వెంకోపంతు' వ్రాతకాడు

అద్దము దువ్వెనల్ కలవునొదల దువ్వుకొనంగ నూనెకే
యెద్దడి వచ్చె నన్నటుల నింధనరాశియు బాత్రరాశియున్
గద్దు గృహాన బియ్యము వినా యనినట్టుల నున్న దండి యీ
ప్రొద్దు ముగింతు బత్రమును ముక్కలు మూడుగ నంచు
బంపనెన్

రూకలు నెలకు పది తలకు
నాకలి దీర్చి యిడునట్లు నా బాబాఖాన్
చేకురుచునట్లు సాయము
లేకరి పత్రములు రెండు లిఖియించి యిడెన్

సాక్షు లీశ్వరభట్టును జానుమియ్య
యంతయు నిది యల్లాదయ యనియె ఖాను
సుదిన మనియె బాబాపంతు చెదరిపోదు
ఫలము నా వ్రాత పడిన యే స్థలమున ననె

బావవరుస జేసి పలికె నీశ్వరభట్టు
పంతుగూర్చి వాని మంతుగూర్చి
బ్రహ్మలిఖిత మనుచు బాటింపబడుదాని
పంతులిఖిత మెదిరి పంతగించు

చింతగింజ వేసిన దేలు చిక్కనైన
చాయ గమగమలాడు మేల్‌జరదతోడి
తమ్ములమును సేవించి కర్తవ్యనిర్ణ
యమ్ము సేసి రాలోచించి యంద అపుడు.

'జాతాహూ మై గుడ్నూర్
లాతాహూ ఫౌజు రోహిలాడక్కనియోం
కా తయ్యార్ రహనా' యని
చేతిన్ గదలించి ఖాన్ వచించెను బాబన్.

నేను పూనాకు బోవుచున్నా నమాస
నాటి సూర్యాస్తమయవేళ కందుకొందు
నిచటి కని ఖానుతోడ గథించి భట్టు
నః గని బాబా చెయిన్ జేబునుండి తీసి

ఈ బంగారపు హార ముంచుకొనవే యీ రవ్వలుంగ్రాలునుం
బాబూ! ఈశ్వరభట్టు! వచ్చుదనుకన్ మా మధ్యవర్తీ!
యనెన్

బాబా! నీకయి ఖానుకై వెదకుచున్నా రిందు బోలీసుసా
హేబుల్ జాగ్రియ నెట్లు వచ్చెదవో సుమ్మీ! యంచు
భట్టూరిచెన్

వెంకోపం తనె గాల్బలమ్ము రవుతుల్ వేసాముసంకెన్
ధను
ష్టంకారమ్మును బోలు నెల్గు గలరై శస్త్రమ్ములన్
మోసి యీ
వంకన్ వత్తురు నిన్నుగొల్చుటకు బాబా! రెండు
మూణ్ణాళ్లలో
టంకమ్ముల్ బలె దారువున్ బగతు కండల్ చీల్తు రీ
వున్నచో

ఖనిజము భూమియందు బలె గాలమునందున దాగి దైవ మే
యొనరున నున్నదో తెలియకున్నది కర్జము నీవు పోక తీ
రని యటు లుండె గాని బవర మ్మిపు డున్నది మూడు మూడు నా
ఆనినటు గెల్పు నున్నది సుమా! మన పట్టున విక్రమక్రమీ.

ఇటు మాటాడెను ఫాడ్కె కోరితిని మున్నిందూరు హోల్కారు ను
ధృతసైన్యమ్మిడి నన్ను బాపగదవే! పాలార్తు నాంగ్లేయులం
పటతన్ భారత భూమినుండి యని యొప్పన్ లేద ద్రవ్యమ్మునున్
ఘటియింపండ యతండు తాదృశము కల్గం బెక్కు లేలా యిటుల్.

యాచకుండ నైతి నానాటిసుత బిజా
పూరు నాదు మామగారి యూరు
చిక్క వచ్చు నందు శ్రీ భారతజ్యోతి
తెల మిషకోటి శీలనమున.

'నావుడు భట్టు పలికె నీ
తో వత్తురు బ్రాహ్మణులు పదుగు రని, బాబా
నే వేడ నున్న సాయము
నీవే యొసగితి వని పయనింప దొడంగెన్

బాబా! బాబా! బాబా!
బాబా! యని యొక్కమారు ధ్వనియించెను ఫా
డ్కే బయలువెడల సంగము
లో బాడబగృహము లెల్ల లుప్తకళము లై

అంధకారమయమ్ము పూర్వార్ధ మగుచు
నుత్తరార్ధ ముజ్వల మౌచు నొప్పు రాత్రి
భారతచరిత్రమును గంటివద్ద పెట్టి
బయన మై పోవుచున్న బాబాకు నాడు

తంత్రిం బొంబయిరాజ్యపాలకుడు హైద్రాబాద నాంగ్లేయరా
ష్ట్రంత్రమ్ము న్నడుపించు పెద్ద కనిపెన్ ఫాడ్కేను బంధింప, బెన్
మంతున్ వించె నతండు మంత్రియు ఘర్మాయించె దద్బంధనో
దంతంబున్ వివరించి రక్షకభటాధ్యక్షున్ దరహాసమున్

ప్రకటించిన బహుమతిలో
నొక వేయిన్ మున్నె పంపె హూణుడు తద్ర
క్షక శాఖాపతికి స్వర
క్షక శాఖన్ ఘనపదవి నెసగు 'డేన్యలు' తో

తతి గొని చీమలు కొలుచున్
వితముగ భాగ్యపురమునకు వేగులు వార్తల్
వెతకివెతకి కొని తెచ్చిరి
ప్రతి సంవసథమున కొకడు పరికల్పితు డై

ఆ భటాధ్యక్షు 'డబ్బులు హక్కు' పంచ
శత భటులతోడ డేనియల్సహితు డగుచు
గోర మీసము మెల్చి గుడ్నూరు పోయి
ఖానునున్ మరికొందఱ ఖైదుసేసె

కడిమిన్ సంగములోన గొందఱను గాంధ్నాపూరులో గొందఱున్
బడవాల్ మీ రని తిట్టి భట్టుముఖవిప్రశ్రేణి బేడీలతో
మిడుకన్ జేయుచు 'హక్కు' బోరన జనెన్ బీజాపురీదృష్టి యై
నడుమన్ గన్నురిలోని బ్రాహ్మణులకున్ గారాగృహప్రాప్తి గా

దేవనగిరిలో ఫాడ్కే
దేవాలయ మంటపప్రదేశమ్మున ని
ద్రావశు డై యుండెను భూ
దేవదశక మల్లె యుండె దీర్ఘశ్రమ మై.

గుండెపై బర్వు పడ్డటు లుండి నిదుర
కనుల ఫాడ్కే యెహే యని గట్టిగ నొక
విసరు విసరి వీక్షించె నుస్సురుసు రనుచు
నంత దూరాన బడిన డేన్య లను వాని.

పందా నిద్దురలో నను
బందా సేయుటలు నీచపని రండిర మీ
రందరు నా కైదువు నా
కున్ దక్కె న టంచు ఫాడ్కె గోంద్రించెవడిన్

అట్టి ఫాడ్కే నిరాయుధు డైన నతని
దరియ జాలడ డేన్యలుపరిజనమ్ము
తనకు దా దద్వశుం డయ్యె దప్ప కునికి
నతడు 'గుల్బర్గ' జైలులో నడుమబడియె

ఆ పదిమంది బ్రాహ్మణులు నంతకు మున్నుగ బట్టుబడ్డ యా
బాపల గొంతమందియును ఫాడ్కెయు ఖానుఖాను నాయకుం
డౌ పరికొంత కూరుకొని రందఱు పెన్జడి నానినానియా
ష్మ్రపయి గూలెనో నరకఖండ మనన్ దగినట్టి జైలునన్

తీసినట్లె వెలికి దీసి మరల నందె
వేసె బోగ నున్న శేషజనము
నేడునేండ్లు ఖాను నితరుల దగ్గించి
యద్దియుగము గడవ నచటి కోర్టు

పూనానగరన్యాయ
స్థానమునకు హూణరాజ్యసంహారక వా
ర్తానిచిత పత్రములతో
నానీతుండయ్యె ఫాడ్కె యభియోగమునన్.

దేశముకోస మై మన నెదిర్చెను ఫాడ్కె య టంచు వాని గా
రాశయవాసు జేయగ మహాశయులార జనమ్ము రెచ్చి పో
దో శతసంఖ్యసిద్ధపడదో యత డట్లిపు డెట్లు సేత ధీ
కౌశల మొప్ప జెప్పు డనగా హితు లాడిరి రాష్ట్రపాలుతో.

బందిపోటుదొంగనుగ ఫాడ్కెన్ దెలియ బ
లత మనె నొకం డురి దగుల్పరాద యండ
మానునిండ దొల్తటిపోరిమగలు గలర,
దాన వాని నేడెనుకు బంత మనె నొకడు

ఒక డనె నింతయున్ సరియ యొప్ప దెవండును బంది
పోటుదొం
గకు గల లక్షణమ్ములను గల్పనచేసిన నేమి వానియం
దిక మన మిట్టివాడుగ మరెవ్వడు గానటు చూచుకోవలెన్
సకులుగ జేసికొంచు జననాయకులన్ దగు సంస్థ కాదియై.

చిటికె వైచి భళీ! యని యిటుల నుండ
వలయు డెలివని చెయి గుండెపైని వైచి
కొని మనము నిదురింపవచ్చు నిట నిటుల
జేసి యన తక్క వారు భూషించి రలని.

మేజస్ట్రేట్ కోర్టున దొలి
గా జరిగి సెషన్సు నొందగా ఫాడ్కే కే
సా జడ్జి 'బాపురే! యను
కో జన మది ముగియునంతకున్ జనుదెంచెన్.

అచట జోషిని నియమించినట్టి రాన
డే మహాశయుఁ డిందు ఫాడ్కే సమర్థ
నమునకై మహాదేవచిమ్నాజియాప్టె
ను నియమించెను న్యాయవాదినిగ నాడు.

ఇరువురు వచ్చి రందొకరు డిప్పుడు రానడెపైని గన్నువే
సిరి పరిపాల బృంద మని చెప్ప ద్వితీయుఁ డి దిప్పు డేబదివ
త్సర ప్రథమమ్మునుండి తన దేకొలు వూడ్చు రికార్డు పోవగా
మ రొకడు రానడే ప్రభుత మందిర కాల్చిననాటియుండి
యున్'

శ్రుత మిదిభాయి! నీకు పొగ చూరిన యిర్వదియేండ్ల
భారత
స్థితి కొక వెల్ల వేసి మతిచే వెతికించెను దాంతియాను స్వ
గ్రతు నిత డిట్టి ఫాడ్కె కవకాశభరమ్ము సహాయుఁ డౌటచే
బ్రతిరసనాలసద్యశమువాడుగ తా నయినాడు రానడే

చదువు కొన్న పట్నవాసిజనము తక్క
జానపదజన మెరుగ దీ రానడేను
నే డెఱింగె ననన్ జతగా డయిన క
పర్ది' 'బాలగంగాధరా' వల్లె యనియె.
ప్రేక్షక స్థానమున తొలి బెంచిమీద
కూరుమన్న వారలలోన వీరు నుండి
రదియ కేసు విచారణ మాత్యదినము
సాక్ష్యము వకీళ్లవాదము జరిగె ఘనము.

దేశద్రోహం!

నన్ను ఐదోసారి అరెస్టుచేసి బ్రిటిష్ ప్రభుత్వాధికారులు నామీద అనేక నేరారోపణలు చేశారు. ఈ ఐదోసారికూడా నాకు శిక్ష విధిస్తారనడంలో ఏమాత్రం సందేహంలేదు. ఇంతవరకు యీ విచారణలో నేను పాల్గొనలేదు ఇకముందు పాల్గొనే వుద్దేశంకూడాలేదు. కాని నా హృదయంలో వుండే అభిప్రాయాలేమిటో, యీనాడు నన్ను విచారిస్తున్నవారికీ, ఆధికారికంగా నన్నాదరించి గౌరవించిన నా ప్రజలకూ, సూచనగానైనా తెలిసేందుకై నాలుగు మాటలు చెప్పదలచాను

నామీద దేశద్రోహ నేరమూ, బ్రిటిష్ ప్రభుత్వంపట్ల ప్రజల్లో అవిధేయతను ప్రచారం చేయడం అనే నేరమూ ఆరోపించారు. సరిగ్గా $8\frac{1}{2}$ సంవత్సరాలక్రితం కూడా యివే నేరాలు ఆరోపించారు. భారత దేశంలో ప్రస్తుతంవున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశద్రోహ నేరంచేయడం, ఆ ప్రభుత్వం ప్రాతినిధ్యంవహిస్తున్న చెడు విధానాలపట్ల ప్రజల్లో అసంతృప్తినీ, అవిధేయతనూ ప్రచారంచేసి ఆచరించడం అనేవి భారతజాతి ప్రజల పరమ ధర్మమైనదనీ, అదేవారి వృత్తి ధర్మంగా రూపొందిందనీ అప్పట్లో నేను ప్రకటించాను. ఎందుకంటే భారత దేశం నుండి బ్రిటిష్ పాలనకు స్వస్తి జరగనిదే తమకు విముక్తి లేదనీ, కోట్లాది ప్రజలు జీవితాలను పీల్చి పిప్పిచేసిన పీడన కార్యక్రమానికి అప్పటిదాకా అంతంలేదనీ భారతీయులు గుర్తించారు. ఈ జ్ఞానోదయం, దీనిలోగల తీవ్రమైన సాధక బాధకాలతోసహా, నాకు ఏనాడో కలిగింది కాబట్టి—బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఎదిరించి పోరాడడంకంటే, దానిని భారత దేశం నుండి వెడల గొట్టడంకంటే మరొక వృత్తి, కర్తవ్యం, వ్యాపకం, లక్ష్యం నాకు లేదు.

[1930 అక్టోబరు 24 న జరిగిన కేసు విచారణ సందర్భంగా శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ]

అరణ్యపర్వము

మహాభారతము

తెన్నెగంటుల లక్ష్మణశాస్త్రి

66

కౌరవ గంధర్వుల యుద్ధము

ఆ మాటలు విని దుర్యోధనుడు సైనికులతో "అరే! దేవసేనతో ఇంద్రుడు ఇక్కడికి వచ్చినప్పటికిని లెక్కచేయకుడు. కనుక మీరు వెంటనే పోయి వారిని దండించుడు" అని చెప్పెను. దుర్యోధనుని మాటలు విని యితర కౌరవులందరు ఒక్కుమ్మడిగా యుద్ధ సన్నద్ధులై గంధర్వులను అణచుచు ద్వైతవనమునందు దూరిరి. దిక్కులు పిక్కటిల్లునట్లు సింహనాదము చేయదొడగిరి. అపుడు ఇతర గంధర్వులు శాంతముగానే కౌరవులను వారించిరి. గంధర్వులను అవమానము—పరిహాసము చేయుచు కౌరవులు వనములో ప్రవేశించిరి. అప్పుడు గంధర్వులు చేయునదిలేక తమ రాజగు చిత్రసేనునకు ఈ సంగతి తెలిపిరి. అది విని చిత్రసేనుడు మిక్కిలి కోపముతో 'ఈ దుష్టులనందరిని అణచివేయుడు' అని గంధర్వులకు ఆజ్ఞ యిచ్చెను. వెంటనే వారు వివిధాయుధములను ధరించి కౌరవులపైకి ఉరుకగానే కురు సైనికులందరు దుర్యోధనుడు చూచుచుండగానే దిక్కులకు పారిపోయిరి. అది చూచి కర్ణుడు ధైర్యముతో గంధర్వుల నెదుర్కొని అనేకాయుధములతో వారిని కొట్టి గాయపరచెను. కొందరి శిరస్సులు నేలగూల్చెను. ఒక్క క్షణములో గంధర్వ సేనను కర్ణుడు ఛిన్నాభిన్నము చేసెను. అది చూచి వారికి బాసటగా అనేక శతసహస్ర గంధర్వ సైనికులు నేలయీనినట్లు వచ్చి కర్ణుని చుట్టుముట్టిరి. అప్పుడు దుర్యోధన దుశ్శాసన శకుని ప్రభృతులైన కురు వీరులు భయంకర సింహనాదములు సేయుచు గంధర్వ సేనలను సంహరించుచు వచ్చిరి. కర్ణుని ముందు బెట్టుకొని వారు అనేకులు యుద్ధము చేయజొచ్చిరి. రెండు సైన్యములకు జరిగిన సంకుల యుద్ధములో కౌరవుల దెబ్బకు గంధర్వులు నలిగి ఆక్రోశించిరి. కౌరవులు సింహనాదము చేసిరి. అప్పుడు చిత్రసేనుడు క్రుద్ధుడై ముందుకువచ్చి మాయాస్త్రమును కౌరవులపై ప్రయోగించెను. దానిచే వారు మోహము చెందిరి. ఒక్కొక్క సైనికుని పదుగురు చొప్పున గంధర్వులు చుట్టి బాధింపజొచ్చిరి. ఇట్లు బాధితులై కౌరవులు పారిపోయిరి. అప్పటికిని కర్ణుడు స్థిరముగా పర్వతమువలె నిలిచెను. దుర్యోధనాదులు పోరు సాగించిరి. గంధర్వులు కర్ణుని చంపదలచి ముందుకు సాగిరి. కొందరు కర్ణుని రథముయొక్క గుఱ్ఱములను—ధ్వజమును—నగలను నాశముచేసి కర్ణుని రథమును పాడు చేసిరి. అప్పుడు కర్ణుడు ఖడ్గధారియై వికర్ణుని రథముపైకి లంఘించి గుఱ్ఱములను త్వరగా తోలుచు పారిపోయెను.

ఇంత జరిగిన దుర్యోధనుడు వెన్నుచూపక ధైర్యముతో అచటనే నిలబడి గంధర్వులపై బాణప్రయోగముచేసెను. అది చూచి గంధర్వ సైనికులు దుర్యోధనుని రథము ధ్వంసముచేసి వానిని బంధించిరి. ఈలాగే దుశ్శాసనాదులను—వారి స్త్రీలనుగూడ సైనికులు బంధించి తీసికొనిపోయిరి. పారిపోయిన సైనికులు ఈ సంగతి, ఆ సమీపములోనే ఉన్న పాండవులకు తెలిపిరి. అప్పుడు వారి దుర్గతినిచూచి భీమసేనుడు ఆ సైనికులతో నిట్లనెను:— "మేము సైన్యములతో కౌరవులను చుట్టుముట్టి చేయవలసిన పనిని గంధర్వులే చేసినారు. కౌరవులు ఒకటి చేయదలచగా దానికి వ్యతిరేకముగా పరిణమించినది. కపటద్యూతముచేయు దుర్యోధనుని యా కుట్ర సాగలేదు. గంధర్వులు మంచి పనియే చేసినారు. మా అదృష్టమువల్ల ఎవడో ఒకడు మా శత్రువులపై పౌరుషము చూపి మా పని సుళువుపరచినాడు. రాజ్యాధికారములోనున్న దుష్ట దుర్యోధనుకుడు శీత—వాత—ఆతపములలో అడవులందు బాధపడుచున్న మమ్ము చూచి హేళన చేయదలచినాడు. అతనికిని, అతనిని అనుసరించిన దుష్టులకును మంచి పరాభవము జరిగినది. దుర్యోధనునికి ఈ సలహా యిచ్చిన వారెవరోకాని వారు చాల పాపము చేసినారు. కుంతీపుత్రులెప్పుడు గూడ క్రూరముగా వ్యవహరించరు."

ఈ విధముగా వికృత ధ్వనితో పరుషములు మాట్లాడుచున్న భీమసేనుని జూచి యుధిష్ఠిరుడు ఇట్లనెను:— "సోదరా! ఇప్పుడు పరుషములు మాట్లాడు సమయముకాదు. వీరు భయముతో మనను శరణుజొచ్చినారు. ఇప్పుడు కౌరవులు సంకటావస్థలోపడి ఉన్నారు. ఇది చేదుమాటలకు సమయముకాదు. జ్ఞాతులకు భేదభావములు—కలహములు—వైరములు వచ్చుచుండును. కాని కులధర్మము నశించదు. వారందరు మనకు ఆత్మీయులు. పైవారు వచ్చి మన కులముపైన ఆక్రమణము చేసినప్పుడు, వంశములో శ్రేష్ఠ పురుషుడు చూచుచు ఊరకుండి వంశమునకు వచ్చిన ఆపదను ఓర్చుకొని ఉండజాలడు. ఇతరుల వలన పరాభవము సంభవించినప్పుడు మనము అందరము కలిసి నూటఅయిదుగురము. మనలో మనకు వివాదము వచ్చినపుడు మనము అయిదుగురము—వారు నూర్గురుగా భావించవలెను. ఇది కులధర్మము. "మనము ఎన్నో సంవత్సర

ములుగా అడవులలో బాధపడుచు దుర్యోధనాదులకు విరోధులమై యున్నాము. కనుక మనము అడ్డుపెట్టము" అని నీచబుద్ధిగల గంధర్వులు తలచియుందురు. ఇట్లు వారు మనకే అవమానముచేసి మనను తిరస్కరించి మనవారిని బంధించిరి. దుర్యోధనాదులను, వారి స్త్రీలను బంధించుటవలన మన కులమునకే గంధర్వులు కళంకము తేదలచినారు. ఈ అవమానము మన వంశమునకు మృత్యుతుల్యము. మనను శరణుపొందినవారిని, మన కులమునున్ను రక్షించుటకు మీరు వెంటనే యుద్ధమునకు సన్నద్ధులై వెడలవలెను. మీ నలుగురు తమ్ములు దుర్యోధనుని విడిపించుడు. ఇదుగో, దుర్యోధనాదుల రథములు, సారథులు, సైనికులు అన్ని పరికరములు ఉన్నవి. వీని సహాయముతో మీరు పోరాడి వారిని విడిపించుడు." ఈ మాటలు వినిన భీమసేనునకు కోపము రగులుకొనగా పూర్వ వైరమును స్మరించుచు అన్నతో నిట్లనెను :—

"అగ్రజా! పూర్వము లక్కయింటిలో మనను దుర్యోధనుడు కాల్చదలచెను. దైవయోగముచేత బ్రతికి బయటపడితిమి. కాలకూట విషమును నాకు తినిపించెను. లతలతో గట్టి నన్ను గంగలో త్రోసెను.

జూదములో అతడు చేసిన పాపములను, ద్రౌపదిని కొప్పు బట్టి యీడ్చి చీరలు ఒలిచి అవమానము చేయుటను మరచితివా? ఆ పాపములనే అతడిపుడు అనుభవించుచున్నాడు. మనము చేయవలసిన పనిని మన మైత్రిని గోరిన గంధర్వులు చేసిరి. ఇపుడు మనము సంతాపము చెందవలసిన సమయము కాదు.''

ఇంతలోనే గంధర్వునిచేత బంధించుకొని పోబడుచున్న దుర్యోధనుడు ఈ విధముగా దుఃఖించుచు అరచుచుండెను:— ''కురువంశ కీర్తిని పెంపొందించు ధర్మాత్ముడగు నో యుధిష్ఠిర మహారాజా! నన్ను గంధర్వులు కట్టి తీసుకొనిపోవుచున్నారు. నన్ను రక్షింపుము. నీ తమ్ముడగు నన్ను ఇతర సోదరులను, మా రాణులతోపాటు బంధించుకొని పోవుచున్నారు. ధర్మరాజా! త్వరగా వీరిని తరిమి ఓడించి మాకు ప్రాణభిక్ష పెట్టుము. బాహుబల పరాక్రమములుగల భీమార్జునులారా! మమ్ము రక్షింపుడు. నకులసహదేవ సోదరులుగూడా శస్త్రాస్త్రధారులై వచ్చి మమ్ము విడిపింపుడు. పాండవులారా ! కురువంశమునకిది ఒక గొప్ప అపయశస్సు. మీరు పరాక్రమముతో ఈ గంధర్వులను తరిమి మమ్ము విడిపించి మన వంశ గౌరవమును కాపాడుడు.''

ఈ విధముగా విలపించుచు అరచుచున్న దుర్యోధనుని మాటలు విని ధర్మరాజు తమ్ములతో 'లోకములో శత్రువైనను ఈ విధముగా ప్రాణార్థమై శరణుపొందినపుడు యోగ్యుడెవడైనను వినుచు ఊరకుండునా? తమ్ములారా ! వరములనిచ్చుట, రాజ్యదానము చేయుట, పుత్రజన్మ నిచ్చుట, శరణు పొందిన శత్రువును సంకటమునుండి విడిపించుట, ఈ నాలుగింటిలోను మొదటి మూడింటితోను,— కడపటి ఒకటి అనగా శరణాగత రక్షణము సమానము. దుర్యోధనుడు ఆపదలలో చిక్కుకొని మీ బాహుబలముపైన ఆధారపడి తన ప్రాణరక్షణమును చేయుమని మిమ్ము ప్రార్థించుచున్నాడు. ఇంతకంటే ఎక్కువ ఆనందమేముండును? నేనే స్వయముగా పోయి దుర్యోధనాదులను విడిపించియుందును గాని, యజ్ఞమును ఆరంభించినాను. అది పరిసమాప్తము కానిదే నేను యజ్ఞశాలనుండి కదులుటకు వీలులేదు. భీమసేనా! తొలుత నీవు సామోపాయముతోనే గంధర్వులనుండి దుర్యోధనుని విడిపించ జూడుము. అట్లు వీలుకానిచో ఇతరోపాయములను—అనగా—దాన భేద—దండములను ప్రయోగించుము. తొలుత మృదువుగా పరాక్రమమును చూపి యుద్ధము చేయుడు. దానికి వారు లొంగనిచో తరువాత కఠినముగా ప్రవర్తించి యెట్లైనను వారిని విడిపించుట మన కర్తవ్యము. యజ్ఞదీక్షలో నున్న నేను మీకింతకంటె యెక్కువ ఉపదేశించజాలను."

ధర్మరాజు మాటలు విని అర్జునుడు శౌర్యముతో లేచి "నేను తప్పక దుర్యోధనాదులను విడిపించెదను. సామోపాయముతో గంధర్వులు వినకపోయినచో గంధర్వ రాజ్యము నేడు నెత్తురు త్రాగునట్లు చేసెదను" అని ప్రతిజ్ఞ చేసెను. ఆ ప్రతిజ్ఞను విన్న కురుసైనికుల మనస్సు కుదుటబడెను.

అప్పుడు పాండవులు భీమసేనుని ముందుపెట్టుకొని దాడి వెడలిరి. సువర్ణ కవచములు—రథములు—వివిధాయుధములతో వారు జ్వలించుచున్న అగ్నులవలె ప్రకాశించుచుండిరి. ఈ విధముగా మరల బయలుదేరి వెడలిన కురుసైన్యమును చూచి జయకాంక్షులై గంధర్వులు తిరిగి వీరిని ఎదుర్కొనిరి. అగ్నులవలె వెలుగుచున్న నలుగురు పాండవులను గంధమాదనమునుండియే చూచి గంధర్వులు లోకపాలకులే వచ్చుచున్నారా అని భ్రమచెందిరి.

అప్పుడు ధర్మరాజు మాటలు స్మరణకురాగా పాండవులు మృదువుగానే యుద్ధము ప్రారంభించిరి. గంధర్వులు విజృంభించిరి. అది చూచి అర్జునుడు "మా సోదరుడు దుర్యోధనుని విడువుడు" అని మంచి మాటలతో చెప్పెను. అది విని వారు, ''అర్జునా! మేమొక యింద్రుని మాటనే పాటించెదము. ఆయన ఆజ్ఞప్రకారమే వచ్చినాము. ఇతరుల మాట పాటించము. నీ మాట వినము.'' అనిరి. అర్జునుడు, "ఇటువంటి నిందితమైన పని గంధర్వ రాజుకు తగదు. పరదారాపహరణము అతనికి శ్రేయస్కరముకాదు. మనుష్యులతో సమాగమము కూడదు. ధృతరాష్ట్రసూతులైన మా సోదరులను, వారి భార్యలతో వెంటనే విడువుడు. ఇది ధర్మరాజు ఆజ్ఞ. మీరు సామవాక్యముల ద్వారా వీరిని విడువనిచో పరాక్రమముతో నేను వీరిని విడిపించెదను'' అని చెప్పి ఆకాశములో తన బాణములు గంధర్వులకు తాకునట్లు విడిచెను. గంధర్వులు గూడ బాణములను విడిచిరి. ఈ విధముగా యిరువురికి గొప్ప యుద్ధము జరిగెను.

అప్పుడు నలుగురు పాండవుల దాడికి ఆగలేక వేలమంది గంధర్వులు నేలగూలిరి. ఇది చాల ఆశ్చర్యముగా నుండెను. కర్ణదుర్యోధనుల రథములవలెనే పాండవుల రథములను గూడ గంధర్వులు పొడిచేయ దలపెట్టుచుండగా, పాండవులు వేలకొలదిగ వచ్చుచున్న గంధర్వులను బాణవర్షముచేత నిగ్రహించిరి. పాండవుల దగ్గరకుగూడ వచ్చుటకు వారికి శక్తి చాలకుండెను. అర్జునుడు వేల గంధర్వులను యమపురికి పంపెను. భీముడును అనేకులను సంహరించెను. ఈలాగే నకులసహదేవులు గూడ చేసిరి. ఇట్లు

కొట్టబడుచున్న గంధర్వులు దుర్యోధనాదులను తీసికొని ఆకాశము లోకి ఎగిరిరి. అప్పుడు అర్జునుడు బాణములచేత వారిని కప్పి వారించెను. అప్పుడు గంధర్వులు బోనులో చిక్కబడినట్లు ఏమియు చేయజాలక అనేక ఆయుధములను భూమిపైనున్న పాండవులపై వర్షించిరి. వారినిగూడ పాండవులు భూమినుండియే కొట్టిరి. అర్జునుడు అనేక దివ్యాస్త్రములను గంధర్వులపై విసరెను. ఆ బాణపు దెబ్బలకు గంధర్వులు ఇంద్రుని బాణములకు రాక్షసుల వలె రట్టుకొనలేక చాల దుఃఖపడిరి. వారు ఏదిక్కు పోవజూచినను అర్జునుని బాణములు అడ్డగించుచుండెను.

అప్పుడు గంధర్వులు భయపడుటనుచూచి చిత్రసేనుడు గదాధారియై అర్జునుని ఎదుర్కొనెను. వాని ఉక్కు గదను పార్థుడు ఏడుగా పొడిచేసెను. అప్పుడు అతడు మాయచేత దాగియుండి అర్జునునితో పోరాడెను. అతడు విడిచిన అస్త్రముల నన్నింటిని అర్జునుడు దివ్యాస్త్రములచేత వారించెను. దాగియుండి చిత్రసేనుడు విడుచు బాణముల అర్జునుడు తన శబ్దవేధి బాణములతో ఖండించెను. ఈ విధముగా కొట్టబడి చిత్రసేనుడు స్వయముగా మైత్రితో అతని యెదుట కనబడి యిట్లనెను:— 'కుంతీనందనా నన్ను నీ మిత్రునిగా భావించుము' అది విని అర్జునుడు తన అస్త్రములను ఉపసంహరించుకొనెను. అది చూచి యితర పాండవులు కూడ తమ రథములను అస్త్రములను ఆపిరి. చిత్రసేనుడు పాండవులు అన్యోన్యము కుశల ప్రశ్నములు చేసికొనసాగిరి. అర్జున చిత్రసేనులకిట్లు సంభాషణము జరిగెను :—

అర్జు :— (నవ్వుచు) వీరుడా! నీవు కౌరవులను ఎందుకు నిగ్రహించితివి? భార్యలతో దుర్యోధనాదులను ఎందుకు బంధించితివి?

చిత్ర :— ధనంజయా! మీరు అడవిలో అనాథులవలె ఎన్నో యిడుములు బడుచుండుటను పరిహాస పూర్వకముగా దుర్యోధనుడు తన వైభవముతో చూడ వచ్చుట ఇంద్రునకు తొలుతనే తెలిసినది. అప్పుడు ఇంద్రుడు నన్ను పిలిచి 'నీవు వెంటనే పోయి దుర్యోధనాదులనందరిని బంధించి తెమ్ము, పాండవులు మనకు మిత్రులు అని చెప్పెను. దేవేంద్రుని మాటలపైన ఇక్కడికివచ్చి యీ పని చేసితిని. ఇప్పుడీ దురాత్ముని నింద్రుని కడకు కొనిపోయెదను.

అర్జు :— నా సోదరుడు దుర్యోధనుని నీవు నీ క్షేమము కోరినచో వెంటనే విడువుము. ఇది ధర్మరాజాజ్ఞ సుమా!

చిత్ర :— అర్జునా! ఇతడు మహా పాపాత్ముడు. యుధిష్ఠిరుని, ద్రౌపదిని మోసగించి బాధించెను. కనుక వీనిని విడువ కూడదు. ఇతని కుటిల మతి యుధిష్ఠిరునకు తెలియదు. ఇటుపైన నీ యిష్టము.

అప్పుడు అందరు కలిసి ధర్మరాజు వద్దకు పోయిరి. దుర్యోధనుని చేష్టలన్నియు చెప్పిరి. అజాత శత్రువు అది విని, గంధర్వులను విడిపించెను. "గంధర్వులారా! బలవంతులైన మీ చేత అదృష్టవశాత్తు దుర్యోధనుడు చంపబడలేదు. మా కులమునకు కళంకము రాలేదు. మీరు మాకు చాల మేలు చేసినారు. మీ కభీష్టములను తెలుపుడు తీర్చెదము. మీ యిష్టార్థ పూర్తియైన తరువాత మాలోకమునకు పోవచ్చును''.

ధర్మరాజు ననుజ్ఞగొని చిత్రసేనాదులు గంధర్వ లోకమునకు పోయిరి. ఇంద్రునికి జరిగిన సంగతి తెలిపిరి. అతడు సంతుష్టుడై పాండవుల ఔదార్యమును ప్రశంసించి, చనిపోయిన గంధర్వులను దివ్యామృతముచేత పునర్జీవితులను చేసెను.

జ్ఞాతులను, వారి భార్యలను విడిపించిన పాండవుల దుష్కర శౌర్యమును కౌరవులు కొనియాడిరి. పాండవులప్పుడు యజ్ఞవేదిలో నున్న అగ్నులవలె ప్రకాశించుచుండిరి. విముక్తుడైన దుర్యోధనుని తోను, అతని తమ్ములతోను ధర్మరాజు ఇట్లనెను:— "నాయనలారా మీరికపైన నెప్పుడునుగూడ ఇటువంటి సాహసకార్యములను చేయకుడు. ఇట్లు సాహసించు వారికి ఎప్పుడు గూడ సుఖములు కలుగవు. కురు నందనా! నీ తమ్ములతోను, భార్యలతోను కుశలముగా స్వేచ్ఛగా ఇంటికిపొమ్ము. మాయెడల ద్వేషము చూపకుము".

ధర్మరాజుచేత యాజ్ఞగొని దుర్యోధనుడు ధర్మ పుత్రునికి ప్రణమిల్లెను. అప్పుడు అతని సర్వేంద్రియము చచ్చినట్లు కూలబడియుండెను. హస్తిపురికి ప్రయాణమాయెను. అతడు చేసిన చెడ్డపనికిగాను అతనికే సిగ్గు కలుగుచుండెను. వారు వెడలిపోయిన పిదప ధర్మ పుత్రుడు బ్రాహ్మణులతోను, తమ్ములతోను అద్వైత వనమునందు విహరించుచుండెను. అప్పుడతడు దేవతలతో గూడి యింద్రునివలె శోభిల్లెను.

ఇది ఘోషయాత్ర వృత్తాంతము.

దుర్యోధనుని కర్ణుడు ప్రశంసించుట

"శత్రువులకు ఓడిపోయి, బద్ధుడై, పాండవులచే విమోచితుడైన, అభిమానవంతుడైన దుర్యోధనుడు, ఇట్టి దుర్దశలో, ఆ దురాత్ముడు హస్తిపురికి ఎట్లుపోగలిగినాడు. నాకు ఇది అసంభవముగా తోచుచున్నది. ఎందుకనగా అతడు తన శౌర్యముపట్ల స్వాభిమానముగలిగి, గర్వించుచు, సర్వదా పాండవులను అవమానపరచుచుండును గదా! ఆ విధముగా ఘోషయాత్రలో అవమానపడి లజ్జితుడైనవాడు ఎట్లు తన నగరమును తలయెత్తుకొని ప్రవేశింప గలిగెను'', అని జనమేజయ మహారాజు అడుగగా, వైశంపాయనుడిట్లు చెప్పదొడగెను :— "రాజా! దుర్యోధనుడు సిగ్గుచే తల వంచుకొని మిక్కిలి దుఃఖితుడై ధర్మరాజువద్దనుండి వెడలిపోయెను. అచటినుండి తన నగరమునకు సైన్యముతో పోవుచు తనకు గలిగిన పరాభవమునకు చింతించుచు మార్గమధ్యములోనే వాహనములతో తృణజల సమృద్ధిగలచోట విడిసెను."

అట్లున్న దుర్యోధనుని కడకు కర్ణుడు వచ్చెను. అప్పుడు దుర్యోధనుడు అగ్నివలె జ్వలించుచు స్వర్ణపల్యంకముపైనగూర్చొని యుండెను. రాహుగ్రస్త చంద్రునివలె శోభా విహీనుడై ఉండెను. అట్లున్న వానిని చూచి కర్ణుడిట్లనెను :—

"రాజా! చాల అదృష్టవంతుడవు నీవు జీవించియున్నావు. అదృష్టవశాత్తు మనము మరల కలుసుకొన గలిగినాము. భాగ్య

వశాత్తు, కామరూపధారులైన గంధర్వులను నీవు జయించివచ్చినావు. ఇది అధిక సంతోషదాయకము. నీ తమ్ములుగూడ పరిపూర్ణ జయమును సాధించి, తిరిగి యుద్ధమున సన్నదులగునంత ఉత్సాహముతో నున్నారు. ఇదియు అదృష్టమే. నేను, అక్కడి నుండి పారిపోవుచు చెదరిన సైన్యమును గూడ స్థిరపరచజాలక పోయితిని. శత్రుబాణ ఘాతముచేత నా శరీరము మరింత గాయపడినది. అందుచేతనే పారివచ్చితిని. రాజా! మీరు ఆ మానవాతీతమైన యుద్ధములో జయమును సాధించి, చెక్కుచెదరని సైన్యముతోను, స్త్రీలతోను క్షేమముగా తిరిగి రాగలుగుట నాకు చాల అద్భుతముగా గోచరించుచున్నది. మహారాజా! ఈ యుద్ధములో నీవు తమ్ములతో చూపించిన పరాక్రమము ప్రపంచమునందు ఇతరులకు సాధ్యము కానిది." ఇట్లు చెప్పిన కర్ణుని మాటలు విని దుర్యోధనుడు అప్పుడు కన్నుల నీరుగ్రమ్మగా గద్గద స్వరముతో కర్ణునితో నిట్లనెను :—

"రాధా నందనా! జరిగిన విషయములు నీకు తెలియక ఇట్లు మాట్లాడుచున్నావు. కనుక నిన్ను నేను చెడగా తలచుట లేదు. నేనే యీ విజయమును సాధించినానని నా పరాక్రమమును పొగడుచున్నావు. ఇది సత్యముగాదు. నేను తమ్ములతో కలిసి గంధర్వులతో ఘోరముగా పోరాడితిని. ఇరు పక్షముల సైన్యము చాల కూలిపోయెను. మాయావులగు గంధర్వులు ఆకాశమునుండి యుద్ధము చేసిరి. వారితో సమానముగా మేము భూమినుండి పోరాడజాలక పోయితిమి. కాబట్టి యుద్ధములో ఓడిపోయి వారిచే నేను, తమ్ములు, పుత్రులు, భృత్యులు, అమాత్యులు, తుదకు స్త్రీలు అందరము గూడ బంధింపబడితిమి. మమ్మందరిని ఆకాశమార్గముగా వారు పైకి కొనిపోవుచుండుట చూచి హతశేషులయిన మన సైనికులు బిగ్గరగా అరచుచు దుఃఖించుచు, ఆ సమీపమునందున్న పాండవులను శరణుజొచ్చి వారికి జరిగిన సంగతి తెలిపిరి. అందరిని విడిపించుమనియు, కౌరవస్త్రీలకు పరాభవము కలుగకుండ కాపాడుడనియు, ప్రార్థించిరి. అప్పుడు ధర్మరాజు తమ్ములను శాంతపరచి మమ్ము కాపాడుడని వారికి ఆజ్ఞయిచ్చెను. ఆ ధర్మాత్ముని ఆజ్ఞగొని వారు యుద్ధభూమికి వచ్చినతొలుత సామోపాయముచేత విడిపించదలచి, అది సాధ్యము కాకపోగా యుద్ధములో గంధర్వుల నోడించి మమ్ము విడిపించిరి. అర్జునుడు చిత్రసేనునితో 'మేము జీవించి యుండగా మా సోదరులను చెరబట్టి నీవు తీసికొనిపోజాలవు. పాండవులు స్వవంశమునకు, వారు జీవించియుండగా హాని కలుగనీయరు' అని చెప్పెను. కర్ణా! ఆ మాటలు వినుచున్న నేను స్వాభిమానమును వీడజాలక భూమి చీల్చుకొని దూరి ఆత్మహత్య చేసుకొనవలెనను నంత అవమానము నాకు కలిగినది. ఆ తరువాత వారందరు మాతో ధర్మరాజు వద్దకు పోయిరి. ఆయనకు గంధర్వులు మా దురాలోచనలన్నియు చెప్పిరి. స్త్రీల యెదురుగా నేను బద్ధుడనై దైన్యముతో ధర్మరాజు వద్ద నిలిచితిని. ఇంతకంటే వేరు దుఃఖము నాకేమున్నది? ఎవరిని నేను సర్వదా తిరస్కరించితినో, ఎవరికి నేనెల్లప్పుడు శత్రువుగానుంటినో, అట్టి పాండవులే నన్ను శత్రువుల బంధమునుండి విడిపించి నాకు ప్రాణదానము చేసిరి. ఆ మహా యుద్ధమునందు నేను చచ్చియుండిన బాగుండెడిది. ఇట్టి దుర్దశలో నేను జీవించి యుండజాలను. గంధర్వులచేత చచ్చియుండినచో నా యశస్సు భూమండలమంతయు వ్యాపించియుండుటయేకాక మహేంద్ర సదృశుడనై పుణ్య వీర స్వర్గమలంకరించి యుందును. ఇప్పుడు మీరందరు నా నిశ్చయమును వినుడు. నేను మరణాంతము నిరశన వ్రతమున నిచ్చటనే యుండెదను. మీరు పురమునకు పొండు. శత్రువుల వలన అవమానము పొందిన నేను ఇంటికి రాను. నేటిదాక నేను శత్రువుల అభిమానమును అణచుచు వచ్చినాను, మిత్రులను సమ్మానించుచు వచ్చినాను. నేడు నా శత్రువులకు హర్షమును, మిత్రులకు శోకమును కలిగించినవాడనైనాను. ఇప్పుడు నేను హస్తినాపురము పోయి రాజులతో ఏ ముఖము పెట్టుకొని మాట్లాడుదును? భీష్మద్రోణాది వృద్ధులు, విదుర సంజయులు-బ్రాహ్మణులు-నగరములోని పెద్దలు వీరందరు నన్నేమనెదరు? వారికి నేనేమి ఉత్తరము చెప్పుదును? ఇంతదాక నేను శత్రువుల శిరములపైనను, వక్షముల పైనను నిలిచియుంటిని. నేడు స్వయంకృతాపరాధముచేత నేను క్రింద పడిపోయినాను. ఈ దుర్దశలో నేను ఆదరణీయులైన పెద్దలతో ఏమి మాట్లాడగలను? నావంటి దుర్వినీతులు సంపదను, విద్యను, ఐశ్వర్యమును పొంది మంచి శోభస్థితిలో ఉండజాలరు. నేను అహంకారముతోను, మదముతోను భ్రష్టుడనైతిని. ఇప్పుడు నేను చేసిన దుష్కృత్యము నాకు యోగ్యమైనది కాదు. దుర్బుద్ధియగు నేను మోహాంధుడనై దుఃఖకరమైన దుష్కర్మ చేసితిని. దానివలన నేను గంధర్వులకు పట్టుబడినందుచేత నా జీవితమే సంశయాస్పదమైనది. అందుచేత నేను తప్పక ఆమరణ ఉపవాసము చేసెదను. ఇంక జీవించి ఉండలేను. సంకటావస్థలో చిక్కుకుని శత్రువులచేత ఉద్ధరింపబడిన యే బుద్ధిమంతుడు గూడ జీవించుటకు ఇష్టపడడు; శత్రువులు నన్ను పరిహసించిరి. నా పౌరుషమునందు నాకు అభిమానముండెను. కాని యీ సందర్భమునందు నేను ఏలాటి పురుషార్థమును గూడ చూపించజాలక పోయినాను. పరాక్రమవంతులైన పాండవులు నన్ను అవహేళన చేయుచు చూచినారు. ఇట్టి పరిస్థితిలో నాకు ఈ జీవితముపై విరక్తి గలిగినది."

అనిచెప్పి దుర్యోధనుడు దుశ్శాసనునితో నిట్లనెను :—

"తమ్ముడా! నేనునీకు రాజ్యపట్టాభిషేకముచేసెదను. నేను ఇచ్చు ఈరాజ్యమును తీసికొని రాజ్యాభిషిక్తుడవుకమ్ము. కర్ణశకునుల సహాయముతో రాజ్యమును పాలించుము, ఇంద్రుడు దేవతలనువలె తమ్ములను పాలించుము. ఇంద్రుని దేవతలు వలె నిన్ను బంధువులు ఆశ్రయించి యుందురుగాక. బ్రాహ్మణుల జీవిత నిర్వహణమును అప్రమత్తుడవై చేయుచు వారిని రక్షించుము. బంధువులకు, మిత్రులకు సహాయము చేయుచుండుము. విష్ణువు దేవతలయెడల మెలగినట్లు నీవు నీ కుటుంబ జ్ఞాతులయెడ కృపాదృష్టితో మెలగుము, గురుజనమును పాలించుము, మిత్రులను సంతోష పరచుచు, శత్రువులను అణచుచు భూమిని పాలించుము." అని చెప్పి దుశ్శాసనుని గాఢాలింగనము చేసికొని, 'ఇక నీవు పొమ్ము' అని చెప్పెను.

దుర్యోధనుని మాటలువిని దుశ్శాసనుడు దీనుడై కన్నీరొలుకగా గద్గద స్వరముతో దుఃఖార్తుడై నమస్కరించి అంజలి బంధముతో అన్నకిట్లనెను;— "అన్నా! అట్లు ఎన్నటికిని కాజాలదు. సమ

స్తభూమండలము చీలిపోవును, ఆకాశము వ్రక్కలగును. సూర్యుడు చల్లగాను, చంద్రుడు వేడిగాను నగును, వాయివు తన ఆశుగత్వము (వేగముగా పోవుట) విడుచును, హిమాలయము స్వస్థానమును వీడి పోవును, సముద్రములెండిపోవును, అగ్ని వేడిని విడుచును, కనుక నీవు ప్రసన్నుడవుకమ్ము. మనకులమునకు నీవే నూరేండ్లు రాజుగా నుండెదవు.'' అని పూజ్యార్హము లైన అన్న పాదముల పైపడి బిగ్గరగా ఏడ్చెను.

కర్ణుని ఉపదేశము

ఈవిధముగా దుఃఖార్తు లైన దుర్యోధనదుశ్శాసనులను చూచి కర్ణుడు చాలవ్యథచెంది వారినిసమీపించి ఇట్లనెను:— ''వీరులార! మీ రిద్దరు మూర్ఖులవలె అజ్ఞానముతో ఇంతగా దుఃఖించుచున్నారు. శోకములో మునిగినవాని శోక మెప్పుడును అణగదు. శోకించువాని శోకము, వానిపై బడ్డ సంకటమును దూరముచేయ జాలనప్పుడు ఆ శోకముశక్తియెంతటిది? మీ రిద్దరు సోదరులు దుఃఖించుచున్నారు గదా! మీ శోక మేమాత్రము అణగలేదుగదా! అందుచేత ధైర్యముతో సంకటములను ఎదుర్కొనుడు. మీరు దుఃఖించుటచేత శత్రువుల సంతోషము అధికముకాగలదు. రాజా! గంధర్వుల చేత చిక్కిన మిమ్ము పాండవులు విడిపించిరి. అది వారి కర్తవ్యపాలనమే యగును. అందులో విశేష మేమున్నది ? రాజు సంకటావస్థలో ఉన్నప్పుడు అతని రాజ్యములోని ప్రతి వ్యక్తియు రాజరక్షణము చేయుట అతని కర్తవ్యము కదా ? నీవు పాలించుచున్న రాజ్యములో వారు సురక్షితముగా నున్నారు. నీకు ప్రియము చేయుట వారి విధి. ఇట్టి పరిస్థితిలో నీవు ఇంతగా నైత్యమునకు దిగి దీనుడవై దుఃఖించకూడదు. నీవు ప్రాయోపవేశనము (మరణాంతము నిరశనము) చేసినచో నీ తమ్ములు శోకములో మునిగియుండెదరు. లెమ్ము నీకు శుభమగుగాక, తమ్ములను ఊరడించుము.'' అని చెప్పి కర్ణుడింకను ఇట్లు చెప్ప దొడగెను :—

''రాజా! నీవు ఇప్పుడునిన్ను ఇంత నీచముగా చూచుకొనుటకు కారణమునేను అరయజాలకున్నాను. ఒకవేళ నీవొకసారి శత్రువులకు వశుడవై నప్పుడు పాండవులు నిన్ను విడిపించినారే అనుకొనుము. ఇందులో ఆశ్చర్యమేమున్నది? రాజకీయ సేనలో ఉండి జీవననిర్వహణ చేయుచు రాజ్యములో నివసించుచుండువాడు, వారు రాజునకు పరిచితులైనను, అపరిచితులైనను రాజునకు ప్రియమొనరించుట వారి కర్తవ్యములో చేరును. తరచుగా ప్రధాన పురుషుడు పోరాడుచు శత్రువులను చీకాకు పరచును: ఆ యుద్ధములోనే అతడు మరియొక సారి బ ధీగా పోవును. అప్పుడు సాధారణ సైనికుడు వానిని విడిపించును. అంతమాత్రముతో ఆ సాధారణుడు గొప్పవాడగునా ? సైన్యజీవులైయుండువారు గాని, ఒక రాజు రాజ్యములో నివసించుచుండువారు గాని అందరు కలసికట్టుగా, రాజుయొక్క హితమును కోరుచు రాజ రక్షణమునకు యథోచితముగా ప్రయత్నము చేయవలెను. ఈ విధముగానే, నీ రాజ్యములో నివశించుచుండు పాండవులు దైవికముగా నిన్ను శత్రువులనుండి విడిపించినారు, ఇంత మాత్రముచే నీవు ఖేదమొందవలసిన యవసరమేమున్నది? నీవు ఉత్తమ రాజన్యుడవు, నీ సేనతో ఈ వనమునకు వచ్చినప్పుడు ఇక్కడ వున్న పాండవులు నిన్ను అనుసరించి వెంబడి పక, నీకు సహాయముచేయక యున్నచో అది వారికే మంచిదికాదుగదా ! శూరులు, బలవంతులు, యుద్ధములలో వెన్ను చూపనివారునగు పాండవులు— నీకు ఇంతకుము దే ఎప్పుడో దాసులైనారు. కనుక వారు తప్పక నీకు సహాయకులుగా నుండవలసినదే. పాండవులకడ నున్న రత్నములు (శ్రేష్ఠ వస్తువులు) అన్నియు నేడు నీవు అనుభవించుచున్నావు. అయినప్పటికిని చూడుము. పాండవులెంత ధైర్యశాలులో. వారు ఎప్పుడుగూడ మరణాంతనిరశన వ్రతమునకు పూనుకొనలేదు. కనుక రాజా ! నీవిట్లు దుఃఖ పడిన ప్రయోజనము లేదు. లెమ్ము నీకు శుభమగుగాక! ఇక ఇక్కడ చాలా సేపు ఉండరాదు, నీవీవిధముగా పశ్చాత్తాప పడుచు దుఃఖ పడకుము. రాజా! నీవు నా మాట వినకుండినచో నేను గూడ ఇక్కడనే నీ పాద శుశ్రూష చేయుచు నుండెదను. నీవు లేక జీవించుటకు నాకు ఉత్సాహము లేదు. నీవు ప్రాయోపవేశము చేసి రాజులందరికి హాస్యాస్పదుడవు కాకుము.'' కర్ణుడు చెప్పిన యీ మాటలు విని దుర్యోధనుని మనస్సు కరగ లేదు. అతడు ప్రాయోపవేశమునకే సిద్ధ పడి యుండెను' అని చెప్పి వైశంపాయనుడు జనమేజయునితో తరువాతి వృత్తాంతమిట్లు చెప్పదొడగెను :—

శకుని ఉపదేశము

ఇట్లు ప్రాయోపవిష్టుడైయున్న దుర్యోధనునకు శకునియిట్లు బోధించెను :— ''కురునందనా ! కర్ణుడు చాల చక్కని మాట చెప్పినాడు. పాండవులనుండి అపహరించిన మహావైభవోపేతరాజ్యమును ఏల విడుచుచున్నావు. నీవు అల్ప బుద్ధివై ప్రాణ త్యాగము చేయ దలచుచున్నావు. లేదా, నీవెప్పుడును వృద్ధులను సేవించలేదని తోచుచున్నది. అకస్మాత్తుగా కలిగిన హర్ష శోకములను అణచజాలని వానిని రాజ్యలక్ష్మి పొందియు అది స్వయముగానే, పచ్చికుండ నీటిలో పడి కరిగినట్లు నశించుపోవును. మిక్కిలి భయశీలుడు, అసమర్థుడు, సోమరి, పొరపాట్లు చేయువాడు, దుర్వ్యసనములకు లోబడి విషయాసక్తుడైన వానిని, ప్రజలు తమకు రాజుగా ఎప్పుడును అంగీకరించరు. పాండవులు నీకు సత్కారము చేసినారు. దానికి నీవు శోకించుచున్నావు. దీనికి బదులుగా మరొక వేళ నీకు తిరస్కారమే చేసియుండినచో నీవింకను నెట్టి దుర్దశకులోనై యుండెడివాడవో యేరుగను. కౌంతేయులు నీయెడల చేసిన సద్వ్యవహారమునకు నీవుతృప్తిచెంది శోకమును వీడుము. నాశము చెందకుము, ఈ సందర్భమునందు నీవు హర్షించి పాండవులను సత్కరించుటకు బదులుగా నివేదుఃఖించుచున్నావు, ఈ నీవ్యవహారము వ్యతిరేకముగా నున్నదే. ప్రసన్నుడవు కమ్ము. ప్రాణ నాశనమునకు తలపెట్టకుము. సంతుష్టుడవై పాండవులు చేసిన మంచి పనిని స్మరించుము. వారి రాజ్యమును వారికి ఇమ్ము. దానిచేత కీర్తిని, ధర్మమును పొందుము ఈ నాయుపదేశమును పాటించి నీవు కృతజ్ఞుడవను కీర్తిని సంపాదించుకొనుము. పాండవులతో సౌభ్రాత్రమును (మంచిసోదరభావమును) నెరపుము. వారిని వారి తండ్రి రాజ్యమునందు స్థాపించుము. దానిచేత నీకు సుఖము కలుగును.''

(ప శేషము)

గ్రంథసమీక్ష

ఇరవయ్యో శతాబ్దపు పద్య కవితాకాశంలో శ్రీవిశ్వనాథ సత్యనారాయణగారు సూర్యుడైతే, కీ. శే. గుర్రం జాషువా కవిగారిని చంద్రునితో పోల్చవచ్చు. అంటే శాస్త్ర ప్రకారం ఆయన వెలుగు యీయన మీద పడిందనిగానీ, యీయనకు స్వయం ప్రకాశం లేదని కానీ అర్థంకాదు. విశ్వనాథ వారి పలుకు ఎండవలె మండిస్తుంది. జాషువాగారి పలుకు వెన్నెలవలె చలువ లూరిస్తుంది. ఈ యిద్దరు కవిదిగ్గజాలకు వైరమనీ, పచ్చగడివేస్తే భగ్గునమండుతుందనీ లోకంలో ప్రతీతి. ఇది నిజ కాదనీ ఇద్దరూ మంచి స్నేహితులనీ శ్రీవిశ్వనాథ వారు సాక్ష్యం యిస్తున్నారు. "అతనికీ నాకూ కలిసి పద్మభూషణవచ్చినది. నేనది పుచ్చుకునేందుకు ఢిల్లీ వెళ్ళినాను. జాషువారాలేదని నేను ఎంత అనుకున్నానో అక్కడి నా స్నేహితులకు తెలుసు. ఆయనకూ నాకూ చాలాస్నేహం. మేమిద్దరము కలుసుకుంటే ఎప్పుడూ సరాగాలాడుకునే వాళ్ళం'' అన్నారు విశ్వనాథవారు. (పేజీ 242) కీ. శే. జాషువాగారి స్మృతి

జాషువ కవిత్వతత్వం

ప్రచురణ: అభ్యుదయ వేదిక

ప్రజాశక్తి నగరం, విజయవాడ—10

పేజీలు 275. సాదా ప్రతి 5 రూ.

చిహ్నంగా యీ సంకలనాన్ని విజయవాడలోని అభ్యుదయ వేదిక వారు నిర్వహించి ప్రచురించారు. అందులో జాషువాగారిని గురించీ, ఆయన కవిత్వం గురించీ, దానితత్వాన్ని గురించీ 58 మంది కవి పండితులు వ్రాసిన వ్యాసాలువున్నాయి. జాషువాగారికి జోహారు లర్పిస్తూ 21 మంది కవులు వ్రాసిన కవితలుకూడావున్నాయి. వ్యాసకర్తలలో పండిత గొర్రెపాటి వెంకట సుబ్బయ్య, డా. శ్రీపాద గోపాలకృష్ణమూర్తి, దుర్గానంద్, అమరేంద్ర, మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి, జస్టిస్ ఆవుల సాంబశివరావు, సి. వి. సుబ్బన్న శతావధాని, పురాణం సుబ్రహ్మణ్య శర్మ, సంజీవదేవ్, తిరుమల రామచంద్ర, పొట్లపల్లి శీతారామరావు, దివాకర్ల వేంకటావధాని, విశ్వనాథ సత్యనారాయణ ప్రభృతులున్నారు.

తెనుగు సాహిత్యం—ముఖ్యంగా కవిత్వం నేల విడచి సాము చేస్తున్న భావకవితాయుగంలో వుడికూడా ఆయన ఆ జోలికి పోలేదంటే, ప్రేమ కవిత్వాన్ని గురించి ఆయనకుగల వైముఖ్యమే కారణం అని చెప్పుకోవచ్చు. భావకవిత్వం మీద జాషువగారు విసుర్లుగూడా విసిరారు. "భావావేశ సమయమున ఏవేవో వ్రాసినాడ యిపుడడుగ నేనేవిది తెలుపుదు'' అని అంటాడట భావకవి. భావకవితలో కనిపించిన ఆయోమయత్వం ఆయనకు సరిపడేది కాదు. జాషువాగారు నిజమైన అర్థంలో నూటికినూరుపాళ్ళు ప్రజాకవి, అభ్యుదయకవి. ఆయన కాలం నాటికి అభ్యుదయకవితోద్యమం ఆంధ్ర దేశంలో పుట్టనేలేదు. ఆయన ఎన్నుకున్న ప్రతి కథావస్తువూ అభ్యుదయ కవితా మార్గం సూచించిన పరిధిలోనే వున్నది. ఆయన కాలంలో మిగిలిన కవులందరూ తాము చుట్టూవున్న సమాజానికి అతీతులమనుకుంటుండేవాళ్లు. ఆ పరిస్థితుల్లో జాషువాగారు "ఆకులో ఆకునై"కాకుండా "ప్రజల్లో ఒకడుగా" నిలబడి వారి బాధలు గాథలు తన కవిత్వంలో ప్రతిఫలింపజేశాడు. పురాణం సుబ్రహ్మణ్యశర్మగారు తన వ్యాసంలో చెప్పినట్లు ఆయనకు సమాజంలోని వర్గస్వభావం, వర్గ వైరుధ్యలక్షణం, మార్క్సిస్టు దృక్పథం అర్థంకాలేదుగాని, మొత్తంమీద తన అనుభవ పరిధిలో ఆయన ఆ మార్గానికి దగ్గరగానే పయనించాడు. జాషువాగారు పీడితవర్గానికి చెందినవాడు కావడంకూడా ఆయిన రచనకు రాణింపు రావడానికి ఒక కారణంగా చెప్పుకోవచ్చు. అభ్యుదయభావన, అనన్యసామాన్యమైన తెనుగునుడికారంపు సొంపుల మేళవింపు ఆయనను మహాకవిగా తీర్చిదిద్దినవి.

"కసరిబుసకొట్టు నాతని గాలిసోక

నాల్గుపడగల హైందవనాగరాజు"

హరిజనుని గాలి సోకితే హైందవమతమనే నాలుగుపడగల (చాతుర్వర్ణ్య)నాగుబాము బుసకొడుతుంది. చతుర్వర్ణాలను నాలుగు పడగలుగా భావించడం సాధారణవిషయిమే అనుకున్నా—పాముగాలి తిండి అనే కవిసమయాన్నీ, "గాలి సోకుట''అనే జాతీయాన్నీ మేళవించి, ఆ పాముకు తన ఆహారాన్నికూడా వదులుకునే మూఢత్వాన్ని కల్పించడం నిస్సందేహంగా గొప్ప కవిత లక్షణం. ఒకవిధంగాచూస్తే జాషువాగారికి యిటువంటివి సహజంగా అప్రయత్నంగా వస్తాయేమోననిపిస్తుంది. అందుకే ఆయన సహజకవి

"ఈ కవికి కొన్ని అలంకారాలమీద మాత్రమే ఒరవడవున్నట్లు కనిపించదు. అలంకారాలను అప్రయత్నంగా వాడతారు. అలంకారాలను శిల్పవిద్యగావాడరు. కవికి ప్రతిభవున్నది. దాని సహాయంతో తోచినట్టు వాడతారు'' అన్నారు పొట్లపల్లి శీతారామరావుగారు తమ వ్యాసంలో, అయితే కృతాశిల్పంలో భాగంగా కాకుండా, జాషువాగారి కవితలో అలంకారాలు సహజంగా వచ్చిపడతాయనేమాట యథార్థం.

జాషువాగారు చాలాకావ్యాలు రాసినా తెనుగుదేశం ఆయన్ను ఖండకావ్యరచయితగా గుర్తించి గౌరవించింది. ఖండకావ్యం అనే మాట ఆయనతోనే తెనుగులో ప్రాచుర్యం పొందింది. ఆయన ఖండికలలో దేనికోఒకదానికి ముగ్ధుడై చవించని ఆంధ్రుడు లేడంటే అతిశయోక్తికాదు. మానవజీవిత ప్రారంభాంతాలకు సంబంధించిన రెండు చక్కని ఖండికలు—శిశువు, శ్మశానం—అనేవి అత్యంత జనాదరణ పొందినవి.

నా కవితావధూటిని ఎగాదిగచూచి, మేలనిమెచ్చుకున్నవారే, చివరకు "మీదే కులమంచు ప్రశ్న వెలయించి చివుక్కున లేచి

పోవుచో బాకున గ్రుమ్మినట్లగును'' అని ఒకచోట తన మనోవేదనను వెళ్ళబుచ్చుకున్నారు. అందుకే ఆయన దేశంలోని అవినీతిమీదా, కుల వ్యవస్థమీదా తిరుగుబాటుచేసి నిర్మొగమాటగా తన అభిప్రాయాలను వెల్లడించారు. జాషువాగారి కవిత్వంలో కొంతవరకు ప్రాచీనగాథాస్మరణ, పూర్వవైభవ ప్రశంస ఉన్నా ఆయన ఊహలలో చాలాభాగం వర్తమానజీవితంలోని లోటుపాట్లను ఎత్తి చూపడానికి వాడుకోవడం జరిగింది. జాషువాగారు రాసిన 'గబ్బిలం' ఆయన రచనల్లో అత్యుత్తమమైన సందేశకావ్యం. వర్తమానదేశ కాలవ్యవస్థకు అదొక ప్రతిబింబం. తనకు పరమశత్రువులైన కుల వ్యవస్థనూ, అస్పృశ్యతనూ కవిగారు దీనిలో దుయ్యబట్టారు.

అనేకమంది కవిపండితులు జాషువాగారి కవిత్వతత్వం యిదీ అని వివరించి చెప్పడం ఒకఎత్తు; ఆయన జీవితకాలంలోనే సాధారణ పాఠకులు ఆయనమీద కురిపించిన అభిమానవర్షం ఒకఎత్తు. మామూలుతెలుగువాడు; పద్యాలు చదువగలవాడికి శిల్పం, వ్యాకరణం వగైరా అక్కరలేదు. "జాషువాగారి పద్యాలు నాకు యిష్టం'' అనేవాడు అంతే. అదే ఆయన ఘనతకు కొలమానం.

జాషువాగారి కవితాగుణాన్ని గురించి, తత్వాన్ని గురించీ ఎంత చెప్పినా చెప్పవచ్చు. మొత్తంమీద చూస్తే ఆయనకు ప్రజాబాహుళ్యంలో పేరు తెచ్చిపెట్టినవి మాత్రం, ఆయన ప్రత్యేకమైన పలుకుబడులు, తెనుగునుడికారముమీద ఆయనకున్న అధికారము మరెవరికీ లేదంటే అతిశయోక్తి కాదు. ఈ విషయం గురించి వ్యాసం వ్రాసిన మేడవరం వెంకటనారాయణశర్మగారు "ఈ ప్రయోగాల నన్నింటినీ జాషువా పద ప్రయోగకోశం"గ అకారాది రూపొందించవలసిన బాధ్యత, అవసరం ఆంధ్రులనెత్తిన ఉన్నది". అన్నమాట చాలా చక్కని సూచన.

జాషువాగారిని గురించి ఏమాత్రం తెలిసినవారైనా, ఏమాత్రం తెలియనివారైనా తప్పకుండా చదువవలసిన గ్రంథం యిది. ఆయనకు యింతకంటే మేలైన విధంగా జోహారులు అర్పించడం కష్టం. దీనిని నిర్వహించి ప్రచురించిన అభ్యుదయవేదిక వారిని అభినందించకుండా వుండలేము.

--చైతన్య

ఈ సంచికలోని రచయితలు

శ్రీ వి. ఎల్. సుందరరావు, రెయిల్‌పేట, బాపట్ల

శ్రీ కశింకోట ప్రభాకరదేవ్, C/o డా|| సి. సి. బి. దేవ్, ట్రంక్‌రోడ్డు, శ్రీకాకుళం

శ్రీ మధురశ్రీ, జర్నలిస్టు, పెద్దాపురం, తూ. గో. జిల్లా

శ్రీ చేకూరి చెన్నకృష్ణయ్య, 12. బారాగల్లీ, హుస్సేనీఆలం, హైదరాబాదు

శ్రీమతి వేదవతీదేవి, నెం. 44, ఎల్. ఐ. సి. కాలనీ, మహిదీపట్నం, హైదరాబాదు

శ్రీ తిరుమల రామచంద్ర, C/o కె. లక్ష్మణశాస్త్రి, 69 ఆదర్శనగర్, హైదరాబాదు

శ్రీ చుండి జగన్నాథం, 38/3 RT, సంజీవరెడ్డినగర్, హైదరాబాదు


శ్రీ ముదిగొండ వీరభద్రమూర్తి, H. No. 13-6-675, కార్వాన్‌షాహు, హైదరాబాదు

శ్రీ పి. రాజగోపాలనాయుడు, ఎం. ఎల్. సి. చిత్తూరు

శ్రీ ఎ. పండరినాథ్, ఉపాధ్యాయుడు, జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాల, ఇబ్రహీంపట్నం


శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, 69 ఆదర్శనగర్, హైదరాబాదు


గవర్నరు సలహాదారు శ్రీ హెచ్. సి. సరీన్ మే 9న లాల్‌బహదూర్ స్టేడియంలో 18వ జాతీయ బాల్ బాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలను ప్రారంభించారు.




నగర వార్తా చిత్రాలు

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ ఎస్. భగవాన్‌దాస్ మే 7న రవీంద్ర భారతిలో రవీంద్ర జయంతి ఉత్సవాలకు అధ్యక్షత వహించారు.






శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి నాయకత్వాన రెండు రోజులపాటు నగరానికి విచ్చేసిన అరవ ఆర్థిక సహాయసంఘంతో చర్చలు జరుపుతున్న గవర్నరూ, ఆయన సలహాదారు.



కేంద్రప్రణాళికా విషయాల స్టేట్ మంత్రి శ్రీ మోహన్ ధారియా మే 4న రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో ఉపాధి కల్పనావకాశాల గురించి చర్చలు జరిపారు.



అమెరికాలో మొదటిసారిగా నిర్వహింపబడుతున్న తెలుగు చలనచిత్రోత్సవంలో పాల్గొంటున్న
ప్రతినిధివర్గం, గవర్నరు సలహాదారులను కలుసుకున్నప్పటి చిత్రం



లాల్ బహదూర్ స్టేడియంలో జాతీయ
బాల్ బాడ్మింటన్ పోటీలలో పాల్గొం
టున్న క్రీడాకారులు [illegible] యిచ్చిన
విన్యాస వందనాన్ని స్వీకరిస్తున్న
శ్రీ నరీన్.

జిల్లాల్లో

వెంగనాయిక పాలెంకు విద్యుచ్ఛక్తి

కేంద్ర జలవిద్యుచ్ఛక్తి శాఖా మంత్రి డా. కె. ఎల్. రావు మే 2వ తేదీన కృష్ణా జిల్లాలోని నందిగామ పంచాయతీ సమితికి చెందిన కనగపాడు గ్రామశివారు వెంగనాయిక పాలెంలో విద్యుచ్ఛక్తి సరఫరాకు ప్రారంభోత్సవం చేశారు. విద్యుచ్ఛక్తిని అలంకారాలకు దుబారా చేయకుండా ఉత్పత్తి పనులకు వినియోగించవలసినదిగా గ్రామస్తులకు ఆయన సూచించారు. విజయవాడవద్ద నిర్మించాలను కుంటున్న థర్మల్ విద్యుత్ కేంద్రానికి ఒకటి రెండు నెలల్లో ప్రణాళికా సంఘం ఆమోదం లభించగలదన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

విద్యుచ్ఛక్తి పథకాలు ఏ విధంగా అభివృద్ధి చెందుతున్నదో రాష్ట్ర విద్యుచ్ఛక్తి మండలి అధ్యక్షుడు శ్రీ కె. వి. శ్రీనివాసరావు వివరించారు. రెండవ దఫా చేపట్టే పథకాలవల్ల యీ ఏడాదే 90 గ్రామాలకు రూ. 94 లక్షల ఖర్చుతో విద్యుచ్ఛక్తి సౌకర్యం కల్పించ బడుతుందని విజయవాడ సూపరింటెండింగ్ ఇంజనీర్ శ్రీ సోమ సుదరం తెలియజేశారు.

కృష్ణా జిల్లా సమన్వయ సంఘ సమావేశం

కృష్ణా జిల్లా కలెక్టరు శ్రీ కె. ఆర్. వేణుగోపాల్ మే 1వ తేదీన మచిలీపట్నంలో జిల్లా సమన్వయ సంఘ సమావేశానికి అధ్యక్షత వహించారు. షెడ్యూలు కులాలు, షెడ్యూలు జాతులు, ఇంకా సమాజంలోని యితర బలహీన వర్గాల వారికి మేలు చేసే వివిధ అభివృద్ధి పథకాలను అమలుపరచవలసిన అవసరాన్ని గురించి ఆయన వివరించారు. ఈ సమావేశాలలో ఖరీఫ్ పంటకు సంబంధించిన పనులు విత్తనాలు, ఎరువులు మొదలైన వాటి సరఫరా, కరువు సహాయక




కర్నూలులోని ప్రభుత్వ శరణాలయంలోనివారికి జిల్లా కలెక్టరు సతీమణి వస్త్రాలు పంచుతున్న దృశ్యం.

కార్యక్రమాలు, క్రాష్‌ప్రోగ్రామ్స్ క్రింద చేపట్టిన పనుల తీరు తెన్నులను గురించి సమీక్షించడం జరిగింది. వీలైనంత ఎక్కువ ఎకరాల్ని ఈ ఏడాది అధిక దిగుబడి వరి సాగు క్రిందకు తీసుకు రావాలని నిశ్చయించారు.

మెట్టగూడెంలో హరిజన కాలనీకి ప్రారంభోత్సవం

పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టరు శ్రీ గోవిందరాజన్ మే 3వ తేదీన బుట్టాయగూడెం పంచాయతీ సమితికి చెందిన మెట్టగూడెం గ్రామంలో 50 యిళ్లుగల గిరిజన కాలనీకి ప్రారంభోత్సవం చేశారు. ఈ కాలనీకి చెల్లప్ప కాలనీ అనిపేరు. హరిజనులకు, గిరిజనులకు గృహ వసతి కల్పించడంలో పశ్చిమ గోదావరి జిల్లాలో ఎంతో అభివృద్ధి సాధించడం జరిగిందనీ, వర్తమాన సంవత్సరంలో రూ. 65 లక్షలను ఖర్చుచేయడం జరుగుతుందనీ కలెక్టరు తెలియజేశారు. షెడ్యూలు కులాలు, షెడ్యూలు జాతుల సహకార గృహ నిర్మాణ సంఘం ఆధ్వర్యంలో మూడువేల యిళ్ళను నిర్మించే కార్యక్రమం చేపట్టబడినదని ఆయన చెప్పారు.




నల్గొండ జిల్లా కలెక్టరు ఏప్రెల్ 26న నల్గొండలో ఉపాధి-పునశ్చరణ శిక్షణ కార్యక్రమానికి ప్రారంభోత్సవం చేస్తున్న దృశ్యం.

సమితి అధ్యక్షులు శ్రీ ఎం. లక్ష్మణరావు తమ సమితి ప్రాంతంలో యింకా మరికొన్ని కాలనీలను మంజూరు చేయవలసి నదిగా కోరారు. బి. డి. ఓ. సూర్యనారాయణరాజు. కొవ్వూరు ఆర్. డి. ఓ. శ్రీ టి. మునిరత్నం ఈ సందర్భంగా ప్రసంగించారు.

నూలు పర్మిట్లు పంపిణీ

కావలి డివిజనల్ సహకార శాఖాధికారి శ్రీ వి. గోపాల కృష్ణమూర్తి మే 5వ తేదీన నెల్లూరు జిల్లాలోని కావలి డివిజన్‌కు చెందిన కోవూరు, పాతూరు, బుచ్చిరెడ్డి పాలెం, ఇనమడుగు గ్రామాలకు చెందిన మాస్టర్ వీవర్లకు 75 నూలు పర్మిట్లను పంపిణీచేశారు. దీనివల్ల ప్రభుత్వం ప్రకటించిన ధరకు నెల్లూరులోని నూలుమిల్లుల సమాఖ్యద్వారా 40,000 పౌన్ల నూలును పొందడానికి వీలవుతుంది. ఈ మాస్టర్ వీవర్లు మగ్గానికి 15 పౌన్ల చొప్పున చేనేత పనివారికి పంపిణీ చేస్తారు.



సాలూరులో కొత్తగా నిర్మించిన నర్సరీ భవనం

కొవ్వూరు సమితి అధ్యక్షులు శ్రీ కె. వెంకట రామరెడ్డి ఈ పంపిణీ కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తూ ప్రస్తుత పద్ధతి వల్ల 10 సెంట్ల పౌనుల జేలుకు 50 రూపాయల చొప్పున నేత పనివారికి ఖర్చు అదా అవుతుందని పేర్కొన్నారు.

నిజామాబాదు వ్యవసాయాధికార్లకు శిక్షణ శిబిరం

1973 సంవత్సరానికి ఖరీఫ్ ప్రణాళికను రూపొందించే సందర్భాన్ని పురస్కరించుకొని నిజామాబాదు జిల్లా వ్యవసాయ శాఖ, పంచాయతీరాజ్ శాఖల అధికార్లకు మే 2వ తేదీన నిజామాబాదులో శిక్షణ, పునశ్చరణ శిబిరం ఒకదానికి జిల్లా కలెక్టరు ప్రారంభోత్సవం చేశారు. ఆహారోత్పత్తిని అధికం చేయడానికి పలుపంటల పద్ధతిని ప్రవేశపెట్టాలని ఆ అధికార్లను కలెక్టరు కోరారు. ఖరీఫ్ పంటకాలానికి ముందే రైతులకు ఎరువులు, విత్తనాలు ఎంత అవసరమౌతాయో ఆ వివరాలన్నీ క్షుణ్ణంగా అధికార్లు చర్చించాలని కలెక్టరు సూచించారు. బ్లాకు పాలనా యంత్రాంగ వ్యవసాయం మీద తమ దృష్టిని యితోధికంగా కేంద్రీకరించాలని బి. డి. ఓ. లను ఆయన కోరారు.

వరిసేద్యం గురించి రుద్రూరులోని వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో ధాన్యం నిపుణుడు శ్రీ లక్ష్మీనారాయణ వివరించారు. వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీ ఖుర్షీద్ అలీ స్వాగతం చెప్పారు.

శ్రీకాకుళం జిల్లా చిన్న మొత్తాల పొదుపు సలహా సంఘం సమావేశం


జిల్లా రెవిన్యూ అధికారి శ్రీ యు. కె. రే అధ్యక్షతన శ్రీకాకుళంజిల్లా చిన్న మొత్తాల పొదుపు సలహాసంఘం సమావేశం మే 5న శ్రీకాకుళంలో జరిగింది. పంచాయతీరాజ్ సంస్థలలోనూ, ప్రభుత్వ వ్యవస్థలోనూ పేరోల్ పొదుపు పథకంను ప్రవేశ పెట్టడం గురించి, ప్రావిడెంటు ఫండును జాతీయపొదుపు పథకంతో మదుపు పెట్టడం గురించి చర్చించారు. జాతీయ పొదుపు సంస్థ సహాయ ప్రాంతీయాధికారి శ్రీ ఎం. ప్రకాశం వివిధ పొదుపు పథకాలను గురించి వివరించారు.

గుంటూరు జిల్లాలో కుటుంబ నియంత్రణ కేంద్రాలు

గుంటూరుజిల్లాలో 98 కుటుంబ నియంత్రణ ఉపకేంద్రాలను నిర్మించడానికి మంజూరీ లభించగా వాటిలో 52 కేంద్రాల భవనాల నిర్మాణం పూర్తయినట్టు జిల్లాకలెక్టరు శ్రీ కె. జయభారతరెడ్డి మే 7వ తేదీన తెలియజేశారు. కుటుంబనియంత్రణ ప్రధానకేంద్రాలు ఇరవైనాలుగింటికి కూడా మంజూరీ లభించింది. వీటిలో 12 భవనాల నిర్మాణం పూర్తయినట్టు పేర్కొన్నారు.

జనగామలో హరిజన కాలనీకి ప్రారంభోత్సవం

కేంద్ర కార్మికశాఖ మంత్రి శ్రీ కె. రఘునాథరెడ్డి మే 14న జనగామలో హరిజన కాలనీకి ప్రారంభోత్సవం చేస్తూ బలహీన వర్గాలవారికి సామూహిక సేద్యపుబావులు, గృహనిర్మాణ కాలనీలు, సమిష్టి వ్యవసాయంవంటి వాటిని ఏర్పాటు చేయడానికి జరుగుతున్న



ఖమ్మం జిల్లా కలెక్టరు మే 23న కరువునివారణకు యువజన శిబిరాన్ని ప్రారంభించారు.

ప్రయత్నాన్ని శ్లాఘించారు. సహకార సమిష్టి వ్యవసాయంక్రిందకు 11వేల ఎకరాల్ని తీసుకురాగలగడం యీ జిల్లా సాధించిన విజయమని కొనియాడారు. హరిజనులకు విడిగా కాలనీలు నిర్మించడం కొన్ని పట్టణాలలో, గ్రామంలో అగ్రవర్ణాల వారు నివసించే చోట్ల లోనే పెద్దయిళ్ళను నిర్మించడం మంచిదని శాసన సభ్యుడు డా॥ లింగయ్య చేసిన సూచనను మంత్రి హర్షించారు.

జనగామలోని హరిజన కాలనీని వరంగల్లు జిల్లా షెడ్యూలు కులాల, షెడ్యూలు తరగతుల సహకార గృహనిర్మాణ సంఘం నిర్మించింది. దీనికి రూ. 95,256 లు ఖర్చయ్యింది. 54 హరిజన కుటుంబాలకు వసతి సౌకర్యం లభిస్తున్నది.

బెల్లంపల్లి బొగ్గుగనులను కేంద్ర ఉపమంత్రి సందర్శన

కేంద్ర కార్మిక, పునరావాస శాఖల ఉపమంత్రి శ్రీ జి. వెంకటస్వామి మే 13న బెల్లంపల్లిలో ఒక సమావేశంలో మాట్లాడుతూ శ్రీమతి ఇందిరాగాంధీ నాయకత్వంలో కేంద్రప్రభుత్వం ప్రారంభించిన అభ్యుదయ పథకాలను అమలుపరిచి కార్మికులు, హరిజనులు, షెడ్యూలు కులాలు, వెనుకబడిన తరగతులు, తదితర బలహీనవర్గాల జీవనస్థాయిని మెరుగుపరచవచ్చునన్నారు.

గని కార్మికుల సమస్యలను గురించి ప్రస్తావిస్తూ ఆయన కార్మికుల సంక్షేమానికి కేంద్రప్రభుత్వం అన్ని విధాలాకృషి చేస్తున్నదని పేర్కొన్నారు, గని కార్మికుల సమస్యలను పరిష్కరించే ఉద్దేశంతో 1972 ఏప్రిల్ 11వ తేదీన తాను, గని కార్మికుల ప్రతినిధులు, సింగరేణి బొగ్గుగనుల యాజమాన్యం వారి ప్రతినిధులు, కేంద్ర గనుల శాఖామంత్రి, కార్మికమంత్రి, కార్మిక మంత్రిత్వశాఖ అధికారులు—వీరందరితో ఒక సమావేశాన్ని ఏర్పాటుచేసిన విషయాన్ని గుర్తుచేసారు. గని కార్మికుల సమస్యలను పరిష్కరించడంలోగల జాప్యాన్ని తొలగించడానికై పారిశ్రామిక వివాద చట్టాన్ని సవరించే ప్రతిపాదన వున్నట్టుకూడా ఆయన పేర్కొన్నారు.

పారిశ్రామికోత్పత్తిని పెంచడానికి కార్మికులు శక్తివంచన లేకుండా తోడ్పడవలసినదిగా ఆయన సలహా యిచ్చారు.

పుష్పగిరి ఉత్సవంలో ఎగ్జిబిషన్ ఏర్పాటు

కడపకు 16 కిలోమీటర్ల దూరంలో గల పుష్పగిరిలో ఏటా జరిగే ఉత్సవం సందర్భంగా మే 6వ తేదీన కడపజిల్లా కుటుంబ నియంత్రణశాఖకు సంబంధించిన ప్రచార—సమాచార విభాగంవారు ఆరోగ్యం, కుటుంబనియంత్రణ అంశాలమీద ఒక ఎగ్జిబిషన్‌ను ఏర్పాటుచేశారు. ఇది మూడు రోజులపాటు నిర్వహించబడింది. ఈ ప్రచార విభాగంవారు ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రము, క్షేత్ర సిబ్బంది సహాయంతో అక్కడ అనేకమంది దంపతులను కలుసుకుని కుటుంబనియంత్రణ పాటించవలసిన అవసరాన్ని గూర్చి వివరించారు. వివిధ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు.

కరువు నివారణకు యువత కృషి శిబిరాలు

మహబూబ్‌నగర్ జిల్లాకలెక్టర్ శ్రీ ఎం. అసదుల్లాసయీద్ అధ్యక్షతన 'కరువు నివారణకు యువతకృషిం' జిల్లా కమిటీ సమావేశమైంది. జిల్లాపరిషత్ కార్యదర్శి శ్రీ ఎం. దామోదరరెడ్డి మాట్లాడుతూ, కొర్లపాడు కొత్తపేటలలో శిబిరాల్ని ఏర్పాటు చేయడానికి మంజూరుకు సంబంధించిన ఉత్తర్వులు అందాయని పేర్కొన్నారు. గార్లపాడు శిబిరాన్ని జిల్లాపరిషత్ అధ్యక్షులు శ్రీ కె. కె. రెడ్డి, కొత్తకోట శిబిరాన్ని కలెక్టరు శ్రీ ఎం. అసదుల్లా సయీద్‌లు ప్రారంభోత్సవం చేశారు.

ఈ శిబిరాలు విజయవంతం కావడానికి కళాశాలల ప్రిన్సిపాల్‌లు తోడ్పడవలసిందిగా కలెక్టరు కోరారు.

దుబ్బాక సమితిలో ఖరీఫ్ పంట ప్రణాళికలు


మెదక్‌జిల్లాలోని దుబ్బాక సమితిలో ఖరీఫ్ పంటకాలంలో 1500 హెక్టార్లలో మేలురకం వరిని, 1500 హెక్టార్లలో సంకర మొక్కజొన్నను, 1000 హెక్టార్లలో సంకరజొన్నను, 2000 హెక్టార్లలో అరుణ ఆముదము మొక్కలను, 100 హెక్టార్లలో హెచ్. బి. 45 సెనగల్ని పండించాలని నిర్ణయించారు. IET 1990 రకం IET 1966 రకం వరికి సంబంధించిన చిన్నచిన్న ప్రదర్శనప్లాటులను 25ను ఏర్పాటు చేయాలని, H4 ప్రత్తిని 20 హెక్టార్లలో పండించాలని నిర్ణయించారు.

పశుగణాభివృద్ధి కార్యక్రమాల క్రింద బ్లాకు ప్రాంతంలో 50 శాతం సబ్సిడీకి 100 చిన్న చిన్న కోళ్ళ పెంపకం పరికరాల యూనిట్లను, 25 పెరడు కోళ్ళ పెంపకం పరికరాల యూనిట్లను, 250 మేలురకం పుంజులను, కోడిపిల్లల్ని పొదిగించేందుకు 2000 గ్రుడ్లను పంపిణీచేయాలని ఉద్దేశించారు.

ప్రాంతీయ కుటుంబనియంత్రణ శిక్షణ కేంద్రానికి ప్రారంభోత్సవం

ఆరోగ్యం, పురపాలకసంఘ నిర్వహణశాఖ కార్యదర్శి శ్రీ బి. ఆర్. కె. శాస్త్రి మే 17వ తేదీన వైజాగ్‌లో ప్రాంతీయ కుటుంబ నియంత్రణ శిక్షణ కేంద్రం నూతన భవనానికి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమాలను మరింత శీఘ్రంగా అమలు జరిగేట్టు చేయడానికి ఏ విధంగా యితర శాఖల వ్యక్తులను ఈ పరిధిలోకి తీసుకొనిరావాలో ఆలోచించాలని సూచించారు. ఇంతవరకు అద్దె భవనంలో వుంటున్న ప్రాంతీయ కుటుంబనియంత్రణ శిక్షణ కార్యాలయాన్ని యిప్పుడు కొత్తగా కట్టిన యీ భవనంలోకి మార్చడం జరిగింది. దీనిలో హాస్టలు భవనాలుకూడా వున్నాయి. రూ. 8 లక్షల ఖర్చుతో దీనిని నిర్మించారు. ఇది రాష్ట్రంలోని నాలుగు కేంద్రాలలోనూ ఒకటి. తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల శిక్షణ అవసరాలను యిది తీరుస్తుంది.

ఈ ఉత్సవానికి వైద్య, ఆరోగ్య శాఖల డైరెక్టర్ డాక్టర్ రమేష్‌షా అధ్యక్షత వహించారు. వైద్యాధికారులకు, తదితర క్షేత్ర సిబ్బందికి యిచ్చే శిక్షణవల్ల కుటుంబ నియంత్రణ రంగంలో నిరంతర పరిశోధనకు విస్తృత అవకాశాలు లభించి, తద్వారా యీ కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకపోవడానికి వీలవుతుందని ఆయన తెలియజేశారు.



కరీంనగర్ జిల్లాకలెక్టరు బావుల త్రవ్వకం ఉద్యమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం.

PRINTED BY THE DIRECTOR OF PRINTING, GOVT. OF ANDHRA PRADESH, AT THE GOVT. CENTRAL PRESS HYDERABAD
PUBLISHED BY THE DIRECTOR OF INFORMATION, PUBLIC RELATIONS & TOURISM ANDHRA PRADESH, HYDERABAD.

